



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...


తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 33 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 26 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-

## జీవితా బీమా.. అదానీకి ధీమా!

- ఎల్ఐసీ నిధుల మళ్లింపునకు రంగంలోకి ఆర్థిక శాఖ
- 34,251 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు
- అదానీ గ్రూప్‌లో ఎల్ఐసీ పెట్టుబడులకు కేంద్రం ఒత్తిళ్లు
- ముప్పుందని తెలిసినప్పటికీ పెట్టుబడులకు ఆమోదం
- విదేశీ బ్యాంకులు అదానీకి రుణాలు ఇవ్వకపోవడంతోనే
- అమెరికన్ పత్రిక 'ది వాషింగ్టన్ పోస్ట్'లో సంచలన కథనం
- ప్రజల డబ్బుతో మోదీ సర్కారు జూదమేంటి?: నిపుణులు

5



## భూగర్భంలో రయ్ రయ్

- దుబాయ్‌లో అండర్‌గ్రౌండ్ లూప్
- విద్యుత్తు వాహనాలతో హైస్పీడ్ జర్నీ
- ట్రాఫిక్ సమస్యల కట్టడే లక్ష్యం

## మోదీ సంపూర్ణ సహకారంతో

# డబుల్ స్పీడ్



- ఏడాదిలోనే సూపర్‌సిక్స్ అమలు చేశాం: సీఎం
- డబుల్ ఇంజన్ సర్కారుతోనే సాధ్యమైంది.. కేంద్రం చొరవతోనే ఆర్సెలార్ స్టీల్ ప్లాంట్
- వచ్చే నెలలో శంకుస్థాపన చేస్తున్నాం.. 16 నెలల్లో 10 లక్షల కోట్ల పెట్టుబడులు
- మరో రూ.5 లక్షల కోట్లు రానున్నాయ్ బిహార్ ఎన్నికల్లో ఎన్డీయేదే గెలుపు
- ఓ వార్తాసంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ నుంచి సంపూర్ణ సహకారం లభిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఏపీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అమలు చేయగలిగిందని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ పాలనే దీనికి కారణమన్నారు. తాజాగా ఓ ఆంగ్ల వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ విషయంలో మోదీ చొరవతో అవసరమైన అన్ని అనుమతులనూ శరవేగంగా సాధించగలిగామని, కేవలం రెండు నెలల్లో ఈ ప్రాజెక్టును తీసుకురాగలిగామని అన్నారు. 7.3 మిలియన్ టన్నుల ప్రారంభ సామర్థ్యంతో ఏర్పాటయ్యే ఈ స్టీల్ ప్లాంట్‌కు వచ్చే నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మోదీ రాజకీయ ప్రస్థానాన్ని ఆయన కొనియాడారు. 'దేశంలో చాలా ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మోదీ 2000 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లో విజయం సాధించారు. గతంలో గుజరాత్ సీఎంగా పనిచేశారు. 2014 నుంచి 11 ఏళ్లుగా ప్రధానిగా ఉన్నారు. మరో నాలుగేళ్లు కొనసాగుతారు. ఈ దశాబ్దం ఆయనదేననడంలో సందేహం లేదు.' అని పేర్కొన్నారు. 16నెలల్లో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు సాధించగలిగామని.. మరో 5 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని చంద్రబాబు తెలిపారు. ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రీన్ ఎనర్జీ, వ్యవసాయం, హార్టికల్చర్, లాజిస్టిక్స్, రాజధానిలో పెట్టుబడులకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నవంబరులో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేనే విజయం సాధిస్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీయే నాయకులు ఎప్పుడు కోరినా బిహార్ వెళ్లి ఎన్నికల ప్రచారం - మిగతా2లో

## బీఎంసీ ఎన్నికలపై బీజేపీ కసరత్తు

- 150 సీట్లలో పోటీ యోచన
- బీఎంసీ ఎన్నికల్లో ఠాక్రే సోదరులు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే పొత్తు పెట్టుకుంటారనే బలమైన అంచనాలు
- మహాయుతి కూటమిలో భాగంగా 140 నుంచి 150 సీట్లలో పోటీ చేయాలని కమలనాథుల ఆలోచన
- బీజేపీ భాగస్వామ్య పార్టీ అయిన ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన 70 నుంచి 80 సీట్లలో పోటీ చేసే అవకాశాలు

5



# ముంచుకొస్తున్న మొంథా



- 28 నాటికి తీవ్ర తుఫాన్‌గా బలపడుతుందని అంచనా
- ఆ రాత్రికి కాకినాడ-తుని మధ్య తీరం దాటే అవకాశం
- పలు జిల్లాల్లో అసాధారణ వర్షాలు
- 28 నుంచి 100 కి.మీ. వేగంతో గాలులు: ఐఎండీ
- ఒడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక
- ఓఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకూడదు
- ప్రభావిత జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించాలి
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం చంద్రబాబు ఆదేశాలు
- అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రానికి 'మొంథా' తుఫాన్ ముప్పు ముంచుకొస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుఫాన్ కోస్తాతో పాటు రాయలసీమలోని పలు జిల్లాలపై విరుచుకుపడనుంది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శుక్రవారం ఏర్పడిన అల్పపీడనం పడమర దిశగా పయనించి శనివారం ఉదయానికి వాయుగుండంగా బలపడింది. శనివారం సాయంత్రానికి చెన్నైకి 890 కి.మీ. తూర్పు ఆగ్నేయంగా, విశాఖపట్నానికి 920 కి.మీ., కాకినాడకు 920 కి.మీ. ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. ఇది ఆదివారం ఉదయానికి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించి తీవ్ర వాయుగుండంగా, ఆ తరువాత మరింత బలపడి సోమవారం ఉదయానికి తుఫాన్‌గా బలపడుతుంది. దీనికి - మిగతా2లో



# నిర్లక్ష్యపు నిప్పు

- ప్రైవేటు బస్సు విషాదంలో కీలక మలుపు
- బస్సు రాకముందే డివైడర్‌ను ఢీకొన్న బైకర్
- అక్కడికక్కడే శివశంకర్ మృతి.. స్నేహితుడికి గాయాలు
- రోడ్డు మధ్యలో పడిపోయిన బైక్
- తర్వాత ఇదే మార్గంలో వెళ్లిన 3 బస్సులు
- 2:55 గంటలకు వచ్చిన వి.కావేరి బస్సు
- ఆ బైక్‌ను తోసుకుంటూ ముందుకు
- రోడ్డు, బైక్ మధ్య రాపిడికి నిప్పు రవ్వలు
- బైక్ ట్యాంక్ మూత ఊడి పెట్రోలు బయటికి
- వెంటనే బస్సంతా వ్యాపించిన మంటలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేటు బస్సు ఘోర ప్రమాదానికి అసలు కారణం తెలిసింది. బస్సు మంటల్లో చిక్కుకొని 19 మంది ప్రయాణికులు సజీవ దహనమైన ఈ ఘటన ఎలా జరిగింది? కారణాలేంటి? అన్నది పోలీసుల దర్యాప్తులో తేలింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముందుగా భావించినట్లుగా పల్సర్ బైక్‌ను వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టడం వల్ల ప్రమాదం జరగలేదు. బస్సు రావడానికి ముందే పల్సర్ బైక్ డివైడర్‌ను ఢీ కొని ప్రమాదానికి గురైంది. బైక్ నడుపుతున్న శివశంకర్ అక్కడికక్కడే మరణించాడు. వెనుక కూర్చున్న అతని స్నేహితుడు - మిగతా2లో

## అభివృద్ధి కావాలా? ఆటవిక పాలనా?



- ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తిస్తాం
- ఓటరు జాబితా నుంచి పేరును తొలగిస్తాం
- వారి స్వదేశానికి పంపిస్తాం”
- ఆర్జేడీ పాలనలో హత్యలు, దోపిడీలు తదితర అనేక నేరాలు యథేచ్ఛగా జరిగాయి

5

## 12 వేల ప్రత్యేక రైళ్లు ఎక్కడ?

- కిక్కిరిసిపోతున్న బిహార్ రైళ్లపై కేంద్రాన్ని నిలదీసిన రాహుల్
- కొన్ని రైళ్లు సామర్థ్యానికి మించి 200 శాతం కెపాసిటీతో నడుస్తున్నాయి
- కేంద్రంలోనూ, బిహార్‌లోనూ అధికారంలో ఉన్న 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం పనితీరు ఇదేనా
- ప్రయాణం అత్యంత అమానవీయంగా మారింది.





## శ్రీ పద్మావతి యూనివర్సిటీలో లీనా బలరామినికి ప్రవేశం

మైలవరం



ఏపీ లాసెట్ ద్వారా తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గ్రామానికి చెందిన తాళ్ళూరి లీనా బలరామిని ఐదేళ్ళ బీఏ ఎల్.ఎల్.బి కోర్సుకు గాను ప్రవేశాన్ని పొందింది. ఏపీ లాసెట్ లో 1521 ర్యాంక్ సాధించి, తదుపరి కౌన్సిలింగ్ లో తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రాధాన్యతగా ఎంచుకోగా ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ కోటాలో సెల్ఫ్ ఫైనాన్స్ క్రింద లీనా బలరామిని సీటు సాధించింది. ఈ మేరకు సీటు ఎలాట్ మెంట్ వివరాలను ఏపీ లా సెట్ వెబ్ సైట్ లో విడుదల చేశారు. లీనా బలరామిని మైలవరం జెడ్పీ హెచ్ గర్ల్స్ హైస్కూల్ ప్లస్ నందు ఇంటర్మీడియట్ బైపీసీ చదివి 933 మార్కులతో కళాశాలలో తృతీయ స్థానాన్ని పొందింది. జడ్జిగా సేవలందించాలనే ఆశయంతో లాసెట్ ద్వారా జూన్ నెలలో పరీక్ష వ్రాసి, ర్యాంక్ సాధించడం ద్వారా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్రవేశం సాధించింది.



నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ క్లబ్ రోడ్డులోని కొండపావులూరి గార్డెన్స్ నందు నాగపుట్ట వద్ద భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

- తాడేపల్లి

# ముంచుకొస్తున్న మొంథా

-మొదటిపేజీ తరువాయి

థాయ్‌లాండ్ దేశం సూచించిన 'మొంథా' అని పేరు పెట్టనున్నారు. ఇది 28 సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ వద్ద (ఒక అంచనా మేరకు కాకినాడ-తుని మధ్య) తీరం దాటుతుందని ఐఎండీ తెలిపింది. ఈ నేపథ్యంలో 28న ఉదయం కోస్తాలో తీరం వెంబడి గంటకు 60నుంచి 70 కి.మీ. వేగంతో గాలులు వీయనున్నాయి. తుఫాన్ తీరం దాటే సమయంలో గాలులు 90 నుంచి 110 కి.మీ. వేగంతో వీస్తాయి. తుఫాన్ ప్రభావంతో భారీ నుంచి అతిభారీ, అక్కడక్కడా కుంభవృష్టిగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో 27 నుంచి 29 వరకూ పలు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ నెల 29 వరకు కోస్తాలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని ఐఎండీ హెచ్చరించింది. శనివారం విశాఖ నుంచి కృష్ణపట్నం వరకు ఓడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీచేశారు.

**బీచ్‌లకు పర్యాటకుల ప్రవేశంపై నిషేధం**

ఆదివారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, దక్షిణ కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని, సోమవారం నుంచి వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. తుఫాన్ ప్రభావంతో సముద్రం అలజడిగా మారి, అలలు ఎగసిపడే అవకాశం ఉన్నందున సముద్ర తీరాలు, నదుల్లో చేపలు పట్టడం, అన్ని బోటింగ్ కార్యకలాపాలను నిలుపుదల చేసి, బీచ్‌లకు పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించాలని కోస్తా జిల్లాల కలెక్టర్లకు సూచించినట్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

**కాకినాడ పోర్టు అప్రమత్తం**

తుఫాన్ ముప్పు ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. అదనపు కరెంటు స్తంభాలు, సిబ్బంది, జనరేటర్లను సిద్ధం చేస్తున్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు కాకినాడ పోర్టుల్లో అన్ని కార్గో ఎగుమతి, దిగుమతులు నిలిపివేయనున్నారు. ఇక్కడ లంగరు వేసిన ఓడలను సోమవారం మధ్యాహ్నం నుంచి సముద్రంలోకి తరలించనున్నారు.

**అప్రమత్తంగా ఉండండి: సీఎం**

'మొంథా' ముప్పు నేపథ్యంలో ప్రతి జిల్లా కలెక్టర్ తుఫాన్ రక్షణ చర్యలకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని, తగిన వనరులతో సన్నద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా ఇప్పటి నుంచే సన్నాహక చర్యలు సమగ్రంగా చేపట్టాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత జిల్లాలకు ఇన్‌చార్జి అధికారులను నియమించి, నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. తుఫాన్ ప్రభావం ఉండే అన్ని మండలాల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లు సహా ఇతర అధికారులను సీఎస్ విజయానంద్ ఆదేశించారు. భారీవర్షాలు, వరదలను దృష్టిలో ఉంచుకుని, సహాయ కార్యక్రమాలకు 11 జిల్లాలకు ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. విపత్తు సహాయ కార్యక్రమాలకు తక్షణ ఖర్చులు భరించడానికి ఈ నిధులు తీసుకోవటానికి జిల్లా కలెక్టర్లకు అనుమతిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

**విపత్తు సహాయం పంపిణీ: మంత్రి నాదెండ్ల**

శనివారం సాయంత్రం పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి నాదెండ్ల మనోహర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని తీరప్రాంత జిల్లాల్లోని మండల స్థాయి స్టాక్ పాయింట్లలో నెలవారీ కేటాయింపుల కంటే ఎక్కువగా స్టాక్ ఉంచాలని ఆదేశించారు. తుఫాను షెల్టర్లు, సహాయక శిబిరాల్లో ఆహారాన్ని తయారు చేయడానికి ఎంఎల్ఎస్ పాయింట్లలో అందుబాటులో ఉన్న బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను ఉపయోగించుకోవాలన్నారు. జిల్లాల్లో ఇప్పటికే కోసిన వరి ధాన్యాన్ని సమీపంలోని రైస్ మిల్లులకు తరలించేందుకు వ్యవసాయాధికారులతో సమన్వయం చేసుకుని తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

**పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు**

తుఫాను హెచ్చరికలతో అధికారులు అప్రమత్తం తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అధికారులు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అన్నమయ్య, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో సోమ, మంగళవారాలు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సోమవారం నుంచి బుధవారం వరకు మూడురోజుల పాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కోనసీమ జిల్లాలో తుఫాను హెచ్చరికలకు అనుగుణంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్ ఆదేశించారు.

# నిర్లక్ష్యపు నిప్పు

-మొదటిపేజీ తరువాయి

ఎర్రిస్వామి మరొకరు గాయపడ్డాడు. బైకు రోడ్డు మధ్యలో పడిపోయింది. బైక్‌ను ప్రైవేటు బస్సు తోసుకుని వెళ్లడంతో ప్రమాదం జరిగి, బస్సు మంటల్లో చిక్కుకొందని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఎర్రిస్వామిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. బైక్ కదలికలకు సంబంధించిన వీడియో ఫుటేజీలు పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చారు.

**పోలీసుల దర్యాప్తులో మలుపు**

గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయల్దేరిన వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన డీడీ01 ఎన్9490 ఏసీ స్లీపర్ బస్సు శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో బస్సులో 44 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు కలిపి 46 మంది ఉన్నారు. మంటల్లో చిక్కుకున్న ఈ బస్సులో అద్దాలు పగులగొట్టి 27 మంది ప్రయాణికులు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. మంటల్లో చిక్కుకుని 19 మంది మరణించారు. ఈ దుర్ఘటనలో బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంపై దర్యాప్తు బాధ్యతను పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యకు అప్పగించారు. శుక్రవారం రాత్రే రంగంలోకి దిగిన పోలీస్ విచారణ బృందం కర్నూలు నగరం నుంచి చిన్నటేకూరు సమీపంలో ప్రమాదం జరిగిన ప్రదేశం వరకు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బస్సు తగలబడిపోవడానికి కారణమైన పల్సర్ బైక్‌కు సంబంధించిన ఫుటేజీలు గుర్తించారు. బైక్‌పై వెళ్తూ మరణించిన శివశంకర్‌తోపాటు ఉన్న మరో యువకుడిని ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. ఆ యువకుడిని తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన సి.ఎర్రిస్వామిగా గుర్తించారు. ఆ యువకుడిని అదుపులో తీసుకొని పోలీసులు విచారించారు. ముందు వెళ్తున్న పల్సర్ బైక్‌ను ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో బైకర్ బి.శివశంకర్ ఎగిరి పక్కకు పడిపోయి మృతి చెందాడని, ఆపకుండా ముందుకు వెళ్లడంతో ప్రమాదం జరిగిందని మొదట్లో పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన విషయం తెలిసిందే. కానీ కేసు దర్యాప్తులో మలుపు తిరిగింది.

**ప్రమాదానికి ముందు ఏం జరిగిందంటే...**

కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు గ్రామం ప్రజానగర్‌లో నివాసం ఉంటున్న బి.శివశంకర్, తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన సి.ఎర్రిస్వామిలు ఇద్దరూ స్నేహితులు. గురువారం రాత్రి ఇద్దరూ కర్నూలులో భోజనాలు చేశారు. ఎర్రిస్వామిని అతడి స్వగ్రామం రాంపల్లిలో దింపి వస్తానని శివశంకర్ తన బైక్‌పై ఎక్కించుకొని గురువారం అర్ధరాత్రి బయలుదేరాడు. 'వర్షం వస్తోంది.. ఉదయమే వెళ్తా' అని ఎర్రిస్వామి వారించినా వినలేదు. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి-44లో చిన్నటేకూరు సమీపంలో కియ షోరూం ఎదురుగా ఉన్న ఓ బంకులో రూ.300కు పెట్రోల్ పట్టించుకున్నారు. అప్పుడు సమయం అర్ధరాత్రి 2:24 గంటలు. బైక్‌కు హెడ్‌లైట్ వెలగడం లేదని, లెఫ్ట్ ఇండికేటర్ వెలుతురులోనే వెళ్లారని బంకు సిబ్బంది తెలిపారు. ఆ తర్వాత 2:42 గంటల ప్రాంతంలో ఆరంఘర్ హొటల్ వద్ద సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యారు. అక్కడి నుంచి రెండు కి.మీ. వెళ్లాక 2:45 గంటల సమయంలో బైక్ కుడివైపు డివైడర్‌ను ఢీకొని రోడ్డు మధ్యలో పడిపోయింది. వెనకాల కూర్చున్న ఎర్రిస్వామి డివైడర్ మధ్యలో గడ్డిపై పడటంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. రోడ్డుపై పడిపోయిన బి.శివశంకర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చలనం లేని మిత్రుడిని ఎర్రిస్వామి రోడ్డు పక్కకు లాగాడు. ఆ తర్వాత పది నిమిషాల వ్యవధిలో ఓ ఆర్టీసీ బస్సు సహా మూడు బస్సులు అదే మార్గంలో బెంగళూరు వైపు వెళ్లాయి. రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్‌ను గమనించి పక్కన వెళ్లాయి. రోడ్డు మధ్యలో పడిపోయిన బైక్‌ను పక్కకు లాగేద్దామని ఎర్రిస్వామి ప్రయత్నించాడు. ఇంతలో 2:55 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వచ్చింది. రోడ్డు మధ్యలో పడిఉన్న ఆ బైక్‌ను తోసుకుంటూ వెళ్లింది. భారీ శబ్దం రావడంతో డ్రైవర్ బ్రేక్ వేసి వదిలి ముందుకు వెళ్లాడు. మళ్లీ భారీ శబ్దం రావడంతో మరోసారి బ్రేక్‌వేసి వదిలాడు. ఈ క్రమంలో బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్ ట్యాంక్ మూత తెరుచుకొని పెట్రోల్ రోడ్డుపై కారుతూ వచ్చింది. బైక్, రోడ్డు మధ్య రాపిడి వల్ల నిప్పురవ్వలు ఎగిసి పెట్రోల్‌ను అంటుకుంది. క్షణాల్లో బస్సు మొత్తం మంటలు వ్యాపించడంతో 15 నిమిషాల్లో ఘోరం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఏపీకి చెందిన ఆరుగురు, తెలంగాణకు చెందిన ఆరుగురు, కర్ణాటకకు చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, బిహార్, ఒడిశాకు చెందిన ఒక్కొక్కరు, గుర్తు తెలియని మరో వ్యక్తి కలిపి 19 మంది సజీవదహమైన సంగతి తెలిసిందే.

**బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం..**

ప్రమాద ఘటనకు ప్రైవేటు బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎంత వర్షం పడుతున్నా బస్సు హెడ్ లైట్ వెలుతురుకు రోడ్డుపై ముందు భాగంలో పడిపోయిన బైక్‌ను గుర్తించకపోవడం బాధ్యతారాహిత్యమని అంటున్నారు. బైక్‌ను ఢీకొనగానే దఢేల్‌మనే భారీ శబ్దం వచ్చిందని ప్రయాణికులు చెబుతున్నారు. శబ్దం రాగానే బ్రేక్ వేసి వదిలేశానని డ్రైవర్ లక్ష్మయ్య కూడా పోలీస్ విచారణలో వెల్లడించినట్లు సమాచారం. తక్షణమే బస్సు ఆపేసి కిందకు దిగి ఏం జరిగిందో గుర్తించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని అంటున్నారు. 19 మంది ప్రాణాలు అగ్నికి ఆహుతి అయ్యేవి కావని అభిప్రాయపడుతున్నారు. బస్సు ముందు భాగంలో పల్సర్ బైక్ ఇరుక్కుపోయినా డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా దాదాపు 200 మీటర్ల వరకు బస్సును వేగంగా ముందుకు పోనిచ్చాడు. ప్రమాదంలో బస్సులో మంటలు వ్యాపించాయి. ట్రావెల్ యాజమాన్యం రవాణా శాఖ నిబంధనలు పాటించకపోవడం కూడా ప్రమాద తీవ్రతను పెంచిందని అంటున్నారు.

**ముందుగానే బైక్ ప్రమాదం**

బస్సు ప్రమాదంపై ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాం. సీసీ ఫుటేజీలు పరిశీలించాక శివశంకర్ బైక్‌పై వెళ్లిన ఎర్రిస్వామితో పాటు ప్రైవేటు బస్సు డ్రైవర్లు ఇద్దరిని విచారించాం. వారు చెప్పిన వివరాలు పరిశీలిస్తే.. డివైడర్‌ను ఢీకొట్టడం వల్ల బైక్ రోడ్డుపై పడిపోయింది. శివశంకర్ తలకు బలమైన గాయాలై మృతి చెందాడు. ఎర్రిస్వామి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఎర్రిస్వామి హైదరాబాద్ జీహెచ్ఎంసీలో పని చేస్తున్నాడు.

## వైసీపీ ప్రజా ఉద్యమం పోస్టర్ల ఆవిష్కరణ



కోట,

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 28న చేపట్టనున్న ప్రజా ఉద్యమం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వైస్సార్సీపీ కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు చంద్రబాబు నాయుడు అప్పనంగా కట్టబెట్టడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఈ నెల 28వ తేదీన ఉదయం 9 గంటలకు గూడూరులో టవర్ క్లాక్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు అనుబంధం విభాగల సభ్యులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ రెడ్డి, వజ్జ రామచంద్రారెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్ రెడ్డి, శశిధర్ రెడ్డి, పరంధం రెడ్డి, మండల జాయింట్ సెక్రటరీ పాముల సురేంద్ర, జరుగుమల్లి ఉపసర్పంచ్ కస్తూరయ్య యాదవ్, సర్వరెడ్డి భక్త వత్సల రెడ్డి, రుద్రవరం సర్పంచ్ నన్నినెల మస్తానయ్య, షైక్ భాష, నాగూర్ భాష, స్టేట్ బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ కనుపూరు జగదీష్, పరంధం మునికుమార్, ముచ్చకాల వెంకటకృష్ణయ్య, కొత్తపట్నం శంకరయ్య, ఆములూరు నాగార్జున, వేనాటి సాయి కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కుటుంబానికి ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శ



గన్నవరం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నెక్కలపు శ్రీనివాసరావు కుటుంబాన్ని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరామర్శించారు. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే యార్లగడ్డ గన్నవరం గౌడ పేటలోని శ్రీనివాసరావు నివాసానికి చేరుకుని శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ సుమారు 8 సంవత్సరాల క్రితం తాను నియోజవర్గానికి వచ్చినప్పటినుండి శ్రీనివాస్ తో పరిచయం ఉందని గుర్తుచేసుకున్నారు. ప్రజాశక్తిలో పనిచేస్తున్నప్పటికీ ఏ పార్టీకి కొమ్ము కాయకుండా వార్తలు రాసేవారని తెలిపారు. మృతి చెందిన శ్రీనివాసరావు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గౌడ పేటలోని స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎమ్. సురేంద్ర సోదరి ఈశ్వర విజయలక్ష్మి ఇటీవల మరణించగా సాయంత్రం శ్రీనగర్ లోని విజయలక్ష్మి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. గన్నవరం నియోజకవర్గ టిడిపి క్లస్టర్ కన్వీనర్ షేక్ కరీముల్లా సోదరి షేక్ మస్తాన్ బీ ఇటీవల మరణించగా మస్తాన్ బీ కుటుంబ సభ్యులను యార్లగడ్డ పరామర్శించారు. తదుపరి గన్నవరం మండలం దావాజీగూడెం గ్రామానికి చేరుకున్న యార్లగడ్డ ఇటీవల మరణించిన కోనేరు కృష్ణారావు చిత్రపటానికి యార్లగడ్డ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల టీడీపీ అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, ఎంపీటీసీ పటమట రంగారావు, వైస్ ఎంపిపి కొమ్మరాజు సుధీర్, టీడీపీ నాయకులు గొంది నరేంద్ర, ఎంపీటీసీ మద్దినేని వెంకటేశ్వరావు, నాగార్జున, రంగబాబు, కొమ్మరాజు సుధీర్, పాలడుగు నాని, మన్నెం శ్రీనివాసరావు, ధర్మారావు, కారంపూడి సాంబయ్య, బస్సే నాగప్రసాద్, కొసరాజు రాము, తదితర టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోదీ సంపూర్ణ సహకారంతో డబుల్ స్పీడ్

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

**తెలుగు ప్రవాసులతో నెట్‌వర్క్**

వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వారందరినీ ఒక్కతాటిపైకి తెచ్చేందుకు కృషిచేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. ఇందులో భాగంగా ప్రవాస తెలుగు సమూహాలతో ఓ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దీనిద్వారా తెలుగువారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 'తెలుగు సమాజం భవిష్యత్‌లో ఒకనాటికి ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన, శక్తివంతమైన సమాజంగా నిలుస్తుంది' అని స్పష్టం చేశారు.జ

## అర్హత లేకున్నా హెవీ డ్రైవింగ్ లైసెన్స్!

**కర్నూలు వద్ద ప్రమాదానికి గురైన బస్సు డ్రైవర్ నిర్వాకం**

కర్నూలు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున 19 మంది సజీవ దహనానికి కారణమైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య అర్హత లేకున్నప్పటికీ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ప్రమాదం నేపథ్యంలో పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన లక్ష్మయ్య కుటుంబ నేపథ్యం, ప్రవర్తన, అలవాట్లపై అధికారులు ఆరా తీశారు. ఈయన 5వ తరగతి వరకే చదువుకున్నాడని, అయితే టెన్త్ ఫెయిల్ అయినట్లు సర్టిఫికెట్ ఇచ్చి, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాడని గుర్తించారు. మొదట లారీ క్లీనర్‌గా, తర్వాత డ్రైవర్‌గా పని చేశాడు. 2004లో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టుకు ఢీకొనడంతో అప్పట్లో లారీ క్లీనర్ మృతి చెందాడు. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా మానేసి కొన్నాళ్లు ట్రాక్టర్ కొని స్వగ్రామంలో వ్యవసాయం చేశాడు. తర్వాత ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా ఏడెనిమిదేళ్ల నుంచి వెళ్తున్నాడని తెలిసింది. లక్ష్మయ్య తండ్రి రాములు రెండు నెలల కిందట మృతి చెందాడు. ఇతనికి భార్య, ఓ కుమారుడు, ఓ కుమార్తె, ఒక సోదరుడు, ఇద్దరు అక్కలు ఉన్నారు. లక్ష్మయ్యకు అప్పుడప్పుడు మద్యం సేవించే అలవాటు ఉందని సమాచారం.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...




కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం, 26 అక్టోబర్ 2025




www.viswamvoice.com




## నిత్య రక్షణలో




# నిరంతర యోధులు


రావులపాలెం ఎస్సై సురేష్‌బాబు


డి.ఎస్.పి. రఘువీర్


సి.ఐ. దొరరాజు


ఎస్.ఐ. రాహుల్ మీనా


ఐ.జి. అశోక్‌కుమార్

- దేశ రక్షణలో త్రివిధ దళాలకు, అదనపు బలంగా నాలుగో సింహం
- దేశ భద్రతకు దేహాన్నైనా త్యాగమిచ్చే రక్షకభటులు
- రక్షణ కల్పిస్తూనే హేళనకు గురవుతున్న పోలీస్ బాబాయ్
- ఫ్రెండ్లీ పోలీసింగ్, ప్రొఫెషనల్ పోలీసింగ్‌తో సమాజానికి చేరువవుతున్న సేవలు
- అవినీతి ఆరోపణలతో అపకీర్తి పాలవుతున్న వ్యవస్థ
- కనిపించే నాలుగో సింహంలో కనిపించని మరో కోణం
- కర్తవ్య నిర్వహణలో ఖద్దరు అజమాయిషీ, కష్టమైనా తప్పని దుస్థితి
- పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ప్రత్యేక కథనం

"రిపోర్టర్ చందు" (రాయవరం)

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** దేశ సరిహద్దుల్లో త్రివిధ దళాలు శత్రు సైన్యం చొరబడి, దాడులు జరగకుండా, పగలు,రాత్రి గస్తీ కాస్తూ రక్షణ కల్పించే సైనికులు దేశ రక్షణలో ఒక భాగమైతే, దేశంలో అంతర్గతంగా ఉంటూ చట్ట పరిరక్షణ, సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో, ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్న పోలీసు వ్యవస్థ దేశానికి మరొక రక్షణ కవచం. దేశంలో చట్ట పరిరక్షణ, శాంతిని నెలకొల్పడం లో భాగంగా పోలీసు వ్యవస్థ ప్రదర్శిస్తున్న ధైర్య సాహసాలు. ఎంతోమంది యువకులు పోలీసులు కావాలని కలలు కనడానికి స్ఫూర్తినిస్తూ, ప్రోత్సహిస్తాయి. విద్యార్థులకు సక్రమమైన విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు బెత్తం ఇచ్చినట్లే, పౌరులకు భద్రత కల్పిస్తూ, చట్టాన్ని మీరి ప్రవర్తించకుండా కాపాడేందుకు పోలీసులు చేతిలో లాఠీని పెట్టిందంటే, దేశ రాజ్యాంగం పోలీస్ వృత్తి పై ఎంత బాధ్యత పెట్టిందో గ్రహించవచ్చు. పై స్థాయి నుంచి క్రింది స్థాయి వరకూ సమయం తో పనిలేకుండా అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు అహర్నిశలు కష్టపడుతూ, దేశ భద్రత, చట్ట పరిరక్షణ విషయంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతూ, సేవ చేస్తున్నప్పటికీ, ఖాకి దుస్తులు అంటే సమాజానికి ఒక రకమైన భయం, మరొక రకంగా చిన్నచూపు.. ప్రమాదమైనా, విపత్కర పరిస్థితులైనా, సంఘటన ఏదైనా సమాచారం అందగానే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దడంతో పాటు, సమీక్షించడంలో ప్రథమ పాత్ర పోలీసులదే..

### పోలీసు అమరవీరుల సంస్మరణ

1959 అక్టోబరు 21న డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలో పంజాబ్ కు చెందిన 21 మంది సభ్యులతో కూడిన బృందం సరిహద్దుల్లో ఆక్సయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తులో రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్య గస్తీ కాస్తూ, విధులు నిర్వర్తిస్తుండగా, చైనా దేశానికి చెందిన రక్షణ బలగాలు సియాచెన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్పీఎఫ్ దళం ఆ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడింది. ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలను కోల్పోయి అమరులయ్యారు. హాట్ స్ప్రింగ్స్ అంటే వేడి నీటిబుగ్గ అని అర్థం కాగా భారత జవాన్ల రక్తంతో తడిచిన హాట్ స్ప్రింగ్స్ నెత్తుటి బుగ్గగా మారి పవిత్రస్థలంగా రూపు దిద్దుకుంది. ప్రతి ఏడాదీ అన్ని రాష్ట్రాల పోలీసులతో కూడిన బృందం ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి నివాళులు అర్పించడం ఆనవాయితీ.

### ఎంత చేసినా, చిన్నచూపే...

ఉద్రిక్త పరిస్థితులలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారినుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రాణాలకు తెగిస్తున్న పరిస్థితులు ఎన్నో కనబడుతున్నాయి. అలాంటి అమరవీరుల జీవితం ఎందరికో ఆదర్శం.. చట్ట పరిరక్షణ కొరకు ప్రాణాలకు తెగించి, ఉద్యోగ ధర్మం నిర్వహిస్తున్న పోలీసులపై ఎనలేని గౌరవం కలుగుతున్నప్పటికీ. కొంతమంది నీతి, నిజాయితీ మరిచిన దౌర్భాగ్యులైన పోలీసుల అవినీతి వలన యావత్తు పోలీసులపై సమాజంలో గౌరవం కొరవడుతోంది.. కేసుల నెపంతో కాసులు కురిపించే ఖద్దరు నేతలకే ఫ్రెండ్లీ పోలీసింగ్ అని, వారి మాటే పోలీసులు వింటారని, వారి పక్షానే ఉంటారనే నమ్మకం వేళ్ళూరుకు పోయింది. సామాన్యుడి పక్షాన న్యాయం నిమిత్తం మొదట చేరుకునేది పోలీస్ స్టేషన్ కే అయినప్పటికీ క్రింది స్థాయి పోలీసులు సైతం వారితో హేళనగా మాట్లాడటం, ఇది తీసుకుని రా, ఆ పనిచెయ్, అని స్టేషన్ కు వచ్చిన వారిపై అజమాయిషీ చేస్తూ చిన్న,చిన్న అవసరాలకు సైతం ఇబ్బంది పెట్టడం ఒకటైతే, యూనిఫాం వేసుకుని రోడ్డెక్కారంటే సకలం ఉచితమేనని, జేబులు నింపుకుని కాని వెళ్ళరనేది మరొక కారణం. వీటి వలన ఎంతో నిజాయితీగా ఉద్యోగ ధర్మం నిర్వర్తించినప్పటికీ ఈ కారణాలతో పోలీసులంటే ఒక రకమైన భయంగా మారింది. కాని దేశంలో శాంతి భద్రతలను కాపాడడంలో అహర్నిశలు శ్రమించే ఖాకీల కష్టాలు వర్ణనాతీతమనే చెప్పాలి. ఎన్నికలు, ఉత్సవాలు, నాయకుల పర్యటనల సమయంలో త్రాగునీరైనా, ఇచ్చేవారు లేక వాతావరణం పరిస్థితులు ఏవైనా ఉన్న కొద్దిపాటి సౌకర్యాలనే, తమకు దక్కిన విలాసంగా, సర్దుకుని కర్తవ్య నిర్వహణలో సాగిపోవడం ఖాకీలకే చెల్లుతుంది. చిత్రమైన విషయమేమిటంటే నేరాలు జరిగితే పోలీసు వ్యవస్థ కర్తవ్య నిర్వహణలో గాడి తప్పిందని ఆడిపోసుకునే సమాజం. సిన్సియర్ గా ఉద్యోగం చేస్తూ వాహనాల తనిఖీలు చేసే సమయంలో తప్పనిసరి అయిన పత్రాలు దగ్గర ఉంచుకోవడం మాని, పోలీసు బాబాయ్ చేతిలో ఎంతో కొంత పెడితే సరిపోతుంది లే అని లంచాలను ప్రోత్సహించడం, లేదా వారి నుండి తప్పించుకోవాలని ప్రయత్నించడం మరలా పోలీసులను చులకన చేసి మాట్లాడడం ప్రొఫెషనల్ పోలీసింగ్‌ను హేళన చేయడమే.. దొంగతనాలను అరికట్టడం తో పాటు, వివాదాలైనా, విపత్కర పరిస్థితులైనా ముందు వరుసలో నిలబడి ఎదురెళ్ళడం పోలీసుల మేనరిజం.. అయినప్పటికీ చెడ్డీగ్యాంగ్, అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు ఎప్పటికప్పుడు కొత్త సవాళ్ళను పోలీసుల ముందు ఉంచుతూ ఇబ్బందులకు గురి చేయడం ఒక ఎత్తయితే, స్థానిక రౌడీల దాడులు, రాజకీయ ఘర్షణల వంటి ప్రతి విపత్కర పరిస్థితుల్లోనూ తమ కుటుంబాల కోసం ఏమాత్రం ఆలోచించకుండా కష్టాలకు ఎదురెళ్లి అసువులు బాసిన అమరవీరులు ఎందరో చరిత్రలో నిలిచిపోయారు. వీరిని స్మరించుకుంటూ చేసే ప్రత్యేక కార్యక్రమం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం. కర్తవ్య నిర్వహణే ఊపిరిగా బ్రతికే ఖాకీలకు హృదయపూర్వక కృతజ్ఞతలు..

## ఎన్.ఎం.ఈ.ఎల్ చర్చ్ సంఘ కాపరిగా

# గుర్రపు కిరణ్ బాబు నియామకం

**సబ్ కలెక్టర్, పోలీస్ అధికారుల సమక్షంలో చర్చి తాళాలు అప్పగింత - ఎన్ఎంఈ సంఘంలో శాంతి స్థాపనకు అభివృద్ధికి కృషి చేస్తా ..**

ఎన్ఎంఈ లూథరన్ చర్చ్ కాపరి రెవరెండ్ గుర్రపు కిరణ్ బాబు వెల్లడి







**ధవలేశ్వరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవలేశ్వరంలో ఉన్న ఎన్ఎంఈ లూథరన్ సంఘానికి లీగల్‌గా, చట్టబద్ధంగా కాపరిగా తనను నియమించినట్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సంఘ కాపరి రెవరెండ్ గుర్రపు కిరణ్ బాబు తెలిపారు. శనివారం ధవలేశ్వరం ఎన్ఎంఈ లూథరన్ చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘం కంట్రోలర్‌గా జస్టిస్ కొరియన్ జోసెఫ్ హైకోర్టు సీజే నియమించినట్లు తెలిపారు వారి ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేటర్‌గా నియమింపబడ్డారని వివరించారు. వారి పర్యవేక్షణలో ఏఎల్‌సి సంఘంలో జరిగిన అవకతవకల పై విచారణ జరిపి సంఘాలలో సజావుగా ఎన్నికలు జరిపించేందుకు చర్యలు తీసుకున్నారు అని తెలిపారు. గత నాలుగు నెలల కాలంగా సంఘంపై విచారణ జరిపి గతంలో పాస్టర్ గా విధులు నిర్వహించిన ఎస్ అనిల్ కిరణ్ కు షో కాజు నోటీసులు ఇచ్చారని తెలిపారు. అయితే ఆ నోటీసులకు ఏ విధమైన సంజాయిషీ ,గాని వివరణ ఇవ్వకపోవడంతో 25/9/2025న ఆయనను సంఘం విధులు నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్సవములు జారీ చేసినట్లు తెలిపారు. తనను ఎన్ఎమ్ఈ లూథరన్ సంఘానికి కాపరిగా 25/ 9/ 2025న నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఇక్కడే పుట్టి సండే స్కూల్ నుంచి చర్చికి సేవలు అందించినట్లు వివరించారు. ఎన్.ఎం.ఈ సంఘానికి కాపరిగా నియమింపబడును దేవుని కృప అని అన్నారు. గతంలో తనపై దాడులు చేసి చర్చిలో సేవ చేసేందుకు అడ్డుకున్నారని తెలిపారు. ఎన్ఎంఈ చర్చ్ అభివృద్ధికి కృషిచేసి సంఘము నుంచి వెళ్లిన సభ్యులను తిరిగి సంఘంలోకి రప్పించి చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ అడ్వకేట్ గుమ్మడి పరమాత్మ మాట్లాడుతూ 15 నెలల నుంచి ఎన్ఎంఈ సంఘం స్థితిగతులను గుంటూరులో ఉన్న ఏ ఎల్ సి పెద్దలు అవకతవగలపై విచారణ జరిపారని తెలిపారు. గతంలో పాస్టర్‌గా విధులు నిర్వహించిన ఎస్. అనిల్ కిరణ్ చేసిన అవకతవకలు, నిధులు దుర్వినియోగం చేయడం నిర్ధారణ కావడంతో ఆయనను విధుల నుంచి తొలగించారని తెలిపారు. నూతనంగా సంఘ కాపరిగా రెవరెండ్ గుర్రపు కిరణ్ బాబు నియమించినట్లు తెలిపారు. చర్చి తాళాలను సబ్ కలెక్టర్, ఎమ్మార్వో, డీఎస్పీ, సిఐ, ఎస్ఐ, పోలీస్ అధికారుల సమక్షంలో గుర్రపు కిరణ్ బాబుకు శాశ్వత కాలపరిమితిలో అప్పగించారని వివరించారు. విలేకరుల సమావేశంలో ఎన్ఎంఈ సంఘ సభ్యులు ఐతా బత్తుల ప్రసాద్, పీతల ముత్యాలరావు, నక్క శ్యాంసుందర్, సకిలే రమేష్, తేగల రాజకుమార్, పీతల ఇమ్మానుయేలు రాజు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ అధికార ప్రతినిధిగా

# మార్గాని భరత్ రామ్ నియామకం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్సీపీ రాజమహేంద్రవరం మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్‌ను జాతీయ అధికార ప్రతినిధిగా నియమించబడమైనదని తాడేపల్లి వైఎస్ఆర్సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఉత్తర్వులను ఒక ప్రకటనలో విడుదల చేశారు. నియామకం పట్ల నగర నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసారు.

# మున్సిపాలిటీ ఈపి రేషియోపై తగు చర్యలు తీసుకోండి...

**వైసీపీ నేత యరమాటి వెంకన్నబాబు - రాజకీయ పార్టీ నాయకులతో తహశిల్దార్ సమీక్ష సమావేశం**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి, డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ వారి సంయుక్త ఆదేశాలు ప్రకారం తహశిల్దార్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా తెలియ చేసిన షెడ్యూల్ ప్రకారం శనివారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండపేట తహశిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో హాజరైన ప్రతినిధుల సలహాలు సూచనలు స్వీకరించారు. ముందుగా ఫారం 6, 7 మరియు 8 ల మండపేట అసెంబ్లీ నియోజకవర్గం(48) ఎన్నికల ప్రక్రియ ధరఖాస్తుల వివరాలను తేజేశ్వరరావు తెలిపారు. ఈ ధరఖాస్తుల వివరాలపై వైఎస్ఆర్సీపీ ప్రతినిధి యరమాటి వెంకన్నబాబు స్పందిస్తూ మున్సిపాలిటీ ఏరియాలో ధరఖాస్తుల ప్రక్రియ ఈ పి రేషియో ఎక్కువగా ఉంటుందని వాటిపై వివరణ కోరుతూ చర్యలు తీసుకోవాలని సూచించారు. గత నెల మీటింగ్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ఇచ్చిన సలహాలను జిల్లా కలెక్టర్కి నివేదించడం జరిగిందని తాహశిల్దార్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, మునిసిపల్ టి.పి.ఓ. కడియాల శ్రీ రమ్య, ఎన్నికల ఆపరేటర్ ఎం.నిఖిత నీలిమ, మండపేట ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పి.ఎ.మెహర్ బాబా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశ్వవాయిస్

# ఎడిటర్ వాయిస్

## ఆందోళనకరంగా ప్రపంచ ఆర్థికం

కోవిడ్ -19 దాపురించిన నాటి నుంచి నేటి వరకు దాదాపు అన్ని దేశాలు ఆర్థిక అస్థిరత్వంతో తల్లడిల్లుతున్నాయి. నేటికీ చాలా దేశాల్లో పూర్తి స్థాయిలో వ్యవసాయ పారిశ్రామిక సేవా రంగాలు పుంజుకోలేదు..ప్రజల్లో కొనుగోలు శక్తి క్షీణించింది.. ముఖ్యంగా మన దేశంలో పేద మధ్యతర గతి ప్రజలు కరోనా వైరస్ సృష్టించిన విలయతాండవం నుంచి నేటికీ తేరుకోలేదు..వలస వెళ్లిన వారు స్వస్థలాలకు చేరుకుని, తిరిగి వెళ్ళలేదు.. దీంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయారు...అల్ప ఉపాధితో కాలం గడుపు తున్నారు. దీనికి తోడు అధిక ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదలతో బ్రతుకులు బహు భారంగా మారాయి.. నిన్నటి వరకూ జీఎస్‌టీ భారం.. ఇదే సమయంలో విద్యా, వైద్య వైద్యం ప్రైవేటీకరణ కారణంగా, సంపాదించిన ఆదాయం కాస్త వీటిపై ఖర్చు చేయడం ద్వారా, దాదాపు డెబ్భై శాతం కుటుంబాలు అప్పులు ఊబిలో చిక్కుకుపోయాయి.. దేశంలో నేటికీ ఎనభై శాతం మంది ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్, ఉచిత బియ్యం పథకంపై జీవనం సాగిస్తున్నారు.. అయితే విచిత్రంగా దేశంలో మిలియనీర్లు, బిలియనీర్ల సంఖ్య పెరిగింది.. సంపద కేంద్రీకృతం అయింది. ముఖ్యంగా జీడీపీ పెరుగుతోంది.. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోంది.. వాస్తవానికి ఈ జీడీపీకి, దేశంలో ఎనభై శాతం ఉన్న పేద మధ్యతరగతి ప్రజల ఆదాయానికి, జీవన ప్రమాణాలకు, ఆర్థిక పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంది. నేటికీ పేదరికం భారీ స్థాయిలో ఉంది. చాలా మంది వేతనాలు కనీసం మూడు పూటలా భోజనం చేయడానికి సరిపోవడం లేదనేది కఠోర వాస్తవం... ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0తో పలు వస్తువులపై పన్నులను తగ్గించినా, ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగలేదు అని గణాంకాలు చెబుతున్నాయి.. దీనిని బట్టి చూస్తే మన దేశంలో ప్రజల ఆర్థిక పరిస్థితిని, కొనుగోలు శక్తిని అంచనా వేయవచ్చు. మొదటగా కరోనా వైరస్ సృష్టించిన విలయ తాండవం.. తదుపరి రష్యా - ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్ - పాలస్తీనా గాజాపై యుద్ధం, ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న టారిఫ్ నిర్ణయాలు.. మొత్తం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి... అమెరికా డాలర్ విలువ క్షీణిస్తుంది. అమెరికా ఆంక్షల వల్ల యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. చైనాలో పరిస్థితి గోప్యంగా ఉన్నా, కొంతమేరకు అక్కడ వస్తు ఎగుమతులు లేక పరిశ్రమలు మూతపడ్డాయి అని నిఘా వర్గాలు తెలుపుతున్నా యి.. ఇక 'జపాన్' లో వృద్ధ జనాభా ఎక్కువగా ఉండడంతో శ్రామిక శక్తి తగ్గుతుంది.. ఇక మన ఇరుగు పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్తాన్, మయన్మార్ రాజకీయ అస్థిరత్వంతో వాటి ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. కొన్ని దేశాలు మినహా, దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలు ఇదే పరిస్థితి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ దేశాల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగు పరుచుకోవాలి అంటే ముఖ్యంగా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, స్నేహ సంబంధాలు మెరుగు పరుచుకోవాలి. ఆధిపత్య ధోరణి తగ్గించుకోవాలి.. అన్ని దేశాలు ఒకరికి ఒకరు సహకరించుకోవాలి. ఎగుమతి దిగుమతి సుంకాలు అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో ఉండాలి. వలస వ్యతిరేకత ఉండరాదు.. ప్రతీకార సుంకాలతో పగలు పెంచుకోరాదు.. ముఖ్యంగా యుద్ధాలు జోలికి పోకుండా, సమస్యలను చర్చలు ద్వారా పరిష్కరించుకోవాలి. అగ్రదేశాలు ఆదర్శంగా ఉండాలి.. అంతేకాని అజమాయిషీ, ఇతర దేశాలపై అధికారం చెలాయించడానికి ప్రయత్నం చేయరాదు. అలాగే ఆయా దేశాల్లో ఉన్న అంతర్గత



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# శాంతిస్థాపనలో ఐరాస విఫలమైందా?



2వ ప్రపంచయుద్ధం నేర్పిన గుణపాఠాలను పునాదులుగా చేసుకొని 26 జూన్ 1945 రోజున 51 దేశాలు తీసుకున్న నిర్ణయంతో 24 అక్టోబర్ 1945 రోజున ఐక్యరాజ్యసమితి (ఐరాస) స్థాపించబడే ఒక సంస్థ అనివార్యంగా ఏర్పడింది. 'యునైటెడ్ నేషన్స్' అనే పదాన్ని అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ రూపొందించారు. అమెరికాలోకి న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా ప్రారంభమైన ఐరాసలో నేడు 193 (రెండు పరిశీలన దేశాలుగా ఉండగా) దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. స్వతంత్ర దేశాలుగా గుర్తింపు పొందని నార్థ్ సైప్రస్, సోమాలిల్యాండ్, అబ్కాజియా లాంటి రాజ్యాలకు ఐరాస సభ్యత్వం ఇవ్వలేదు. వాటికన్ సిటీ, పాలస్తీనాలు సభ్యత్వాన్ని పొందలేదు. గత 80 సంవత్సరాలుగా ప్రపంచ దేశాల మధ్య విభేదాలను పరిష్కరించే తటస్థ వేదిక రూపంలో మధ్యవర్తిత్వం వహిస్తూ, పలు వివాదాల పరిష్కారానికి నిర్విరామం కృషి చేస్తూ, మానవాళికి కరోనా మహమ్మారి లాంటి ప్రకృతి విపత్తు జరిగినపుడు ప్రజలను చైతన్యపరిచే ఐక్యరాజ్యసమితి "'ఎనిమిది దశాబ్దాల వ్యవస్థాపక వేడుకలు' చేసుకుని శతాబ్ది ఉత్సవాల స్థాయికి ఎదగడానికి ఉవ్విళ్లూరుతూ విశ్వ మానవళికి సేవలు అందించడం సంతోషదాయకం. ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం ప్రకారం ప్రతియేటా 24 అక్టోబర్ రోజున సభ్యదేశాలు "ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించుట జరుగుతోంది. ప్రపంచ మానవాళిని విపత్తులు, పలు యుద్ధాలు, వాతావరణ ప్రతికూల మార్పులు కల్లోల పరుస్తున్న వేళ, దేశాలన్ని ఆర్థిక, సామాజిక, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న అకాలంలో ఐరాస 79వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకోవలసి వస్తున్నది. అత్యవసర సమయాల్లో సత్వరమే స్పందిస్తూ, ప్రపంచ దేశాలకు తగు పరిష్కారాలను సూచిస్తూ, ప్రపంచశాంతి స్థాపన యజ్ఞంలో తన వంతు బాధ్యతలను నిర్వహిస్తున్న ఐరాస సేవలు ప్రశంసనీయమని కొనియాడబడుతున్నప్పటికీ ప్రస్తుతం కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధాలకు మధ్యవర్తిత్వం సఫలం కాకపోవడం, పేపర్ టైగర్‌గా మారడంతో ఐరాస ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని విమర్శలు వింటున్నాం. ఐరాస అధికార భాషలుగా అరాబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్ మరియు స్పానిష్‌లు గుర్తించబడ్డాయి. ఐరాసలో ముఖ్యమైన 6 విభాగాలలో జనరల్ అసెంబ్లీ, సెక్యూరిటీ కౌన్సిల్, ఎకనమిక్ అండ్ సోషల్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్, సెక్రటేరియట్ మరియు ట్రస్టీషిప్ కౌన్సిల్‌లు (క్రియాశీలంగా లేదు) వస్తాయి. ఐరాస ప్రధాన విధులలో అంతర్జాతీయ శాంతి మరియు భద్రతల స్థాపన, దేశాల మధ్య స్నేహబంధాలను నెలకొల్పడం జరుగుతున్నది. దేశాల మధ్య నెలకొన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు మానవీయ సమస్యకు పరిష్కారాలు చూపుతూ, మానవహక్కులను కాపాడుతూ మౌళిక స్వేచ్ఛను కల్పించడం జరుతున్నది. విపత్తులు, యుద్ధాలు విజృంభించిన వేళ ప్రజలను జాగృత పరచడం, పర్యావరణ కాలుష్య నియంత్రణ, భూగోళాన్ని పరిరక్షించడం లాంటి అతి ముఖ్యమైన అంశాలలో ప్రపంచ దేశాలను చైతన్య పరచడం జరుగుతున్నది. దేశాల మధ్య సమానత్వం, నమ్మకాలను గౌరవించడం, దేశ అంతర్గత సమస్యలకు దూరంగా ఉండడం, సరిహద్దు వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడం లాంటి సూత్రాల ఆధారంగా ఐరాస పని చేస్తున్నది. ఐరాసకు అవసరమైన నిధులను సభ్యదేశాలే అందిస్తాయి. ఐరాసలో ముఖ్య ఏజన్సీలుగా యునిసెఫ్, ఐయల్‌ఓ, యఫ్‌ఏఓ, డబ్ల్యూహెచ్‌ఓ, ఐయంయఫ్, వరల్డ్ బ్యాంక్ లాంటి 15 ఏజన్సీలు తమ తమ విధులను నిర్వహిస్తున్నాయి. అంతర్జాతీయ శాంతి స్థాపనలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న యుయన్‌ఓ భద్రతా మండలి (సెక్యూరిటీ కౌన్సిల్)లో ఐదు అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, యుకె, ఫ్రాన్స్, చైనాలు శాశ్వత సభ్యులుగా వీటో పవర్‌ను కలిగి ఉంటాయి. భద్రతా మండలిలో మరో 10 దేశాలకు 2 సంవత్సరాల వ్యవధితో తాత్కాలిక వీటో లేని సభ్యత్వాన్ని కల్పిస్తారు. ఇండియా తాత్కాలిక సభ్యత్వ దేశంగా సేవలందించడం జరిగింది. ప్రస్తుత సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ముఖ్య పరిపాలనాధికారిగా (సిఏఓ) సేవలందిస్తున్న ఐరాస నిర్దేశిత నియమాలను తీవ్రంగా ఉల్లంఘించిన దేశాన్ని భద్రతా మండలి సిఫార్సుతో జనరల్ అసెంబ్లీ ఆ దేశ సభ్యత్వాన్ని రద్దు కూడా చేయవచ్చు. ప్రపంచ దేశాల్లో ఒక ప్రధానమైన 145 కోట్ల జనాభాతో కూడిన దేశంగా భారత్‌కు భద్రతామండలిలో చోటు దక్కకపోవడం, చైనా లాంటి దేశాలు అడ్డుపుల్లలు వేయడం విస్మయాన్ని కలిగిస్తున్నది. ఆవిర్భావం నుంచి నేటి వరకు ఐరాస నిర్వహించిన పాత్ర ప్రశంసనీయంగా ఉంటూనే కొన్ని సందర్భాలలో నిరాశనే మిగిల్చిందని చరిత్ర చెబుతోంది. అనేక ఆటంకాలు, సవాళ్ల నడుమ తన ఉనికిని చాటుకుంటూ, ప్రపంచదేశాలలో శాంతి స్థాపన దిశగా అడుగులు వేస్తున్నది. ఐరాస చరిత్రలో ఎన్ని మైలురాళ్ళు దాటినా, కొన్ని విషమ పరిస్థితులలో తగు న్యాయం చేయలేక పోయిందనే విమర్శలను మూటకట్టుకుంది. అమెరికా - ఇరాక్‌ల మధ్య వివాదం, సూడాన్‌లో అకాల మరణాలను అరికట్టడం, నేడు కొనసాగుతున్న యుద్ధాలకు ముగింపు పలకడం లాంటి సందర్భాల్లో ఐరాస విఫలమైందని తెలుస్తున్నది. ఐరాస ఎదుర్కొంటున్న సవాళ్ళలో పేదరికం, అనారోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం, దేశాల మధ్య సంఘర్షణలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, హింస, ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, అయుధ సంపత్తి విస్తరణ లాంటివి ముఖ్యమైనవి గుర్తించబడినవి. నేడు భీకరంగా జరుగుతున్న యుద్ధాలతో పాటు అమెరికా చైనాల మధ్య నెలకొన్న ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం ఐరాస లక్ష్యాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అగ్రరాజ్యాల ఆదిపత్య ధోరణిలతో ఐరాస కార్యదక్షత అయోమయంలో పడుతున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆయుధాలతో అగ్రరాజ్య స్థాయి సాధ్యపడదని, విశ్వమానవాళికి సుఖ సంతోషాలు పంచగలగడమే పెద్దరికం అవుతుందని అగ్ర దేశాలు గుర్తించాలి. ప్రపంచశాంతి స్థాపనలో ఐరాస పెద్దన్న వలె నిలబడి, దేశాల మధ్య విభేదాలను చెరిపి, అవసరమైతే కొరడా ఝులిపి, సహకార భావనను పెంచి, ప్రపంచ కుగ్రామాన్ని సుందర నివాస ప్రదేశంగా నిర్మించాలని ఆశిద్దాం. ఐరాసను గౌరవిద్దాం, ప్రపంచశాంతికి పునాదులు వేద్దాం.

# ఈ వివక్షకు అంతమెప్పుడు?

సోదరభావం, సమానత్వం దిశగా, అభివృద్ధి పథంలో దేశ ప్రజలు అడుగులు వేయాలని సాధించుకున్న స్వాతంత్ర్య స్ఫూర్తి మసకబారే ఈ ధోరణి ఈమధ్య కాలంలో బాగా పెరిగిపోయింది. చిన్నపల్లె నుంచి దేశ రాజధాని వరకూ కుల, మత వివక్ష భూతం విరుచుకుపడుతోంది. ఇది ఆందోళన కరం. ఇటీవల హర్యానాలో ఐపిఎస్ కేడర్ వ్యక్తి కులం పేరుతో ఉన్నతాధికారులు పెట్టే అవమానాలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. అతని భార్య ఓ ఐఎఎస్ అధికారి. ఆ సమయంలో ఆమె ప్రభుత్వ ప్రతినిధిగా ముఖ్యమంత్రితో పాటు విదేశీ పర్యటనలో ఉన్నారు. తిరిగి వచ్చిన ఆమె భర్త మరణానికి కారణమైన అధికారుల పేర్లు సైతం వెల్లడించారు. మరణించిన అధికారి సూసైడ్ నోట్‌లో కూడా వారి పేర్లు ఉన్నాయి. అయినా వాళ్లమీద ఏవిధమైన చర్యలూ తీసుకోలే దని ఆమె వాపోయారు. ఒక ఉన్నతాధికారి కుటుంబమే కుల వివక్షకి ఇంతలా తల్లడిల్లుతుంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి? 'బ్రాహ్మణులని పూజిస్తాం..' అనిపించారు. అక్టోబరు నెల ప్రారంభంలో మధ్యప్రదేశ్‌లో జరిగిన ఓ ఘటన ప్రజా స్వామ్యాన్ని, నాగరిక సమాజాన్ని పరిహాసం చేసేదిగా ఉంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన సమాచారం ప్రకారం.. 'ఒబిసి వర్గానికి చెందిన ఓ యువకుడు, ఉన్నతవర్గానికి చెందిన యువకుడి కాళ్లు కడిగి, నెత్తిన జల్లుకున్నాడు. ఆ తరువాత 'బ్రాహ్మణులని అవమానించినందుకు నేను క్షమాపణలు చెబుతున్నా. ఇంకెప్పుడూ ఈ తప్పు జరగదు. ఇకమీద మేమంతా బ్రాహ్మణులని ఈవిధంగానే పూజిస్తాం' అన్నది ఆ వీడియో సారాంశం. ఎంత దిక్కుమాలిన చర్య ఇది! కులం పేరుతో సాటి మనిషిని ఇంతలా అవమానించడం దేనికి సంకేతం? వేరే కులం వారిని ఇష్టపడినందుకు, పెళ్లి చేసుకున్నందుకు కన్నవారే హంతకులుగా మారిపోతున్న ఘటనలు ఎన్నో చూస్తున్నాం. అయితే పై ఘటనలు వీటికి పూర్తిగా భిన్నమైనవి. సమాజంలో వెనుకబడిన వర్గాల వారిని సాటి మనుషులుగా కూడా గుర్తించని భావజాలానికి నిదర్శనం అవి. సదరు వ్యక్తులు ఉన్నత హోదాలో ఉన్నాసరే ఆ సంకుచిత్వం ఏదోవిధంగా బయటపడుతూనే ఉంటోంది. సిజెఐపై దాడి అటువంటిదే. 'దేవుడే నన్ను ఈ పని చేయమన్నా'డు..అని ప్రకటించారు. సుప్రీంకోర్టులో జరిగిన ఘటనలో న్యాయవాది రాకేష్ కిషోర్, సిజెఐ గవారుపై బూటు విసిరే ప్రయత్నం చేస్తూ 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే భారతదేశం సహించదు' అన్నారు. ఇంకా 'దేవుడే నన్ను ఈ పని చేయమన్నాడ'ని ప్రకటించారు. ఇంత అక్కసు వెళ్లగక్కడం వెనుక సిజెఐ సామాజిక నేపథ్యం కూడా ఒక కారణమేనని విశ్లేషణలు వచ్చాయి. పదవి చేపట్టిన నాటినుండి గవారు పలు సందర్భాల్లో 'ఇది భారతదేశం.. బుల్డోజర్ న్యాయం ద్వారా కాకుండా, రాజ్యాంగం ప్రకారం చట్టపరమైన పాలన ఇక్కడ జరగాలి' అని ఉద్ఘాటించారు. దేశంలో రాజ్యాంగ అమలుని సహించని మనువాదకులకి ఇది మింగుడుపడని చర్య. ఇటీవల రాయ్ బరేలీలో జరిగిన ఓ దుర్ఘటన కూడా కుల వివక్షని ఎత్తిచూపుతోంది. దొంగతనం చేయకుండనే, చేస్తాడేమోనన్న నెపంతో షెడ్యూల్ కులానికి చెందిన ఓ యువకుడిని అగ్రవర్ణానికి చెందిన ఓ గుంపు కొట్టి చంపింది. అక్కడ ఇంకా దొంగతనం జరగలేదు. చేస్తాడేమో అన్న అనుమానం ఆ దారుణానికి ఒడిగట్టేలా చేసింది. అంతటి లోకువకు కారణం అతడి కులం. గతంలో ఈ తరహా ఘటనలు ఎన్నో జరిగాయి. ఈ సంకుచితత్వం ఇప్పుడు మనువాదుల ఏలుబడిలో మరింతగా విరుచుకు పడుతోంది. అయితే, ఇది భారతదేశం. మనువాద రాజ్యం కాదు. దేశం ప్రగతి పథంలో నడవాలి అంటే మనం నడవాల్సింది ముందుకు. వెనుకకు కాదు.

# భారత శిక్షాస్మృతి సృష్టి కర్త

లార్డ్ మెకాలే ... ఈ పేరు వినగానే వెంటనే స్ఫురణకు వచ్చేది భారత దేశంలో ఆంగ్ల విద్యకు పునాది వేసిన వ్యక్తి. కానీ చాలా మందికి తెలియని విషయం... మెకాలే భారత శిక్షా స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ 1860) సృష్టికర్త అని. ఆయన లా కమిషన్ ఛైర్మన్ గా నేటికీ చెక్కుచెదరని మూల రూపం గల ఐ పి సి చిత్తు ప్రతి తయారు చేయబడిందని. 19వ శతాబ్దపు కవి, చరిత్రకారుడు, రాజనీతివేత్త, లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే, ఫస్ట్ బేరన్ మెకాలే పి.సి. (1800 అక్టోబరు 25 .. 1859 డిసెంబర్ 28) జయంతి సందర్భంగా, ఇండియన్ పీనల్ కోడ్ పూర్వా పరాలను తెలుసుకుందాం. 1830కి ముందు, భారతదేశంలో, 'ది ఇంగ్లీష్ క్రిమినల్ లా', అనేక చట్ట సవరణలతో, నాటి ప్రెసిడెన్సీ టౌన్లు.. బొంబాయి, కలకత్తా, మద్రాసులలో అమలు జరిగేది. లార్డ్ మెకాలే, నాటి "ఫ్రెంచి పీనల్ కోడ్", "లివింగ్‌స్టోన్స్ కోడ్ ఆఫ్ లూసియానా" అనే రెండు ప్రామాణిక గ్రంథాలను ఆదర్శంగా తీసుకుని, ఇండియన్ పీనల్ కోడ్ 'చిత్తుప్రతి'ని తయారు చేసాడు. భారతీయుల ప్రామాణిక గ్రంథాలైన మనుస్మృతి ని, యాజ్ఞవల్క్య స్మృతిని, నాటి వైదిక పండితుల సలహా, సహాయం కూడా తీసుకున్నాడు. శిక్షల విషయంలో, ఆ నాటి పెద్దలు, పండితులు, రాజులు అభిప్రాయాలను కూడా లెక్కలోకి తీసుకున్నాడు. లార్డ్ మెకాలే మహా మేధావి అయినా, తన అభిప్రాయాల కంటే, నాటి భారత దేశ మత, సాంఘిక, సామాజిక వ్యవస్థలకు, ఆచార వ్యవహారాలకు విలువ ఇచ్చి, వారి అభిప్రాయాలను గౌరవించి, తన మేధస్సుతో 'ఇండియన్ పీనల్ కోడ్' చిత్తుప్రతి తయారు చేశాడు. ఇండియన్ పీనల్ కోడ్ 1837 లోనే నాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా ఇన్ - కౌన్సిల్ కి నివేదించినా, 1860 సంవత్సరం వరకూ అది వెలుగు చూడలేదు. లార్డ్ మెకాలే తయారుచేసిన 'చిత్తుప్రతి' ని, నాటి ఛీఫ్ జస్టిస్ సర్ బార్నెస్ పీకాక్, కలకతా సుప్రీమ్ కోర్టు న్యాయాధిపతి (ఇతను నాటి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు కూడా) సునిశితంగా, సుదీర్ఘంగా, పరిశీ లించి, పరీక్షించాడు. అయన సుదీర్ఘ పరిశీలన తర్వాత ఇండియన్ పీనల్ కోడ్ 1860 అక్టోబరు 6 నాడు చట్టసభ ఆమోదం పొందింది. ఇండియన్ పీనల్ కోడ్ మూలాలు 1860 నాటి ఆంగ్లేయుల వలస పాలనలో (బ్రిటిష్ ఇండియా) ఉన్నాయి. 1860 నాటి బ్రిటిష్ ఇండియా చేసిన 45వ చట్టం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ అమలులోకి వచ్చింది. మొట్టమొదటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి 1860 లో, మొదటి లా కమిషన్ అజమా యిషిలో జరిగింది. మొదటి లా కమిషన్ ఛైర్మన్ లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే). మొదటి ఇండియన్ పీనల్ కోడ్ 1862 సంవత్సరంలో, అమలులోకి వచ్చింది. నాటినుంచి ప్రపంచం లోను, భారతీయ సమాజాల లోను, విద్యాపరంగా, వైజ్ఞానికంగా, అనేక రంగాలలో,అనేక రకాలుగా జరిగిన సమస్తమైన మార్పుల ప్రాతిపదికగా భారతీయ శిక్షాస్మృతి అనేకమైన మార్పులు, చేర్పులకు గురి అవుతూ, నేటి రూపాన్ని పొందింది. అందుకు గృహ హింస సెక్షన్ 498-ఎ ఒక ఉదాహరణగా తీసుకో వచ్చు. మన భారతీయ శిక్షాస్మృతిలో 511 సెక్షన్లు ఉన్నాయి. వరకట్నం చట్టాలు మరో ఉదాహరణ. వరకట్న సమస్య, ఐరోపా, అమెరికా దేశాలలో లేదు కాబట్టి, వరకట్న చట్టాలు, శిక్షలు వారి శిక్షాస్మృతిలో లేవు. పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతథంగా పాకిస్తాన్ తన దేశంలో అమలు చేసింది. దాని పేరు "పాకిస్తాన్ పీనల్ కోడ్" (పి.పి.సి). బంగ్లాదేశ్ కూడా "బంగ్లాదేస్ పీనల్ కోడ్" పేరుతో అమలు చేసింది. బ్రిటిష్ వలస దేశాలైన, మియన్మార్ (నాటి బర్మా), శ్రీలంక (నాటి సిలోన్), మలేసియా, సింగపూర్, బ్రూనీ దేశాలు కూడా ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతథంగా అమలు చేస్తున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్ జమ్ము కాశ్మీర్లో కూడా అమలులో ఉంది. కానీ, ఈ రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్ అనరు. "రన్‌బీర్ పీనల్ కోడ్" (ఆర్.పి.సి) అని పిలుస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ సృష్టికర్త లార్డ్ మెకాలే, 1859 డిసెంబరు 28 న, తన 59వ ఏట, మరణించిన క్రమంలో తన కృషి సాకారమై , చట్టమై, అమలు జరగటం చూడనే లేదు. నాటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి, మూల రూపం, నేటికీ చెక్కు చెదరలేదు. దీనిమీద కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ, ఈ నాటికీ, న్యాయశాస్త్రంలో, దీనికి తిరుగు లేదు. 165 ఏళ్లల్లో మార్పులు ఎన్ని వచ్చినా, శిక్షాస్మృతి చెక్కు చెదరకుండా ఉన్నది అంటే, మెకాలే దూరదృష్టి అమోఘం. మేధస్సు అద్భుతం. ఆయన కృషి అనితర సాధ్యం.





# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు చేయాలి..


## అల్లవరం వైఎస్ఆర్‌సిపి నాయకులు విస్తృత ప్రచారం



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్ళమూరు, గోడిలంక గ్రామాలలో శనివారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టడం జరిగింది. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కొనుకు బాపూజీ, ఎంపిపీ ఇళ్ల శేషగిరిరావు, మండల వైఎస్ఆర్సిపి నాయకులు మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ చేస్తే వైద్య విద్య అభ్యసించాలనుకునే పేద, బడుగు, బలహీన వర్గాలు తీవ్రంగా నష్టపోతారని ప్రజలకు వివరించారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషారావు, కొనుకు బాపూజీ, జెసిఎస్ అధ్యక్షులు తిక్క ప్రసాద్, నాతి శ్రీనివాస్, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి వి.వెంకటేష్, సర్పంచ్ రాయుడు విష్ణు, నిమ్మకాయల శేఖర్, కాండ్రేగుల జవహర్, యువజన విభాగం అధ్యక్షులు బల్ల శ్యామ్, మల్లాడి రాధాకృష్ణ, పులుసుగంటి ప్రసాదరావు, కాండ్రేగుల శ్రీను, కుంచె శ్రీకాంత్, బొంతు ఏడుకొండలు, పల్లె జేమ్స్, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కుంచె నరేంద్ర, కుంచె చంద్రరావు కాశి శ్రీనివాసరావు, బల్ల నాగరాజు, కాసి మురళి కృష్ణ, బొమ్మి శ్రీనివాసరావు, శెట్టిబత్తుల ఏడుకొండలు, శెట్టిబత్తుల బాల మురళీకృష్ణ, కాశి శ్రీను, గంటా శ్రీనివాసరావు, బొంతు నాగరాజు, పచిమాల శ్రీను, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేశ రక్షణలో స్కౌట్ పాత్ర కీలకం

## ఉత్సాహంగా.. ఉల్లాసంగా స్కౌట్ శిక్షణ



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ రక్షణలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ పాత్ర అత్యంత కీలకమని లీడర్ ట్రైనీ (స్కౌట్ అండ్ కబ్స్) డాక్టర్ బి.వి. ప్రసాద రావు పేర్కొన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కౌట్ మాస్టర్స్ ట్రైనింగ్ క్యాంప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, స్కౌటింగ్ వ్యవస్థ స్థాపకుడు బేడెన్‌పౌల్ చూపిన దారిలో నడుస్తూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యువత దేశసేవలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో స్కౌట్స్ పోషించిన సేవలు మరువరానివని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం అలవడడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలకపాత్ర పోషిస్తాయన్నారు. "ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో విద్యార్థులకు బాధ్యత, క్రమశిక్షణ నేర్పించే స్కౌటింగ్ కార్యక్రమాలు పాఠశాలల్లో తప్పనిసరి కావాలి. ఒకప్పుడు రాష్ట్రంలో స్కౌటింగ్‌లో తూర్పుగోదావరి జిల్లా అగ్రస్థానంలో ఉండేది. ఇప్పుడు మళ్లీ అదే వైభవం రాబోతోంది" అని ఆయన పేర్కొన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, ఏపీసీ జి. మమ్మీ, క్యాంప్ కోఆర్డినేటర్ పి. రాంబాబులను ప్రసాదరావు అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.రాంబాబు, లీడర్ ఆఫ్ ది క్యాంప్స్ బి.శివనాగిరెడ్డి, డీఎల్ నారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ జేఎన్ఎస్ గోపాలకృష్ణ, జిల్లా సెక్రటరీ రాజ్‌కుమార్, స్కౌట్ కోఆర్డినేటర్ కట్టా కృష్ణప్రసాద్ తదితరులు ప్రసంగించారు. శిక్షణలో భాగంగా టెంట్లు వేయడం, తాళ్లతో ముడులు వేయడం (నాటింగ్), స్కౌట్ ఫోక్ సాంగ్స్ వంటి అంశాలపై ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇచ్చారు. అనంతరం స్కౌట్ మాస్టర్స్ లీడర్ ట్రైనీ డాక్టర్ బి.వి. ప్రసాదరావును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అడల్ట్ రీసోర్స్ పర్సన్ వీఎన్‌కే గుప్తా, క్యాంప్ స్టాఫ్ ఎస్.ఆర్.వి. బ్రహ్మేశ్వరరావు, జి.సుబ్బరాజు, వై.నాగేశ్వరరావు, షేక్ అజారుద్దీన్, ప్రసాదరావు, బీ.హెచ్.వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ నెలలో ఏఓఐ మొదటి వార్షికోత్సవ వేడుకలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం ఎల్ఐసి కార్యాలయంలో శనివారం ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఏవోఐ కార్యనిర్వాహక కమిటీ(ఈసి) సమావేశం రాజమండ్రి డివిజన్ ఏఓఐ యూనియన్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కొన్ని కీలక నిర్ణయాలు చర్చించడం జరిగింది. అతి తక్కువ కాలం లో అమలాపురంలో యూనియన్ స్థాపించి డివిజన్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వీరభద్ర రావుని యూనియన్ కమిటీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే నవంబర్ నెలలో జరిగే మొదటి వార్షికోత్సవ సంబరాలు అందరూ కలిసికట్టుగా చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సమావేశంలో తీర్మానించడం జరిగింది. అలాగే అమలాపురం అధ్యక్షుడు డివిజన్‌కి వెళ్లడంతో అమలాపురం బ్రాంచ్ అధ్యక్షత పదవి కి ఏ నాగేంద్ర కుమార్‌ని ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్టుగా కమిటీ తీర్మానం చేసింది. ఈ ఎన్నుకున్న ప్రక్రియను వచ్చే నెలలో జరిగే మొదటి వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం సభలో తీర్మానం చేసి బాధ్యతలు అప్పగించాలని ఈ సమావేశంలో తెలియపరచడమైనది. మనం అనేక రకాల పోరాటాలు చేసి సాధించిన విజయాల గురించి అలాగే ఈమధ్య రద్దయిన జిఎస్టి గురించి యూనియన్ చేసిన పోరాటాల గురించి ఈ సమావేశంలో తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రాంచ్ మేనేజర్ కె.సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మధు బాబు హాజరై ఏజెంట్ డెవలప్మెంట్ గురించి కాంపిటీషన్స్ గురించి, అనేక విషయాలు తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి వినాయకరావు, ట్రెజరర్ దొమ్మేటి శివ స్వామి, కడలి శ్రీనివాసరావు, కేతా వీరస్వామి, యాడ్ల ఆదినారాయణ, ఎండియస్ గౌడ్, అధికార బాబ్జి, మద్దా సత్యనారాయణ, శీలం లంకేష్, కోరుమిల్లి మధు, మట్టపర్తి జయ కృష్ణ, మట్టా శ్రీనివాసరావు, దంగేటి వెంకటేశ్వరావు, ఎల్‌వివి లక్ష్మి, దునబోయిన దుర్గాదేవి, బొక్కా వెంకటేశ్వరరావు మట్టపర్తి ఏసుదాస్ చప్పిడి దానేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# పీఎంశ్రీ పాఠశాలల్లో సివిల్ వర్క్స్ వెంటనే పూర్తి చేయాలి

## మనబడి–మన భవిష్యత్తు సంబంధించిన పెండింగ్ పనులపై దృష్టి సారించాలి

## జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, ఏపీసీ జి.మమ్మీల సమీక్ష



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న పీఎంశ్రీ పాఠశాలల్లో సివిల్ వర్క్స్‌కు సంభందించిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, ఏపీసీ జి.మమ్మీలు ఆదేశించారు. ముమ్మిడివరం డీఈవో కార్యాలయంలో శనివారం సెక్టోరల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 26 పీఎంశ్రీ పాఠశాలల్లో పూర్తి కావాల్సిన పనుల వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. అలాగే మనబడి%–%మన భవిష్యత్తు పథకానికి సంబంధించిన పెండింగ్ పనులపై కూడా దృష్టి సారించాలని సూచించారు. వీరగాథ 5.0లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి, ఆ పోటీల్లో విజేతల వివరాలను ఆన్‌లైన్‌లో అడేట్ చేయాలన్నారు. అలాగే పాఠశాలలకు మంజూరైన స్కూల్ గ్రాంట్స్, కాంప్లెక్స్ గ్రాంట్స్, ఎంఆర్‌సీ గ్రాంట్స్‌ను పీఎంశ్రీ యాప్‌లో అంచనాలు, బిల్లులు అప్‌లోడ్ ఏ మేరకు అయిందన్న విషయాన్ని మండల విద్యాశాఖాధికారులతో సమీక్ష చేయాలని సూచించారు. సెక్టోరల్ అధికారులకు సంబంధించిన దత్తత మండలాల్లో విద్యాశాఖ, సమగ్ర శిక్షా కార్యక్రమాల ప్రగతిని వారు సమీక్షించారు. సెక్టోరల్ అధికారులు పాఠశాలల్లో పర్యవేక్షణ పెంచాల్సిందిగా సూచించారు. సెక్టోరల్ అధికారులు పాఠశాలల సందర్శనా సమయాల్లో ముఖ్యంగా 8,9,10 తరగతి విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలించాలన్నారు. సమావేశంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగం నుంచి జి.ప్రవీణ్‌కుమార్, సమగ్ర శిక్షా ఈఈ సుబ్బరాజు, డీఈఈ నాగేశ్వరరావు, సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, కె.నారాయణరావు, సైట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో

# నాగుల చవితి వేడుకలు



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిధిలోగల అన్ని గ్రామాలలో శనివారం నాగుల చవితి వేడుకలు ఎంతో భక్తితో నిర్వహించారు. గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున పొలాల్లో ఉండే పుట్టల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. ముఖ్యంగా లంక గ్రామాలైన చెముడులంక, మడికి,చొప్పెల్ల, బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాలలో ఉదయం నుంచి పొలాల వద్ద నాగుల చవితి సందడి నెలకొంది. చెముడులంక జాతీయ రహదారి చెంతనున్న చంటి బిడ్డల తల్లి ఆలయం వద్ద గల నాగేంద్ర స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

# నాగులచవితి సందర్భంగా పుట్టలకు పూజలు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** నాగుల చవితి హిందూ పండుగలలో ఒక ముఖ్యమైన పండుగ. ఇది శ్రావణమాసం లేదా కొన్నిసార్లు కార్తీకమాసంలో వచ్చే చవితి (చతుర్థి) రోజున జరుపుకుంటారు. ఈ పండుగను ముఖ్యంగా నాగదేవతలుకు అంకితం చేస్తారు. నాగుల చవితి రోజున ప్రజలు నాగదేవతలను పూజించి, పాములకు పాలు, గుడ్లు, పిండి వంటకాలు వంటివి సమర్పిస్తారు. ఈ రోజున నాగదేవతలను పూజించడం వలన కుటుంబం చెడులు, విషజంతువుల భయం, సర్పదోషం వంటి సమస్యలు తొలగుతాయని నమ్మకం ఉంది. మహిళలు ఎక్కువగా ఈ పండుగను పాటిస్తారు. వారు ఉపవాసం ఉండి, నాగదేవుడి కథలు వినడం, నాగ శిలలు లేదా పుట్టలుచెట్టు వేరు వద్ద పూజ చేయడం చేస్తారు.ప్రతి గ్రామం పట్టణాలలో ఎంతో భక్తి శ్రద్ధలతో ఓం నమో నాగదేవాయ నమఃఅని జపిస్తూ ఈ పండుగ జరుపుకుంటారు. ఈ పండుగను జరుపుకోవడం ద్వారా పాము కాటు ప్రమాదం తగ్గుతుంది, సంతానం కలుగుతుంది, అలాగే కుటుంబానికి శాంతి, ఐశ్వర్యం కలుగుతాయని భక్తులు నమ్ముతారు. నాగుల చవితి పండుగ మనకు ప్రకృతిని, జీవరాశులను గౌరవించే సాంప్రదాయ భావనను నేర్పిస్తుంది. పాములు వ్యవసాయానికి మిత్రులు అని గుర్తుచేస్తూ, వాటిని సంరక్షించాలని సందేశం ఇస్తుంది.

# బిటి రోడ్డు మరమ్మతులు తక్షణమే చేయించండి..

## వినతిపత్రం అందజేసిన సర్పంచ్ రొక్కాల



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయతీ పరిధిలో గల దేవి సెంటర్ నుండి దేవర లంక ఓఎన్జిసి టెర్మిల వరకు బీటీ రోడ్డు పూర్తిగా పాడైపోవడం వలన గోతులు పడిపోయాయి. గ్రామ ప్రజలు రాకపోకలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు చూసి స్పందించిన సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఓఎన్జిసి వారిని కలిసి తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయించాలని ఓఎన్జిసి అధికారులకు గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి శనివారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు అడపా శ్రీను, పాలకవర్గ సభ్యులు చింతం శ్రీను,గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవ చంటి, మండల తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబి, సొసైటీ డైరెక్టర్ మొయిలు గణపతి, ముత్యాల దుర్గారావు, రొక్కాల నాగేశ్వరరావు, దొమ్మేటి రాధాకృష్ణ, దొమ్మేటి భావన తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల అమరవీరులకు జోహార్లు

## నివాళులర్పించిన ఎస్సై సంపత్ కుమార్, సర్పంచ్ విజయలక్ష్మి





**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయతీ కార్యాలయం నుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు పోలీసుల అమరవీరులకు జోహార్లు అర్పించడానికి శుక్రవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన అల్లవరం ఎస్ఐ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు అడపా శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షులు అరవ చంటి, తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబి, రొక్కాల నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు చింతం శ్రీను, ఐల వెంకట నాగేశ్వరరావు, మొయిల గణపతి, దొమ్మేటి రామకృష్ణ, అంబేద్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోసగంటి దుర్గారావు, విప్పర్తి రామకృష్ణ, ముత్యాల దుర్గారావు, జల్లి రాధాకృష్ణ, బొంతు శ్యాంప్రసాద్, కొడమంచిలి రామకృష్ణ, రంకి రెడ్డి వెంకటేశ్వరరావు, మొయిల బీముడు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రెండు రోజుల టీచ్‌టూల్ మాస్టర్ ట్రైనింగ్

## లీప్‌యాప్ ద్వారా టీచ్‌టూల్ పర్యవేక్షణపై అవగాహన

## సమగ్ర శిక్షా ఎ.ఎమ్.ఓ పి.రాంబాబు ఆధ్వర్యంలో సాగిన ట్రైనింగ్

## జిల్లా వ్యాప్తంగా 22 మండలాల నుండి 44 మందికి శిక్షణ



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల టీచ్ టూల్ మాస్టర్ ట్రైనింగ్ ముగిసింది. అక్టోబర్ 23, 24 తేదీల్లో టీచ్ టూల్ మాస్టర్ ట్రైనింగ్‌ను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గల 22 మండలాల నుండి హాజరైన 44 మంది టీచ్‌టూల్ మాస్టర్ ట్రైనర్స్‌కు ఈ కార్యక్రమంలో శిక్షణనిచ్చారు. బోధనా సమయంలో ఉపాధ్యాయుడు, విద్యార్థికి మధ్య ఉండే 28 ప్రవర్తనలను ఏ విధంగా గమనించాలన్న అంశాలపై శిక్షణనిచ్చారు. ముఖ్యంగా లీప్‌యాప్ ద్వారా టీచ్‌టూల్‌ను ఏ విధంగా పర్యవేక్షణ చేయాలనే అంశాలపై ప్రధానంగా శిక్షణలో పేర్కొన్నారు. ఈ ట్రైనింగ్ ద్వారా ఎల్ఎఫ్ఈ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ వివేక్, ఎస్ఆర్‌పీలు బి.శివగణేష్, అప్పారి శశికుమార్, సుధాకర్‌బాబులు పలు అంశాలపై టీచర్స్ కు అవగాహన కల్పించారు. ముగింపు సమావేశంలో రావులపాలెం ఎంఈవో పి.శ్రీనివాసరాజు, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీవాణిలు మాట్లాడగా, అనంతరం టీచ్‌టూల్ మాస్టర్ ట్రైనర్స్‌కు సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో 44 మంది మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# రసాయన ఎరువులు వద్దు.. సేంద్రియ, జీవన ఎరువులు ముద్దు...

## ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ రంగంలో రసాయన ఎరువులు, రసాయన మందుల వాడకం నానాటికీ పెరుగుతోంది. దీని ప్రభావం వల్ల భూమిలోని సేద్యానికి ఊపకరించే సూక్ష్మజీవుల సంఖ్య తగ్గడమే కాకుండా భూమి ఆరోగ్య పరిస్థితి కూడా నానాటికీ క్షీణిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ రంగంలో సమన్వయ సమగ్ర భూసార సంరక్షణ పద్ధతి ఎంతో ముఖ్యమైనదిగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో సేంద్రీయ ఎరువుల వాడకంతోపాటు జీవన ఎరువుల వాడకం ప్రాముఖ్యతను వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా రైతులకు విస్తృతస్థాయిలో ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. వ్యవసాయ క్షేత్రాల నేలల పరిరక్షణకు, భూసారాన్ని పెంచడానికి, మేలైన ఆరోగ్య కరమైన పంటల ఉత్పత్తికి రైతులు తమ దైనందిన వ్యవసాయ సేద్యంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులను వాడాలని రైతులకు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహ రావు సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు (బయో ఫెర్టిలైజర్స్) ఫాస్ఫరస్ సొల్యూబులిజింగ్ బ్యాక్టీరియా, అజటోబ్యాక్టర్, అజోస్పైరిల్లమ్ ఇనాక్యూలంట్ వాడటం వలన భూమి సారవంతమై పంటలు బాగా పండు తాయని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యాన శాఖ అనుబంధ కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో మామిడి, జీడిమామిడి తోటలు పెంపకంలో సస్యరక్షణ చర్యలపై అవగాహన సదస్సులను శనివారం నిర్వహించారు. ఏలేశ్వరం, శంఖవరం మండలాల ఉద్యానవనశాఖ అధికారిణి కె.దివ్యశ్రీ సారథ్యంలో శంఖవరం మండలంలోని శంఖవరం మండలంలో నెల్లిపూడిలో ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు గౌరంపేట గ్రామాల్లో మామిడి, జీడిమామిడి సాగులో సమగ్ర సస్యరక్షణ, మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులు గురించి రైతు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన పంటల్లో పాటించ వలసిన ఎరువుల యామాన్యం గురించి నరసింహారావు వివరించారు. మామిడిలో చీడ పురుగుల నివారణకు, నవంబర్ నెలలో వేప నూనె 1500 పిపిఎం. 3 మిల్లీలు, కార్బన్డిజం 1 గ్రాము చొప్పున, డిసెంబర్ నెలలో ఇమిడాక్లోప్రోడ్ 0.3 మి.లీ, జనవరిలో లామడా సైహలోత్రిన్ 2.0 మి.లీ, నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు చొప్పున, అలాగే ఫిబ్రవరి నెలలో పిప్రోనిల్ 2. మి లీ, మాంకోజబ్ 3 గ్రాముల మోతాదు చొప్పున మందులను ఒక లీటరు నీటిలో బాగా కలిపి పిచికారి చేస్తే రసం పీల్చే పురుగులు నివారణ చేయెచ్చని తెలిపారు. మామిడిని ఆశించే తేనె మంచు పురుగు, తామర పురుగులు నివారణకు నవంబర్ నెల నుండే పురుగు మందులను చెట్ల కాండం, కొమ్మలు, ఆకులు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. సకాలంలో సరైన ఎరువులను తగు మోతాదులో వేయాలని సూచించారు. జీడి మామిడి తోటల్లో తేయాకు దోమ నివారణకు, కొత్త చిగురు వేసేటప్పుడు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ, పూత సమయంలో లామడా సైహలోత్రిన్ 2.0 మి.లీ, బటాణి గింజ దశలో ప్రొఫెనోఫాస్ 2 మి.లీ, కార్బన్డిజం 1 గ్రాము చొప్పు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి అన్నారు. వీటి సక్రమ నిర్వహణతోపాటు పాటు సక్రమ నీటి యాజమాన్యం పద్ధతులను కూడా పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు వివరించారు. ఉద్యానవనశాఖ అధికారిణి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ మామిడి, జీడిమామిడి, ఇతర ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరించారు. మామిడి కాయలకు కవర్లను ప్రభుత్వం రాయితీ ధరలకు అందిస్తున్నదని, అలాగే బిందు సేద్యం చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీని ఇస్తోందని తెలిపారు. అదే 5 ఎకరాల్లోపు ఉద్యాన సాగు ఉన్న ఇతర సామాజిక వర్గాల రైతులకు 90%రాయితీని, పామాయిల్ మొక్కల సాగుకు 100 శాతం రాయితీపై మొక్కలను అందిస్తున్నారని వివరించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో నెల్లిపూడి మాజీ సర్పంచ్ చిట్టిమూరి విజయ్ కుమార్, నెల్లిపూడి గ్రామ ఉద్యానవనశాఖ సహాయకులు కాకర రాజు, కత్తిపూడి వ్యవసాయశాఖ సహాయకుడు బద్ది గోవిందరాజులు, గౌరంపేట మాజీ సర్పంచ్ పాకల శివలింగప్రసాద్, గ్రామ ఉద్యానవనశాఖ సహాయకులు సత్యనారాయణ, సువర్ణరాజు, శ్యాంసుందర్, గ్రామాల రైతులూ పాల్గొన్నారు.

### నూతన చర్చ్‌ను ఆహ్వానించిన

# ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు నూతనంగా నిర్మించిన ఆర్.సి.ఎం చర్చ్‌ను ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఆర్చ్‌బిషప్ ఫాదర్ ఉడుమల బాల శౌరెడ్డి, ప్రత్తిపాడు విచారణకర్త రెవ. ఫాదర్ చిన్నప్ప, స్థానిక దైవజనులు, చర్చ్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. చర్చ్ ఆవరణలో ఎంతో గొప్పగా ప్రత్యేక ప్రార్థనలు, ఆశీర్వచనాలు నిర్వహించగా, అనంతరం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చర్చ్ కొత్త విభాగాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే సత్యప్రభ రాజాను ఫాదర్ బిషప్. మరియు సంఘ సభ్యులు కూటమి నాయకులు ఎంతో ఘనంగా పూలమాలతో సత్కరించి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ, చర్చ్ సంఘ సభ్యులు దైవజనులు నన్ను ఆహ్వానించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలుపుతు "ప్రత్తిపాడు ప్రాంతం గ్రామ ప్రజలు అలాగే ముఖ్యంగా మా కుటుంబాన్ని నన్ను ఎంతగానో ఆదరిస్తారని ఆమె అన్నారు అంతేకాకుండా చర్చి అభివృద్ధి కార్యక్రమాలకి నా వంతు సహకారం ఉంటుందని అలానే నూతనంగా నిర్మించిన చర్చిలో మంచి మంచి గొప్ప కార్యక్రమాలు జరగాలని అన్నారు రానున్న కాలంలో ఆధ్యాత్మికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. చర్చిలు, దేవాలయాలు, మసీదులు ప్రజలలో ప్రేమ, శాంతి, సహనాన్ని పెంపొందిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో యాళ్ల జగదీష్, కొమ్ములు కన్నబాబు, అంబటి బుజ్జి, వెలుగుల కొండలరావు, పోలిశెట్టి శ్రీను, గుడాల రామకృష్ణ, చెట్టు బత్తుల నాని, కూటమి నాయకులు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### రాజమండ్రి నాలుగు లైన్ల రహదారిపై

# టెంట్లు, ధాన్యం ఆరబోత

## ఎంపీడీవో ఆదేశాలు బేఖాతరు చేసిన పంచాయతీ కార్యదర్శులు




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలోని సీతానగరం మండలం పరిధిలో, రాజమండ్రి వైపు వెళ్లే నాలుగు లైన్ల ప్రధాన రహదారిపైనే బహిరంగంగా గుడారాలు (టెంట్లు) వేసి ఫంక్షన్లు నిర్వహించడం, పంట కోతల అనంతరం ధాన్యాన్ని ఆరబోయడం వంటి చర్యలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ఈ కీలకమైన రహదారి ఆక్రమణలపై స్థానిక పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ రహదారుల ఆక్రమణలను నివారించాలని, ప్రజల భద్రతకు ఆటంకం కలగకుండా చూడాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా విఫలమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. నాలుగు లైన్ల రోడ్డు మీద భారీ ఎత్తున రంగురంగుల టెంట్లు వేసి సామూహిక కార్యక్రమానికి ఏర్పాట్లు చేసిన దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ టెంట్లు పూర్తిగా రహదారిని ఆనుకుని ఉండటం వల్ల రాత్రి సమయాల్లో లేదా వేగంగా వెళ్లే వాహనాలకు తీవ్ర ఆటంకం కలిగి, ఘోర ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాగే, ధాన్యాన్ని రహదారులపై ఆరబోయడం వల్ల వాహనాలు నియంత్రణ కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. నాలుగు లైన్ల రహదారిపై ఈ విధమైన అక్రమ ఆక్రమణలు, ముఖ్యంగా ఎంపీడీవో ఆదేశాలను సైతం లెక్కచేయకపోవడం స్థానిక అధికార యంత్రాంగం యొక్క వైఫల్యాన్ని తెలియజేస్తోంది. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు (జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈఓ) ఈ విషయంపై జోక్యం చేసుకుని, రోడ్డు భద్రతకు ముప్పు కలిగించే ఈ ఆక్రమణలను తొలగించాలని, ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన సంబంధిత పంచాయతీ కార్యదర్శులు మరియు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# గిరిజన ప్రజలకు రోడ్డు వేస్తాం..

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం ఎమ్మెల్యే సత్య ప్రభ. ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని రౌతు పాలెం నుండి వంతాడ వరకు వెళ్ళే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో, పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మరియు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ కలసి ఈ రహదారిని స్వయంగా పరిశీలించారు. రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో, వాహనదారులు మరియు ప్రయాణికులు అనేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ప్రజలు వివరిస్తుండగా, ఇద్దరు ప్రజాప్రతినిధులు స్వయంగా రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడి, రహదారి పూర్తిగా పునర్నిర్మాణం చేయడానికి తక్షణ చర్యలు ప్రారంభిస్తామని,ఇప్పటికే ఆ దిశగా చర్యలు చేపట్టడం జరిగింది అన్నారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ,మా కూటమి ప్రభుత్వం ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు అందించడానికి కృషి చేస్తున్నాం అన్నారు. రౌతుపాలెం-వంతాడ రహదారి పునర్నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు మరియు పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### సీజే గవాయిపై దాడి

# భారత రాజ్యాంగంపైన జరిగిన చర్యగా భావిస్తున్నాం..

## ఈ దాడిని నిరసిస్తూ.. నవంబర్ 1న హాలో మాదిగ ఛలో హైదరాబాద్ - జిల్లా ఇన్‌చార్జి బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ పిలుపు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జి బయ్యారపు రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం రాజమహేంద్రవరం సిమెంట్రిపేటలో ఉన్న బాబు జగజ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్ వద్ద గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ తూర్పుగోదావరి జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయి పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు కాకుండ అతనిని న్యాయవాద వృత్తి నుండి తొలగించి అతని పట్టా రద్దు పరచాలని కోరుతూ నవంబర్ 1వతేదీన లక్ష మందితో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రజలను వేలాదిగా తరలించేందుకు జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల నుండి ఈ సభలో పాల్గొని సభను విజయవంతం చేసేందుకు ఎమ్మార్పీస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడిని తాము దేశంపైన, న్యాయవ్యవస్థపైన, భారత రాజ్యాంగంపైన జరిగిన దాడి అని అభివర్ణించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీజే గవాయిపై దాడి జరిగి నెల రోజులు గడుస్తున్న ఇప్పటివరకు నిందితుడిపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు వేచి చూసిన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు నవంబర్ 1వ తేదీన సీజే గవాయిపై దాడిని నిరసిస్తూ హైదరాబాదులో లక్షలాది మందితో ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సభ అనంతరం చర్యలు తీసుకోకపోయిన పక్షంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద లక్షలాది మందితో నిరసన సభ నిర్వహిస్తామని అన్నారు. నవంబర్ 1వ తేదీన హైదరాబాదులో జరిగే సభను ఉభయ రాష్ట్రాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గడ్డం వినోద్,రాష్ట్ర కార్యదర్శి అనకాపల్లి సూరి(డాన్ సూరి), ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు తోలేటి రాంప్రసాద్,ఎం ఎస్ ఎఫ్ కొడమంచిలి వెంకటరమణ, నగర ఏంఆర్పిఎస్ నాయకులు రాచర్ల సుధాకర్, వైరాల రమేష్,కూరాకుల రాజు, రామవరపు వెంకటేశ్వర్లు, ఉప్పాటి అప్పారావు, కొల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఓడలరేవు బీచ్‌కి యాత్రికులు వెళ్ళరాదు..

## అల్లవరం పోలీసులు హెచ్చరిక



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముంచుకొస్తున్న మంతా తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల కార్తీకమాసం పురస్కరించుకుని రేపు ఆదివారం 26.10.25న ఓడలరేవు సముద్రతీరానికి స్నానానికి యాత్రికులు ఎవ్వరు వెళ్లరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అల్లవరం పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి బి.సంపత్ కుమార్ ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.

### కూటమి ప్రభుత్వంలో

# చిన్నారులపై, మహిళలపై పెరిగిన అత్యాచారాలు

**రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు - ప్రభుత్వం అధికారులు నిర్లక్ష్యం వల్లే ప్రైవేట్ బస్సుల ప్రమాదాలు**

**28న ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైసిపి ప్రజా ఉద్యమం - మార్గాని భరత్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎం.పి. మార్గాని భరత్ రామ్ పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్ లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో మహిళలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, చిన్నారులపై దాడులు, మానభంగాలు అధికంగా జరుగుతున్నాయని వివరించారు. కూటమి నాయకులు మైనర్ బాలికలను లోబరుచుకొని తీసుకువెళ్లి రేప్ చేసిన సంఘటనలు ఎన్నో జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలు చూసి బాధ వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల తమ ఆడపిల్లలకు ఇలాంటి సంఘటనలు జరిగితే సహిస్తారా ? అని ప్రశ్నించారు. మైనర్ బాలికలపై తుని లోను, రాజమండ్రి లోను అత్యాచారాలు జరిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు. రాజమండ్రిలో హాస్టల్ లో చదివే బాలికలు సాయంత్రం 5.30 గంటలకు తీసుకెళ్లి ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ సంఘటనపై ప్రభుత్వం గానీ స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం శోచనీయం అని అన్నారు. ఈ సంఘటనపై బీసీ హాస్టల్ వద్ద ధర్నా చేస్తే తమపై కేసులు పెట్టి అరెస్టులు చేశారని అన్నారు. ఈ సంఘటన తో కడుపు తరుక్కుపోయిన మహిళ హాస్టల్ ఎదురుగా ఉన్న ఎమ్మెల్యే పోస్టర్ కు పేడ రాస్తే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. వైసిపి నాయకురాలు అను యాదవ్ ఇంటికి 10 మంది పోలీసులు వెళ్లి హడావిడి సృష్టించారని తాను వెళ్ళితే తనతో కూడా వాగ్వాదానికి దిగారని వివరించారు. ఈవీఎం ఎమ్మెల్యే ఏమైనా దేశ నాయకుడా, స్వతంత్ర సమరయోధుడా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై కక్ష సాధింపు తో అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. 41సీ నోటీస్ ఇచ్చి 26వ తేదీన విచారణకు రమ్మని చెప్పి పంపారని, వెళ్లిపోతున్న తమను మళ్లీ త్రీ టౌన్ సిఐ వచ్చి పోలీసు స్టేషన్ లోపలికి రమ్మంటూ మరలా తీసుకెళ్లారని పేర్కొన్నారు. పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ శ్రేణులపై పోలీసుల వేధింపులకు ఇది నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో ఒకసారి గమనించాలని ప్రజలను కోరారు. రాజమండ్రిలో నకిలి మద్యం వ్యవహారానికి సంబంధించి ఈవీఎం ఎమ్మెల్యే బినామీ ఆడియో బయటికి వచ్చిందని, దానిపై చర్యలు లేవని అన్నారు. గోదావరి జిల్లాలో పేకాట సర్వసాధారణం అని డిప్యూటీ స్పీకర్ మాట్లాడటం దారుణం పేర్కొన్నారు. రాజమండ్రిలో మద్యం ఇసుక, మట్టి , భూసెటిల్మెంట్లు, పేకాటకు క్లబ్బులు ఒకటేమిటి అన్ని రకాల దారుణాలు ఈవీఎం ఎమ్మెల్యే అండదండలతో సాగుతున్నాయని ఆరోపించారు. కర్నూల్లో ప్రమాదానికి గురైన వోల్వో బస్సుకు ఏడాదిన్నరగా ఫిట్నెస్ సర్టిఫికెట్ లేదని తెలిపారు. అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ పై తనిఖీలు చేపడితే రాష్ట్రంలో లక్షల వాహనాలకు ఫిట్నెస్ లేని విషయం బయటపడుతుందని అన్నారు. 19 మంది ప్రాణాలు పోవటానికి కారణం ఎవరు అని ప్రశ్నించారు. ప్రమాదానికి గురైె బస్సుకు ఇన్సూరెన్స్ లేదని, 16 ఈ చలనాలు ఉన్నాయని చెప్పారు. ఈ సంఘటనను సుమోటాగా తీసుకొని సుప్రీంకోర్టులో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మాట్లాడేవన్నీ పచ్చి అబద్ధాలని చంద్రబాబు సీఎం కావడానికి ముందే సత్యానాదెళ్ల మైక్రోసాఫ్ట్ లో ఉన్నారని వివరించారు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ గూగుల్ డేటా సెంటర్ కు సంబంధించి తన మాటల్లో ఎక్కడ చంద్రబాబు పేరు ప్రస్తావించలేదని అన్నారు. ఆదాని డేటా సెంటర్ నోయిడాలో కూడా ఉందని అక్కడ కూడా గూగుల్ పార్టనర్ షిప్ తోనే నడుస్తుందని తెలిపారు. ఈనెల 28వ తేదీన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ఉద్యమం చేపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా ఉద్యమం పోస్టర్ను మాజీ ఎంపీ భరత్ రామ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ఆవిష్కరించారు.

# రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి


**రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేదు - ఎస్సీ ఎస్టీలకు దాడులు జరిగితే ఎందుకు వివక్షత చూపుతుంది..?**

**ఎస్సీ యువకుడు పాముల శ్రీనివాస్ పై దాడి పాల్పడిన వారి అందరిని అరెస్ట్ చేయాలి.. : బీఎస్పీ రాజమండ్రి ఇన్‌ఛార్జ్ గుమ్మాపు చిత్రసేన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలని బహుజన సమాజ్ పార్టీ రాజమహేంద్రవరం ఇంచార్జ్ గుమ్మాపు చిత్రసేన డిమాండ్ చేశారు. శనివారం రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం వద్ద గల అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ జిల్లా నాయకులు పట్నాల విజయ్ కుమార్ ఇసుకపట్ల రాంబాబు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని అన్నారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేదని అన్నారు. కుటమి ప్రభుత్వం తమ సామాజిక వర్గాలపై దాడులు జరిగితే వేగంగా స్పందిస్తుందని, ఎస్సీ, ఎస్టీల పై దాడులు జరిగితే వివక్షత చూపుతుందని విమర్శించారు. మధురపూడికి చెందిన పాముల శ్రీనుపై గాడాలకు చెందిన అగ్రవర్ణాలకు చెందిన కాపు యువకులు 30 మంది గాడాలలో మెయిన్ రోడ్డులో ఉన్న కరెంటు స్తంభానికి కట్టేసి ఇనుప రాడ్డులతోనూ కడియాలతో దారుణంగా కొట్టి గాయపరిచారని వివరించారు. ఈ కేసులో 4 ముద్దాయిలను మాత్రమే అరెస్టు చేశారని మిగిలిన వారిని అరెస్టు చేయలేదని తెలిపారు. ఈ సంఘటనపై డిఎస్పికి ఫిర్యాదు చేశామని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే కైకలూరు మండలం దానం గూడెంలో ఎస్సీ ఎస్టీలపై దాడులు జరిగితే ఈ సంఘటనలో కూడా దోషులను అరెస్టు చేయలేదని తెలిపారు. ఎస్సీ ఎస్టీల పట్ల వివక్షత చూపుతున్న కూటమి ప్రభుత్వం కందుకూరు సంఘటనలో బాధితులకు నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఉద్యోగం కట్టబెట్టారని అన్నారు. ఎస్సీ ఎస్టీలపై జరిగే దాడులలో నష్టపరిహారం చెల్లించకుండా వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. పాముల శ్రీనివాస్ పై దాడి జరిగి నెల కావస్తున్న ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదని, దోషులను అరెస్టు చేయలేదని అన్నారు. రాజకీయ పార్టీలు తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలనుకుంటే తమ పార్టీ ఫండ్ నుంచి బాధితులకు భూములు, నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ చట్టాలను నిర్వీర్యం చేసేందుకే కూటమి ప్రభుత్వంలో ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని అన్నారు. ఎస్సీ ఎస్టీ హాస్టల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం లో బోడి గురుకుల పాఠశాలలో 400 మంది విద్యార్థినీలకు రెండే బాత్రూంలో ఉన్నాయని, కూటమి ప్రభుత్వం వాటికి పెంచి హాస్టల్ లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు ప్రచారం చేసుకునేందుకు యాడ్ల రూపంలో కోట్లాది రూపాయలకు ఖర్చు చేస్తున్న కూటమి ప్రభుత్వం గురుకుల పాఠశాలలో ఎస్సీ ఎస్టీ హాస్టల్స్ విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. బి.ఎస్.పి. జిల్లా అధ్యక్షులు పట్నాల విజయ కుమార్ మాట్లాడుతూ మధురపూడి సంఘటన జరిగి నెల రోజులు కావస్తున్నప్పటికీ సరైన విచారణ జరగడంలేదని తెలిపారు. 30 మంది కాపు కులస్తులు గాడాల మెయిన్ రోడ్డు సెంటర్లో స్తంభానికి కట్టి దారుణంగా కొట్టడం దురదృష్టకరమైన అన్నారు. ఈ సంఘటనలో నలుగురు మాత్రమే అరెస్టు చేశారని తెలిపారు. సంఘటన స్థలంలో సీసీ కెమెరాలు పరిశీలించి మిగిలి వారిని అందరిని అరెస్టు చేసింది కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కందుకూరు సంఘటనలో బాధితులకు కూటమి లోని అందరూ భాగస్వాములు నగదు, భూమి, ఉద్యోగం మంజూరు చేశారని, అయితే ఎమ్మెల్సీ అనంతబాబు తన కారు డ్రైవర్ ను దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేస్తే ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. ప్రభుత్వ నిధులు కేటాయించడంలో ఎస్సీ ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. బాలికల హాస్టల్ లో బాలికలపై అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని వీటిని అరికేందుకు హాస్టల్స్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టల్స్ లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. బి.ఎస్.పి. రాజమండ్రి ఇన్‌ఛార్జ్ ఇసుకపట్ల రాంబాబు మాట్లాడుతూ మధురపూడి కి చెందిన పాముల శ్రీను పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. కాపుల్ని కమ్మవారు చంపుతుంటే నాలుగు ఎకరాలు భూమి ఉద్యోగం ఇచ్చారని రాజకీయ కక్ష సాధింపుతో జరిగిన హత్యలకు ప్రభుత్వ నిధులు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. పాముల శ్రీను అగ్రవర్ణాల దాడి చేయడంతో పాటు ముఖంపై ఉమ్మ వేసారని నిందితుల్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. తుని గురుకుల పాఠశాల, రాజమహేంద్రవరం ఎస్సీ హాస్టల్ లో 140 మంది విద్యార్థినిలకు సిబ్బంది తక్కువగా ఉన్నారని సిబ్బంది వెంటనే నియమించాలని కోరారు. ఎస్సీ బాలుర హాస్టల్లో మెనూ బాగో లేనిది అన్నందుకు విద్యార్థులపై కేసులు పెట్టారని తెలిపారు. ఈ వ్యవహారం విచారణ జరిపిఎ.ఎస్. డబ్ల్యు ఓ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలికల హాస్టల్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి బాలికలకు రక్షణ కల్పించాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీఎస్పీ నాయకులు జి.సత్యనారాయణ, నెల్లి రమేష్, నక్క వెంకటరత్నం, కొత్తపల్లి సూరిబాబు, కొల్లాటి అబ్బులు,ఆనంద్ మాస్టర్,బియ్యా మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఇనుగంటివారిపేట ఎఎంలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ టీం తనిఖీ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఇనుగంటివారిపేట గ్రామం ఆయుష్ మాన్ ఆరోగ్య మందిర్ లో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్ టీం ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు అవసరమైన పరికరాలు వాటి నిర్వహణ గురించి వర్చువల్ గా తనిఖీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఈ కార్యక్రమ పర్యవేక్షణ అధికారి డాక్టర్ సుధ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే నిమిత్తమై ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించిందని 14 రకాల టెస్టులు, 105 రకాల మందులు ఇక్కడ ఉచితంగా అందుబాటులో ఉంచిందని వీటిని ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని తెలియజేశారు. సంబంధిత దస్త్రాలన్నీ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.వారం రోజుల్లో ఇనుగంటి వారి పేట ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ఎం క్యు ఏఎస్ నుండి ధ్రువీకరణ పత్రం వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య, గ్రామ సర్పంచ్ సత్యం శ్రీరామమూర్తి, పంచాయతీ కార్యదర్శి విఠల్, ఎం పి హెచ్ ఈ ఓ వైయస్. రాయుడు ఎం ఎల్ హెచ్ పి కృష్ణవేణి ఏఎన్ఎం పి బుజ్జమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎస్ నగేష్ బాబు, ఆశా కార్యకర్తలు కే మణి, ఎన్ పుష్పరాజ్యం మొదలగువారు పాల్గొన్నారు.

### ఉప కులపతి మునిరత్నం నాయుడికి

# అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం స్వర్గీయ ఎన్టీఆర్ మానస పుత్రికని, ఆయన కలలోని తెలుగు తల్లి గౌరవం పెంచే ఆవిష్కరణలలో ఒకటి... తెలుగు భాషా పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా బాధ్యతలు స్వీకరించిన డి.మునిరత్నం నాయుడిని స్థిరవారం విశ్వవిద్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఇప్పుడు రాజమహేంద్రవరం కేంద్రంగా విశ్వవిద్యాలయం ఏర్పడడం ఆనందదాయకమన్నారు. పూర్వ వైభవం సంతరించుకోవాలని అన్నారు. తమిళనాడులో తమిళ విశ్వవిద్యాలయం స్థాపనకు స్ఫూర్తిగా,అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మొదట మహిళా విశ్వవిద్యాలయం, అనంతరం తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నారని, రాజమహేంద్రవరం కేంద్రంలో తెలుగు ఎం.ఏ., శ్రీశైలంలో సంస్కృతి, చరిత్ర విభాగాల్లో ఎం.ఏ., పీహెచ్‌డీ, అలాగే కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రంలో నృత్యానికి సంబంధించిన సర్టిఫికేట్, డిప్లొమా కోర్సులు ప్రారంభించడం సంతోషమన్నారు. సాంకేతిక పరమైన అడ్డంకులు అధిగమించి మిగిలిన కోర్సులు కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, అందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రధాన కేంద్రంగా తెలుగు విశ్వ విద్యాలయం ఇక్కడి నుంచే పని చేసేందుకు సహకారం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మరీ ముఖ్యంగా ఐటీ మరియు విద్య శాఖ మంత్రి నారా లోకేష్ లకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే విశ్వ విద్యాలయం అభివృద్ధికి ఇతర విషయాల్లో సహకరించిన తనతోటి ప్రజా ప్రతినిధులందరికీ కూడా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

# నవంబరు 8న బౌద్ధ మహోత్సవం..

**- కాపవరం రానున్న అంబేద్కర్ మునిమనవడు రాజారత్న అశోక్**

**- కరపత్రం ఆవిష్కరించిన ఓఎన్జీసీ రిటైర్డ్ ఎస్సెట్ మేనేజరు డిఎంఆర్ శేఖర్**



**రాజమహేద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మునిమనవడు రాజారత్న అశోక్ నవంబరు 8వ తేదీన కాపవరం బౌద్ధ క్షేత్రంలో జరగనున్న బౌద్ధ మహోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరవుతున్నా రని ఓఎన్జీసీ రాజమండ్రి రిటైర్డ్ ఎస్సెట్ మేనేజరు డి.ఎం.ఆర్.శేఖర్ తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుటు ఉన్న అంబేద్కర్ భవన్ లో బౌద్ధ మహోత్సవం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎంఆర్ శేఖర్ మాట్లాడుతూ నవంబర్ 8 తేదీన కాపవరం బౌద్ధ క్షేత్రం వద్ద జరిగే బౌద్ధ మహోత్సవానికి అంబేద్కర్ ముని మనవడు రాజారత్న అశోక్ అంబేద్కర్ ఉత్సవాలకు వస్తున్నందున జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ ముని మనవడును చూడాలని, ఆయన సందేశాన్ని వినాలని కోరారు. ప్రభుద్ధ భారత నిర్మాణంలో ప్రతిఒక్కరు పాల్గొనాలని ఆయన కోరారు. ఉత్సవ నిర్వహణ అధ్యక్షుడు సిహెచ్. సుబ్బారావు మాట్లాడుతూ ఈ సమావేశానికి రాష్ట్రంలో ఉన్న అన్ని బౌద్ధ సంఘాల ప్రముఖులను ఆహ్వానించామని,రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గౌరవ అతిథులుగా విచ్చేస్తున్నారని చెప్పారు. బౌద్ధ ఉత్సవాల కన్వీనర్ మర్రి బాబ్జి మాట్లాడుతూ కోరుకొండ సీతానగరం, గోకవరం, రాజానగరం, రాజమండ్రి మండలాల నుండి అనేకమంది అంబేద్కరీయులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాశీ నవీన్ కుమార్,దాసి వెంకటరావు, ధారా యేసురత్నం, తాళ్లూరి బాబు రాజేంద్ర ప్రసాద్, కొల్లాటి అబ్బులు, కోరుకొండ చిరంజీవి, నక్కా వెంకటరత్నం, కొంకి రమేష్, పంతగడ పండరీరాం, కొమ్మర్తి బాబ్జి, చింతా అనిల్ కుమార్, డాక్టర్ కుంచె వెంకటరమణ, గుడిసె వనరాజు, చిలుకోటి కూర్మయ్య, అనుసూరి ఆదినారాయణ, పట్నాల విజయకుమార్,యెద్దు కాటం స్వామి,జీవన్ సురేష్ కుమార్, ఇసకపట్ల రాంబాబు,బాపిరాజు, బందిల దుర్గాప్రసాద్, గొంతి కేశవ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి బాలోత్సవం తాత్కాలికంగా వాయిదా..

**ఆర్గనైజింగ్ సెక్రటరీ తులసి వెల్లడి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం స్థానిక ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో ఈనెల 25,26 తేదీల్లో జరగాల్సిన గోదావరి బాలోత్సవం మూడో పిల్లల పండుగ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి వెల్లడించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఇంకా కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏర్పాట్లు చేయడానికి పరిస్థితులు అనుకూలించడం లేదని తెలిపారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని వివరించారు. మరొక మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారని, ఎస్‌కెవిటి కళాశాల మైదానం కూడా నీటిలో మునిగిపోయిందని దీని వల్ల ఏర్పాట్లకి ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహణ కమిటీ సమావేశమై తాత్కాలికంగా వాయిదా వేయడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇలా వర్షాలు కురవడం వల్ల పిల్లల్ని తీసుకుని రావడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కూడా ఇబ్బంది ఎదురవుతుందని, తమకు కూడా కార్యక్రమంకి వచ్చే వారికి అవసరమైన సౌకర్యాల కల్పన సాధ్యం కాదనే ఉద్దేశ్యంతో వాయిదా వేసామని తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామన్నారు. పాఠశాలల యాజమాన్యాలకు వాయిదా వేసిన విషయాన్ని తెలియచేస్తున్నామని, విద్యార్థులు, వారి తల్లితండ్రులు కూడా పరిస్థితిని అర్థం చేసుకోవాలని తులసి కోరారు. కార్యక్రమం వాయిదా పడిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ కి కూడా ఇంకా గడువు ఇస్తున్నామని, బాలోత్సవంలో పాల్గొనాలనే ఆసక్తి ఉండి ఇప్పటివరకు ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోలేని స్కూల్స్ ఏమైనా ఉంటే దరఖాస్తులు పంపించవచ్చు అని,స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకునేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాయిబాబు, ఉపాధ్యక్షురాలు ఐ.నవీనకుమారి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రవీంద్ర, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్షర కృషీవలుడు, ప్రజా కవి

# కలేకూరి ప్రసాద్ జయంతి ఘన నివాళి

కలేకూరి ప్రసాద్ చిత్రపటానికి పూలమాల అలంకరణ



**ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థిర వారం ఉదయం కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ వి.ఎస్.శేఖర్ బాబు అధ్యక్షతన "ప్రజా కవి కలేకూరి ప్రసాద్" జయంతి సభలో కళాశాల అధ్యాపకులు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జీ ప్రిన్సిపాల్ వి.ఎస్.శేఖర్ బాబు మాట్లాడుతూ సమస్త ప్రగతికి ప్రాణ భూతమైన దళిత ఔన్నత్యాన్ని,తాత్వికతను దశ దిశలా రాసిపోసిన అసాధారణ ప్రజా కవి కలేకూరి ప్రసాద్ అన్నారు. తన కవితా జీవదాతువు లతో రచనా సిరులతో సమకాలీన సాహితీ క్షేత్రాన్ని సస్యశ్యామలం చేసిన అక్షర కృషీవలుడు, వెలివాడల గుండెల నిండా నిప్పుల నినాదాన్ని వెలిగించి, అంటారని బతుకుల్లో పిడికెడు ఆత్మగౌరవాన్ని ప్రసరించిన ప్రత్యామ్నాయ సాంస్కృతిక సమరయోధుడు కలేకూరి ప్రసాద్ యువ,శబరి, సంఘమిత్ర,నవత కలం పేర్లతో రాసిన దళిత సాహిత్యం,పిడికెడు ఆత్మ గౌరవం కోసం, అంటారని ప్రేమ వంటివి కలేకూరి ప్రసాద్ కలం నుండి జాలువారిన ప్రసిద్ధ రచనలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.పెద్దబ్బులు ,వై.శివకుమారి,సి.శాంతి సుధ,కె.వెంకటరావు, డి.భాస్కరరావు,ఎన్. కళ్యాణి దేవి,కె.గంగాధర్, బి.ఏసురత్నం,వై.రాజేష్ బాబు, పి.సూర్య, తెలుగు అధ్యాపకుడు పి.భాస్కర రావు,రాజ్యలక్ష్మి, రామాంజనేయరావు, ఉమాశంకర్, జి.అక్షయ జ్యోతి,టి.సుహాసిని, ఎ.జ్యోతి,ఆఫీసు సిబ్బంది మేఘన,తులసి, పుణ్యవతి,ల క్ష్మి ,అమ్మాజీ తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు కోరుకొండలో జరిగే దళితుల ధర్నాను విజయవంతం చేయండి

కుల వివక్షణ వీడాలి - దళిత యువకుడికి న్యాయం జరగాలి

గోకవరంలో దళిత సంఘాల పిలుపు




**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల గాడాలలో దళిత యువకుడిపై అమానుష దాడి జరిగిన విషయం విధితమే. సంఘటనకు సంబంధించి బాధితుడు తొమ్మిది మంది నిందితులను గుర్తించిన పోలీసులు కేవలం నలుగురిపైనే కేసు నమోదు చేసి అరెస్టు చేయడంపై దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసుల తీరును నిరసిస్తూ ధర్నాకు పిలుపునిచ్చాయి. నేడు అనగా ఆదివారం జరుగు ధర్నాకు దళిత సంఘాలు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో దళిత సంఘాలు విలేకరుల సమావేశం నిర్వహించారు.దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ గొడవలు, తగాదాలు సహజమని కానీ ఒక వ్యక్తిని కాళ్ళతో కట్టి, కొట్టి,ఉమ్మి వేస్తూ, రక్త గాయాలు చేయడం అమానుష చర్యని నాగరిక సమాజంలో ఇంకా కులాన్ని చూస్తూ దళిత యువకుడిపై కుల వివక్ష చూపిస్తూ దూషించడం అత్యంత హేయమన చర్యని మాట్లాడారు. మా దళితులం ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకున్న కేవలం కులం పేరుతో మా స్థాయికి తగ్గ గౌరవం లభించడం లేదని మాట్లాడారు. కేవలం పోలీసులు తూతూ మంత్రంగా అరెస్టులు చేయడం కేసును నీరుగార్చే ప్రయత్నం చేయడం తగదని మాట్లాడారు. ఈ ఘటనపై నిరసనగా ధర్నాకు పిలుపునిచ్చామని దళితులంతా ఐక్యంగా ధర్నాలో పాల్గొని దళిత యువకుడిపై జరిగిన దాడిని ఖండించాలని భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మాట్లాడారు.

# రంగంపేట మండలం కుమ్మర శాలివాహన కమిటీ నూతన ఎన్నిక






**రంగంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అనపర్తి నియోజకవర్గం, రంగంపేట మండలంలో "ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన"ముఖ్య అతిథిగా రంగంపేట మండల అధ్యక్షులు చెరుకువాడ నరసింహమూర్తి ఆధ్వర్యంలో కుమ్మర శాలివాహన సంఘం సమావేశం జరిగింది. సంఘ సమావేశంలో డైరెక్టర్ దాలిపర్తి వేమన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే కుమ్మర శాలివాహనుల అభివృద్ధి జరుగుతుందని, గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆదరణ పథకం ద్వారా కుమ్మరి కులస్తులకు పనిముట్లను ఇచ్చి కుల వృత్తిని ప్రోత్సహించడం జరిగిందని, అదేవిధంగా బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుటలో సహాయపడిందని తెలియజేస్తూ రానున్న రోజులలో మరల ఆదరణ పథకం ద్వారా కులవృత్తి దారులను ఆదుకోవడమే కాకుండా ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం చూస్తుందని తెలియజేస్తూ ఈ సందర్భంగా "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గారి నాయకత్వంలోని" కూటమి ప్రభుత్వానికి వేమన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు ఏకాభిప్రాయంతో "రంగంపేట మండల కుమ్మర శాలివాహన సంఘ కమిటీని" ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా చెరుకువాడ నరసింహా మూర్తి, ప్రధాన కార్యదర్శిగా కొలుకులూరి మురళి, కోశాధికారిగా పసలపూడి నాగేంద్ర కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కపిలేశ్వరపు హనుమాన్, సాయికుమార్,కార్యదర్శిగా శంకర్రావు,ఎగ్జిక్యూటివ్ మెంబర్లగా ఆదినారాయణ, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, రామకృష్ణ, సూర్యప్రసాద్, కోటిపల్లి శ్రీనివాసు ఎన్నుకోబడ్డారు.

సీనియర్ న్యాయవాది ఎస్ఆర్ సంకు

# ఆశయ సాధనకు కృషి చేస్తాం..

- సంకు వర్ధంతి సభలో కన్నీటి పర్యంతం అయిన మేడా
- చిత్రపటానికి పూలమాల వేసిన ఘన నివాళి అర్పించిన మేడా శ్రీనివాస్ వారి బృందం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీనియర్ న్యాయవాది గురువులు స్వర్గీయ ఎస్.ఆర్ సంకు ఆయన మా నుండి దూరం అయ్యి నేటికి సంవత్సరం కావొస్తుందని "ఆలా"ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ గుర్తు చేసుకుంటూ మనస్థాపం చెందారు. శుక్రవారం నరసాపురం తాలూకా మొగల్తూరు గ్రామంలో జరిగిన సంకు ప్రథమ వర్ధంతిలో "ఆలా " ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ తదితరులు పాల్గొని నివాళిలు అర్పించారు.ఆయన్ను స్మరించుకుని కన్నీటి పర్యాంతం చెందారు. ఆయన లేని లోటు వెల కట్టలేనిది పూడ్చ లేనిది. ఆయన ఆశయ స్ఫూర్తికి అనుగుణంగా న్యాయవాద విలువలు, భద్రత, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తాం.. సంకు మానస పుత్రిక ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఆలా) ఆయన ఆశయ సాధనలో భాధిత న్యాయవాదుల కోసం నిరంతరం అండగా నిలుస్తుందని మేడా శ్రీనివాస్ సంకల్పించారు. "ఆలా"అధ్యక్షులు ఎమ్‌వి రాజారామ్, కార్యదర్శి అవధానుల హరి వార్లు సంకు వర్ధంతి సందర్భంగా నివాళులు హైదరాబాద్, గుంటూరు ప్రాంతాల నుండి అందచేశారు.నాకు అత్యంత ఇష్టుడు సంకు అని,సంకు నాకు మంచి మ్మిత్రుడు,శ్రేయోభిలాషి అని తలచుకుని తలచుకుని రాజారామ్ తీవ్రమైన మనస్తాపానికి గురైయ్యారు.కార్తీకమాస శుభ సందర్భంగా సంకు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబాని ప్రగాఢ సానుభూతిని "ఆలా" తరుపున సానుభూతిని వ్యక్త పరిచారు.

నిత్యం ప్రజల్లో ఉంటూ

# నిజమైన నాయకుడు ఆదిరెడ్డి వాసు

- యాళ్ళ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ యాళ్ళ ప్రదీప్ ఆధ్వర్యంలో...
- అంగరంగ వైభవంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముందస్తు పుట్టినరోజు వేడుకలు
- 2వేల మందికి 5 కిలోల వంతున బియ్యం బ్యాగులు పంపిణి
- భారీ కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- ఈవీఎం ఎమ్మెల్యే కాదు.. ఎవ్రీ టైమ్ రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు : డాక్టర్ యాళ్ళ ప్రదీప్
- మరో 20 ఏళ్ళు ఆదిరెడ్డి వాసు ఎమ్మెల్యేగా ఉంటారు : టిడిపి నాయకులు













**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఏగాలి వీచినా రాజమండ్రిలో టీడీపీ జెండా ఎగరవేస్తున్న, మహిళలకు ప్రజలకు పాదాభివందనలు చేస్తున్నానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) వినయంగా చెప్పారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పని చేస్తూ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యాళ్ళ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నటరాజ్ థియేటర్ వద్ద ఆదిరెడ్డి శ్రీనివాస్ ముందస్తు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2 వేలమందికి 5 కేజీల వంతున బియ్యం బ్యాగులను, మొక్కలను పంపిణి చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు భారీ కేకు కట్ చేశారు. ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బుడ్డిగ రవి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమండ్రిని టీడీపీకి కంచుకోటగా మార్చి వరుస విజయాలు అందిస్తున్న నగర ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తమను కుటుంబ సభ్యులుగా ఆదరిస్తున్న ప్రజల మధ్యకు రావడం గొప్ప అనుభూతిని ఇస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.16 సంవత్సరాలుగా తమ కుటుంబంలో తన తల్లిని మేయరుగా, తండ్రిని ఎమ్మెల్సీగా, తన సతీమణిని ఎమ్మెల్యేగా, ఇప్పుడు తనను ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. నాయకత్వ లక్షణాలు పెంచేందుకు అందరికీ పదవులు కల్పిస్తున్నామని ఆయన అన్నారు. అనవసర విమర్శలు, అసత్య ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు తన మంచితనాన్ని చేతకానితనంగా భావించవద్దని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. తాను కన్నెర్ర చేస్తే అన్ని ప్రాంతాల్లో ఉన్న తన అభిమానుల ఆగ్రహాన్ని ప్రత్యర్థులు తట్టుకోలేరని ఆయన వ్యాఖ్యానించారు. అయితే రాజకీయ వాతావరణ బాగుండాలని, నగరం, మహిళలు సురక్షితంగా ఉండాలని తాను కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ముందస్తు పుట్టిన రోజు వేడుకల నిర్వాహకుడు యాళ్ళ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నయ్య ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ మొన్నటి ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన అక్కసుతో, అసుయతో వాసు అన్నయ్యను ఈవీఎం ఎమ్మెల్యే అంటున్నారని, కాని రాజమండ్రి సిటీలో ఎవ్రీ టైమ్ ఆయనే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అని, రానున్న రోజుల్లో మంత్రిగా పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటారని ఆయన ఆకాంక్షించారు. ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి మంచిచెడ్డలు చూసే యువ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నిజమైన ప్రజా నాయకుడని 43 వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వాసుమరో 20 ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉండాలని ఆశీస్సులు అందచేశారు. నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, రాచపల్లి ప్రసాద్, కూటమి నాయకుడు దొండపాటి సత్యం బాబు, యెనుముల రంగబాబు, నగర తెలుగు మహిళ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల హక్కులు హరించే కుట్రపై వాజ్యం దాఖలు..

(ఆలా)ఎమ్.వి రాజారామ్, మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సామాన్యులు పోటీచేయకుండా ఖరీదైన ఎన్నికలుగా మార్చే కుట్రను ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (అలా) అధ్యక్షులు ఎమ్ వి రాజారామ్, ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ సంయుక్తంగా ఎదుర్కొంటున్నాము అని ఓ ప్రకటనలో తెలిపారు.ఎమ్ వి రాజారామ్,మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సామాన్యులు పోటీచేయకుండా ఖరీదైన ఎన్నికలుగా మార్చే కుట్రను ఎదుర్కోవడానికి వ్యాజ్యం దాఖలు చేసాము, ముక్యంగా బార్ కౌన్సిల్ సభ్యులుగా పోటీ చేయాలనుకునే అభ్యర్థి రుసుమును 1,25,000/-కు పెంచేసారు.పైగా నాన్ రిటర్నుబుల్ ఎమౌంట్‌గా మార్చేశారు.ఒక కార్పొరేట్ వ్యాపార లాభదాయక పరిశ్రమగా బార్ కౌన్సిల్ ఎన్నికలను కలుషితం చేయటం బాదాకారం.ఈ కుట్ర చర్య న్యాయవాదుల భద్రత, సంక్షేమం, భవిష్యత్‌పై కాల కూట విషం చిమ్మటం వంటిది. అభ్యర్థి రుసుమును 2000/-లకు కుదించమని, అమాంతం పెంచిన 1,25 ,000/-రుసుమును రద్దు చేయమని ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది ఎమ్.వి రాజారామ్, న్యాయవాది మేడా శ్రీనివాస్ ఏపి హై కోర్టులో వాజ్యం దాఖలు చేసాము.ఈ వాజ్యంలో ఎమ్. వి రాజారామ్ ప్రత్యేక వాదనలు వినిపించనున్నారు. రోజుల వ్యవది లోనే వాజ్యం విచారణకు వస్తుంది.అంత పెద్ద మొత్తంలో లక్షల్లో పెట్టుబడి పెట్టి పోటీ చేయదలిచిన అభ్యర్థి న్యాయవాదుల సమస్యలకు అండగా నిలిచి వారికి న్యాయం చేయగలరా ! పెట్టిన పెట్టుబడికి అవినీతి చర్యలకు మార్గం చేసుకుంటారా ! అనే ఘటనపై విజ్ఞులైన సహచర న్యాయవాదులు ఆలోచించి"ఆలా" పోరాటానికి అండగా నిలవాలని వారు కోరారు. అద్వకేట్స్ భద్రత, సంక్షేమం, భవిష్యత్ ప్రధాన లక్ష్యంగా "ఆలా" పని చేస్తుందని, అద్వకేట్స్‌కు సమస్యలు, వారికి అవసరమయ్యే చట్ట పరమైన సహాయ సహకారాలు, కొన్ని ఇతర ముఖ్య సమస్యలపై త్వరలో ఆలా అధ్యక్షులు రాజారామ్ సారధ్యం ఒక ముఖ్య సమావేశం నిర్వహించుటకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, న్యాయవాదులు మా ప్రయత్నానికి వెన్ను దన్నుగా నిలిచి న్యాయవాదుల భద్రతకు, సంక్షేమానికి సహకరించగలరని కోరుచున్నాము. త్వరలో జరగబోయే భార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోబాలకు తలోగ్గవద్దని విజ్ఞులైన న్యాయవాదులను కోరుచున్నాము. ఇప్పటికే న్యాయవాదులకు ప్రత్యేక చట్టం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానంలో ఆలా అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది ఎమ్.వి రాజారామ్ ప్రత్యేక వాజ్యాన్ని దాఖలు చేసి ఉద్యమ పాదయాత్ర పోరాట బాటకు న్యాయస్థానం ద్వారా అనుకూలమైన ఆదేశాలు సాధించటం కూడా న్యాయవాదుల విజయంగా భావించాలి. ఖచ్చితంగా ఆలా కృషితో రాజారామ్ న్యాయవాదుల భద్రతకు అవసరమయ్యే ప్రత్యేక భద్రతా చట్టం సాధిస్తారని ఈ సందర్బంగా ధీమా వ్యక్తం చేసారు. న్యాయవాదులకు ఎదురయ్యే సమస్యలు అక్రమ కేసులు పట్ల ఆలా అండగా నిలుస్తుందని, బాధిత న్యాయవాదికి అంతిమ న్యాయం జరిగే వరకు ఆలా నిలుస్తుందని ఈ సందర్బంగా వారు భరోసా ఇచ్చారు. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటి చేయుటకు బారిగా లక్షల్లో పెంచిన అభ్యర్థుల ఫీజు రుసుమును తక్షణమే రద్దు చేసి సామాన్యులు సైతం పోటి చేయుటకు వీలుగా 2000/- రుసుమును నిర్ణయించే దిశగా చర్యలు అమలు చేయాలి. రాజారామ్ కృషితో మెరుగైన మంచి సంస్కరణలతో ఆదేశాలు న్యాయస్థానం నుండి విలువడతాయని వారు ఆశాబావం వ్యక్త పరిచారు.

# వైసీపీలో ఎన్నో విభాగాలు... వేలాదిగా పదవులు కానీ..!



వైసీపీ ఒక ప్రాంతీయ పార్టీ. ఇంకా గట్టిగా చెప్పాలంటే కేవలం ఏపీకి మాత్రమే పరిమితం అయిన పార్టీ. వైసీపీకి తెలంగాణాలో కూడా బలం ఉంది. వైసీపీ అధినేత జగన్ తెలంగాణాలో ఓదార్పు యాత్రలు నిర్వహిస్తే పెద్ద ఎత్తున జనాలు తరలివచ్చారు. ఆయనకు ఈ రోజునా అక్కడ మంచి క్రేజ్ ఉంది. 2014 ఎన్నికల్లో మూడు ఎమ్మెల్యే సీట్లు ఒక ఎంపీ సీటు వైసీపీ గెలుచుకుంది. ఆ తరువాత మాత్రం తెలంగాణలో పోటీ చేయలేదు, కేవలం ఏపీకే పరిమితం అయింది. ఇదిలా ఉంటే వైసీపీ ఏపీలో తన ప్రస్థానం లో రెండు సార్లు విపక్షంలో ఒకసారి అధికార పక్షంలో ఉంది. వైసీపీ అధికారంలో ఉన్నపుడు పంచాయతీ వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్ దాకా అంతా తానే అయింది. దాంతో అలా గ్రాస్ రూట్ లెవెల్ దాకా తన బలాన్ని పెంచుకుంది.

**ఓటమి తరువాత :**

ఏ పార్టీకి అయినా ఓటమి అతి పెద్ద దెబ్బగా చూస్తారు. వైసీపీ విషయం తీసుకుంటే 2024 ఎన్నికల్లో భారీ ఓటమి సంప్రాప్తించింది. అది కూడా అలా ఇలా కాదు, ఏకంగా 11 సీట్లకే పరిమితం అయింది. వైసీపీకి వచ్చిన నలభై శాతం ఓట్లకు 11 సీట్లకు ఎక్కడా సంబంధం అయితే లేదు. ఏపీ అసెంబ్లీలో విపక్ష హోదా కూడా వైసీపీకి దక్కలేదు. దాంతో వైసీపీకి ఇది భారీ షాక్ గానే అంతా భావిస్తున్నారు. వైసీపీ తిరిగి కోలుకునే తీరు ఎలా ఉంటుంది అన్నది కూడా అంతా గమనిస్తున్నారు.

**ప్రస్థానం మొత్తం :**

వైసీపీ పార్టీ పెట్టిన దగ్గర నుంచి చూస్తే ఎక్కువ కాలం విపక్షంలోనే గడిపింది. 2011లో వైసీపీని స్థాపించారు. అప్పట్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. విపక్షంలో తెలుగుదేశానికి పోటీగా మరో పార్టీగా వైసీపీ ఉంది. 2014లో వైసీపీ ఓడి మరో అయిదేళ్ళు విపక్ష స్థానంలో కొనసాగింది. ఇక 2019 నుంచి 2024 దాకా కేవలం అయిదేళ్ల పాటు మాత్రమే వైసీపీ అధికారంలో ఉంది. ఇప్పటికి చూసుకుంటే వైసీపీ పదిహేనేళ్ల రాజకీయ ప్రయాణంలో పదేళ్ళ పాటు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయినట్లుగా చూడాల్సి ఉంది.

**ఎన్నడూ లేని విధంగా :**

ఇదంతా ఎందుకు అంటే వైసీపీకి విపక్షం కొత్త కాదు, ఆ మాట సీఎం గా తాను ఓడాక వైఎస్ జగనే మీడియాకు రిలీజ్ చేసిన వీడియో బైట్ లో చెప్పారు. అయితే గతానికి భిన్నంగా వైసీపీ ఓటమి తరువాత పార్టీ పదవులు పెద్ద ఎత్తున పంపిణీ చేస్తున్నారు. ఇది ఒక రోజులో కాదు, ఒక్క సారిగా కాదు, అలా నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. వైసీపీలో ఇపుడు ఉన్నన్ని పదవులు గతంలో ఉన్నాయా అన్నది కూడా చర్చకు వస్తోంది. వైసీపీకి ఒక రాష్ట్ర స్థాయి కార్యవర్గం ఉంది. అందులో పెద్ద ఎత్తున చాలా మందికి చోటు కల్పించారు. అలాగే పొలిటికల్ అడ్వైజర్ కమిటీ అని మరో విభాగం ఉంది.

**కొత్త వ్యవస్థ ద్వారా :**

అందులో కూడా ఆ మధ్య పునర్ వ్యవస్థ కరీకరించి ఎక్కువ మందికి చోటు కల్పించారు. ఇవి కాకుండా రాష్ట్ర స్థాయిలో కో ఆర్డినేటర్లను కూడా పెద్ద ఎత్తున అధినాయకత్వం ఆ మధ్య నియమించింది. ఇక రీజనల్ కో ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ పరిశీలకు వీటికి అదనం అన్న మాట. ఇవి కాకుండా రాష్ట్ర స్థాయిలో అనుబంధ విభాగాలు అనేకం ఏర్పాటు చేశారు. వాటిలో ఒక్కో దానికి పెద్ద ఎత్తున పదవులు పందేరం చేశారు ఇపుడు ఆ అనుబంధ విభాగాలలో ఒక్కో దానికి ప్రాంతాల వారీగా వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమిస్తూ కొత్త వ్యవస్థను తీసుకుని వచ్చారు. అలా మహిళ, యువత, రైతు, విద్యార్థి ఇలా అనేకం కనిపిస్తాయి.

**ఫలితం ఏమిటి :**

ఇంత పెద్ద ఎత్తున కమిటీలను వేసి పదవులు ఇస్తున్నారు అనేక మందిని తెచ్చి వారిలో కొత్త ఉత్సాహం నింపడానికి పదవులు అందచేస్తున్నారు. అయితే ఈ పదవులు అందుకున్న వారు ఏ మేరకు పనిచేస్తున్నారు అన్నదే ఇపుడు చర్చగా ఉంది. పదవులు అన్నవి అలంకారం కాదు, పనిచేయడానికి బాధ్యతలు గుర్తెరిగి జనంలో ఉంటూ పార్టీని పటిష్టం చేయడానికి మరి అలా చూస్తే ఈ కమిటీలు ఇచ్చే రిజల్ట్ ఏమిటి అన్నదే చర్చగా ఉంది. అంతే కాదు పదవులు పంచుతున్న హై కమాండ్ వారితో ఏదో ఒక సందర్భంలో మీటింగులు పెట్టి వారికి ఒక యాక్షన్ ప్లాన్ ఇచ్చి జనంలోకి పంపిస్తోందా దిశా నిర్దేశం చేస్తోందా చేస్తే వాటి వల్ల వచ్చే ఫలితాలు ఏ మేరకు అన్నది కూడా చర్చకు వస్తోంది. ఏది ఏమైనా చాలా పార్టీలకు లేని విధంగా వైసీపీలో దాదాపుగా అందరికీ పదవులు ఉన్నాయి అన్నది వాస్తవం.

## ఊరుకునే ప్రసక్తే లేదు...

# స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన పవన్




ఇక రాజీ పడేది లేదు, చూస్తూ ఊరుకునేది అంతకంటే లేదు, అన్నీ పక్కాగా ఉంటాయి, ఎవరైనా ఎంతటి వారు అయినా అసలు ఉపేక్షించే ప్రశ్నే లేదని అటవీ శాఖ మంత్రి హోదాలో పవన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే అసలు సహించేది లేదని ఆయన స్పష్టంగా చెప్పారు. అటవీ భూములను ఆక్రమించుకోవాలని చూస్తే కనుక సీరియస్ గానే వ్యవహరిస్తామని ఆయన అంటున్నారు.

**ఆదాయ శాఖగా :**

అటవీ శాఖను ఆదాయ శాఖగా మార్చాలని ఆయన అధికారులకు సూచించారు. జాతీయ సంపద అంతా అడవులలోనే ఉందని అన్నారు. అడవులను కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఏంతైనా ఉందని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని ఆయన చెప్పారు. కృష్ణా జిల్లా కొండపావులూరులోని జరిగిన రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల వర్క్ షాపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల పరిరక్షణకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ రోజు కాదు రేపటి తరం గురించి దృష్టిలో ఉంచుకుని కార్యాచరణను సిద్ధం చేయాలని అన్నారు.

**రాజకీయాలు లేవంటే :**

అటవీ భూములను కాపాడే విషయంలో రాజకీయాలకు అసలు తావు లేదని ఆయన అన్నారు. అదే సమయంలో రాజీ పడేది ఉండదని అన్నారు. అడవుల పరిరక్షణ కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని దానిని అధికారులు గుర్తు పెట్టుకోవాలని ఆయన కోరారు. అడవులు అంటే కబ్జాలు అన్న మాట వినిపించరాదని అన్నారు. ప్రతీ అంగుళమూ అమూల్యం అని చెప్పిన పవన్ అటవీ భూములను కాపాడే విషయంలో అధికారులు పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగాలని కోరారు.

**మంత్రే ఆక్రమించారు :**

ఈ సందర్భంగా ఆయన వైసీపీ ప్రభుత్వం గురించి విమర్శలు చేశారు. గత వైసీపీ హయాంలో అటవీ శాఖ మంత్రిగా ఉన్న ఒకాయన ఏకంగా తన సొంత ఇలాకాలోనే అటవీ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకున్నారని పవన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరి ఆనాడు అధికారులు ఏమి చేస్తున్నారు అని ఆయన ప్రశ్నించారు. అలాగే ఆనాటి ప్రభుత్వ పెద్దలు ఎందుకు స్పందించలేదో అర్థం కాదని అన్నారు. ఆ తరహా దారుణాలు పొరపాట్లు కూటమి ప్రభుత్వంలో అయితే అసలు జరగడానికి వీలు లేదని ఆయన స్పష్టం చేసారు. ఒక్క అంగుళం స్థలం కబ్జా అయినా అధికారులదే బాధ్యత అన్నారు వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఈ విషయంలో తాను ఎక్కడా రాజీ పడను అన్నారు. అటవీ సిబ్బంది కొరత విషయాన్ని తాను గమనంలోకి తీసుకున్నాను అని పవన్ చెబుతూ తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## మాటలకందని విషాదానికి

# సాక్ష్యాలు ఆ బస్సులోని ఈ దృశ్యాలు!



ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి శరీరాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. స్లీపర్ బెర్తుల మధ్య మాంసపు ముద్దలు మిగిలాయి. కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఎన్నో హృదయ విదారక దృశ్యాలు వెలుగు చూస్తున్నాయి! ఈ ఘోరానికి కారణం ఏదైనా, కారకులెవరైనా.. అమాయక ప్రజల ప్రాణాలు పొగలో కలిసిపోయాయి.. శరీరాలు బూడిదైపో యాయి.. కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి శరీరాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. స్లీపర్ బెర్తుల మధ్య మాంసపు ముద్దలు మిగిలాయి. అవును... బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి శరీరాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. గాఢనిద్రలో ఉండగా మంటలు చుట్టుముట్టడంతో తప్పిం చుకునేందుకు ప్రయత్నించినా.. క్షణాల్లో చుట్టుముట్టిన అగ్నికీలలు, ఊపిరి సలపనివ్వని పొగ కారణంగా ఎక్కడివాళ్ల అక్కడే కాలిపోయారు. బెర్తుల మధ్య చిక్కుకున్న మృతదేహాలను లాగితే కనిపిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి.

**కిటికీ నుంచి సగం బయటకు వచ్చి..!:**

ఈ ఘోర అగ్నిప్రమాదం అనంతరం బెర్తుల మధ్య చిక్కుకున్న మృతదేహాలను బయటకు లాగుతుంటే.. ఆ మృతదేహాల శరీర భాగాలు ఎక్కడికక్కడ విడిపోతున్న దృశ్యాలు హృదయవి దారకంగా ఉన్నాయి. ఈ క్రమంలో బస్సు కిటికీ నుంచి సగభాగం బయటకు వచ్చిన స్థితిలో ఓ మృతదేహం కనిపించింది. కిటికీ నుంచి దూకే ప్రయత్నంలో సగం శరీరం బయటకు వచ్చిన తరువాత స్పృహ కోల్పోవడంతో అక్కడే కాలిపోయినట్లు తెలుస్తోంది!

**కుమార్తెను గుండెకు హత్తుకొని..!:**

ఈ ఘటనలో.. మంటల్లో చిక్కుకున్న సమయంలో అనూష అనే తల్లి తన కుమార్తె మన్విత‌ను ఎలాగైనా కాపాడాలని గుండెకు హత్తుకుని గట్టిగా పట్టుకున్నారు. ఈ క్రమంలో.. అప్పర్ బెర్త్ నుంచి కిందకి దిగేసరికే మంటలు తీవ్రరూపం దాల్చాయి. దీంతో అనూష, తన చేతిలోని కుమార్తెతో సహా కాలిపోయి మాంసపు ముద్దలా మారారు. బిడ్డను కౌగిలించుకుని అలాగే కాలిపోయిన ఆ దృశ్యం కంటతడి పెట్టించింది!

**పోలీసులు వచ్చే లోపే...!:**

కర్నూలులో జరిగిన బస్సు ప్రమాద సమాచారం పోలీసులకు శుక్రవారం తెల్లవారుజామున 3:20 గంటలకు తెలిసింది. దీంతో.. వారు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి, ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే... ప్రమాదం జరిగిన ప్రదేశం కర్నూలుకు 18 కి.మీ దూరంలో ఉండటంతో వారు వెళ్లేసరికే బస్సు చాలావరకు కాలిపోయింది.

**మాంసపు ముద్దలు, బూడిద కుప్పలు..!:**

బస్సు ప్రమాదంలో మరణించినవారి మృతదేహాలు మాంసపు ముద్దలుగా, బూడిద కుప్పల్లా మారిపోయాయి. మృతదేహాన్ని చూసి ఎవరూ గుర్తించలేని పరిస్థితి నెలకొంది. దీంతో.. ఏ మృతదేహం ఎవరిదో నిర్ధారించేందుకు డీఎన్ఏ పరీక్షలే కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలో... కర్నూలు మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డా.సాయిసుధీర్, డా.బ్రహ్మాజీ, డా.నాగార్జున ఆధ్వర్యంలో ఆరుగురు ఫోరెన్సిక్ వైద్యులు, 10 మంది పీజీలు కలిసి డీఎన్ఏ పరీక్షల నిమిత్తం నమూనాలు సేకరించారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి

# క్షమాపణలు చెప్పిన మంత్రి కొండ సురేఖ



గత వారం మంత్రి కొండా సురేఖ నివాసంలో జరిగిన ఒక సంఘటన రాజకీయంగా పెద్ద దుమారాన్ని సృష్టించింది. తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన కుమార్తె సుష్మిత చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పి, రాష్ట్ర రాజకీయాల్లో ఇటీవల చెలరేగిన దుమారానికి తెరదించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ "కుటుంబంలో చిన్నచిన్న అపోహల వల్ల వాదనలు జరిగినట్లే, మన పార్టీలో కూడా కొన్ని అపోహల కారణంగా వివాదం జరిగింది. కానీ మనమంతా ఒక కుటుంబంలా కలిసి ముందుకు సాగాలి" అని స్పష్టం చేశారు. అసలేం జరిగింది? గత వారం మంత్రి కొండా సురేఖ నివాసంలో జరిగిన ఒక సంఘటన రాజకీయంగా పెద్ద దుమారాన్ని సృష్టించింది. ఆరోపణల నేపథ్యంలో మంత్రి ప్రత్యేక అధికారి ఎన్. సుమంత్‌పై విచారణ కోసం పోలీసులు అక్టోబర్ 15 రాత్రి ఆమె ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా సురేఖ కుమార్తె సుష్మిత పోలీసులను ఇంట్లోకి అనుమతించకుండా వారిని అడ్డుకుంది. ఆ సమయంలో సుష్మిత, సుమంత్‌పై కేసు పెట్టడం వెనుక రాజకీయ కుట్ర ఉందని, తన తల్లిదండ్రులను వెను కబడిన వర్గానికి చెందినవారని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన సలహాదారు వేం. నరేందర్‌రెడ్డి, ఆదాయ శాఖ మంత్రి పి.శ్రీనివాస్‌రెడ్డిపై కూడా ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అంతర్గత వర్గాల్లో ఉద్రిక్తతలను పెంచాయి. క్షమాపణతో ఉపశమనం ఈ వ్యవహారంపై ఏఐసిసి కూడా తీవ్రంగా స్పందించి నివేదిక కోరడంతో, పార్టీలో అంతర్గత ఒత్తిడి పెరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లూ భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా జోక్యం చేసుకుని సురేఖ, ఆమె భర్త కొండా మురళితో కలిసి ముఖ్యమంత్రిని కలిసేలా చేశారు. తాను ముఖ్యమంత్రితో మాట్లాడి అన్ని అపోహలను తొలగించుకున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. పోలీసుల రాకపై కోపంతోనే తన కుమార్తె ముఖ్యమంత్రి గురించి కొన్ని మాటలు మాట్లాడిందని, దాని పట్ల తానే ముఖ్యమంత్రికి క్షమాపణలు చెప్పానని వివరించారు. "ఇకపై అందరం కలిసి పనిచేస్తాం" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. "మనమంతా కాంగ్రెస్ కుటుంబంలో భాగం. చిన్న అపోహల వల్ల వచ్చిన విభేదాలను పక్కన పెట్టి ప్రజల కోసం కలిసి పనిచేస్తాం" అని స్పష్టం చేశారు. ఈ రాజీ ప్రయత్నంతో ముఖ్యమంత్రి, మంత్రి కొండా సురేఖ వర్గాల మధ్య ఉన్న ఉద్రిక్తత తాత్కాలికంగా తగ్గినట్లుగా తెలుస్తోంది. ఈ పరిణామం తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో ముఖ్యమైన పరిణామంగా నిలిచింది.

# జీవితా బీమా.. అదానీకి ధీమా!

న్యూఢిల్లీ

ఆప్త మిత్రుడు అదానీని, అప్పుల్లో ఉన్న ఆయన కంపెనీలను ఆర్థికంగా కాపాడేందుకు సామాన్యుల సొమ్మును రిస్క్‌లో పెట్టడానికి మోదీ ప్రభుత్వం సిద్ధపడిందా? అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న అదానీ కంపెనీలకు రుణాలు ఇచ్చేందుకు విదేశీ బ్యాంకులు ముందుకు రాకపోవడంతో.. ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీని బలి పెట్టాలనుకొన్నదా? ఇందుకుగానూ చెమటోడ్చి సామాన్యులు దాచుకొన్న డబ్బులను దుర్వినియోగం చేయాలనుకొన్నదా? అదానీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని ఎల్ఐసీపై ఆర్థిక శాఖ అధికారులు ఒత్తిళ్లు తీసుకొచ్చినట్టు అమెరికాకు చెందిన ప్రఖ్యాత దినపత్రిక 'ది వాషింగ్టన్ పోస్ట్' తాజా కథనంలో వెల్లడించడం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నది.అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలంటూ కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన కొందరు ఉన్నతాధికారులు ఎల్ఐసీపై ఒత్తిళ్లు తీసుకొచ్చినట్టు 'ది వాషింగ్టన్ పోస్ట్' పత్రిక పేర్కొంది.

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్, సోలార్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టు కాంట్రాక్టులకు సంబంధించి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులు రిస్క్‌తో కూడుకొన్నవే. ఈ విషయం తెలిసినప్పటికీ కేంద్ర ప్రభుత్వ అధికారులు పెట్టుబడులపై ముందుకే వెళ్లినట్టు పత్రిక తెలిపింది. ఈ క్రమంలోనే ఎల్ఐసీ నుంచి దాదాపు 390 కోట్ల డాలర్ల (రూ.34,251 కోట్ల) నిధులను అదానీ గ్రూప్‌లో పెట్టుబడులుగా పెట్టాలన్న ప్రతిపాదనలకు గత మేలో కేంద్ర ఆర్థిక శాఖ హడావుడిగా ఆమోదం తెలిపినట్టు పత్రిక వెల్లడించింది. అదానీ కంపెనీ కొన్ని రుణాలను డాలర్ల రూపంలో చెల్లించాల్సి రావడంతోనే ఈ ప్రతిపాదన తెర మీదకు వచ్చినట్టు వాషింగ్టన్ పోస్ట్ జర్నలిస్టులు ప్రాంశు వర్మ, రవి నాయర్ తమ కథనంలో తెలిపారు. అదానీ గ్రూప్ కంపెనీలలో ఈక్విటీని పెంచడానికి ఎల్ఐసీ నిధులను ఉపయోగించాలని కూడా అధికారులు సిఫార్సు చేసినట్లు పత్రిక ఈ సందర్భంగా తెలిపింది.

**ఇక్కడ కథ మొదలైంది**

భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులు చేపట్టడానికి 2021లో అదానీ గ్రూప్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఎలాంటి పోటీ లేకుండా కాంట్రాక్ట్ టెండర్లు దక్కించుకోవడానికి ఏపీ, ఒడిశా, తమిళనాడు, జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు అదానీ గ్రూప్ ప్రతినిధులు రూ.2,238 కోట్ల మేర లంచాలు ఆఫర్ చేశారు. ఈ మేరకు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) తన ఆరోపణల్లో వెల్లడించింది. తద్వారా వచ్చే 20 ఏండ్లలో కనిష్ఠంగా 2 బిలియన్ డాలర్లను లబ్ధి పొందేందుకు అదానీ గ్రూప్ ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఆరోపించింది. ఈ లంచం సొమ్మును సేకరించడానికి అమెరికాలోని బ్యాంకులు, పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చి మోసపుచ్చే ప్రయత్నాలు చేసినట్టు తెలిపింది. ఈ కేసులో నిందితులు ఎఫ్‌బీఐతోపాటు తమ దర్యాప్తును అడ్డుకోవడానికి కూడా కుట్ర పన్నినట్టు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) ఆరోపించింది. ఈ కేసు ఇంకా కొనసాగుతున్నది. దీంతో అదానీ గ్రూప్ కంపెనీలకు రుణాలు ఇచ్చేందుకు విదేశీ బ్యాంకులు ఏవీ ముందుకు రాలేదు. అప్పుల భారం పెరిగిపోయింది. ఈ క్రమంలోనే అదానీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని ఎల్ఐసీపై ఆర్థిక శాఖ వర్గాలు ఒత్తిళ్లు తెచ్చినట్టు 'వాషింగ్టన్ పోస్ట్' కథనాన్ని బట్టి అర్థమవుతున్నది.

**ఎన్‌సీడీ జారీ అందుకేనా?**

అదానీ గ్రూప్ బకాయిపడ్డ రుణాలను డాలర్ల రూపంలో చెల్లించాల్సిన అవసరం ఏర్పడిందని, ఈ క్రమంలోనే ఎల్ఐసీపై ఒత్తిళ్లు వచ్చాయని 'వాషింగ్టన్ పోస్ట్' తన కథనంలో వెల్లడించింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది మే నెలలో గౌతమ్ అదానీకి చెందిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీసెజ్) రూ. 5 వేల కోట్లకుపైగా విలువైన నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లను (ఎన్‌సీడీ) జారీ చేసింది. వాటిని ఎల్ఐసీ పూర్తిగా సబ్‌స్క్రైబ్ చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. ఈ మొత్తాన్ని ఎల్ఐసీ డాలర్ల రూపంలో చెల్లించినట్టు సమాచారం. అంటే, ఎన్‌సీడీ ద్వారా సమకూరిన ఎల్ఐసీ డబ్బును.. అదానీ కంపెనీ డాలర్ల రూపంలో రుణాల కోసం మళ్లించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మే 30న అదానీ కంపెనీ ఎన్‌సీడీని జారీ చేయడం, వాటిని పూర్తిగా ఎల్ఐసీ సబ్‌స్క్రైబ్ చేయడం కేంద్రం ఒత్తిళ్లలో భాగమేనా? అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా మోదీ ప్రభుత్వ చర్యలతో ఎల్ఐసీలో సామాన్యులు దాచుకొన్న సొమ్ము రిస్క్‌లో పడినట్టేనని ఆర్థిక రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుల సొమ్ముతో మోదీ ప్రభుత్వం ఒక రకంగా జూదమే ఆడిందని మండిపడుతున్నారు.

**ఏ ఆధారాలతో పత్రిక ఇలా రాసింది?**

ఎల్ఐసీ, కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్‌కు నోడల్ డిపార్ట్‌మెంట్‌గా వ్యవహరించే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డీఎఫ్ఎస్) నుంచి పొందిన కొన్ని విలువైన పత్రాల ఆధారంగా వాషింగ్టన్ పోస్ట్ ఈ పరిశోధన సాగించింది. ఈ ఏజెన్సీలకు చెందిన మాజీ అధికారులు, ప్రస్తుత ఉన్నతాధికారులు, అదానీ గ్రూప్ ఆర్థిక వ్యవహారాలు పర్యవేక్షించే మూడు బ్యాంకులకు చెందిన అధికారులను ఇంటర్వ్యూ చేసి వాషింగ్టన్ పోస్ట్ ఈ కథనాన్ని ప్రచురించింది.

**ఒత్తిళ్లు లేవు: ఎల్ఐసీ**

అదానీ గ్రూప్‌లో పెట్టుబడులపై తమది స్వతంత్ర నిర్ణయమని, ఇందులో ఎవరి ఒత్తిళ్లూ లేవని ఎల్ఐసీ స్పష్టం చేసింది. 'వాషింగ్టన్ పోస్ట్' ఆరోపణలు నిరాధారమని, పెట్టుబడులపై తమదే తుది నిర్ణయమని పేర్కొంది. ఇందులో కేంద్ర ఆర్థిక శాఖగానీ ఇతరుల ప్రమేయంగానీ ఏమీ లేవని వెల్లడించింది. 'వాషింగ్టన్ పోస్ట్' ఆరోపణలు అవాస్తవమని అదానీ గ్రూప్ కూడా ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా, 30 కోట్ల మంది ఎల్ఐసీ పాలసీదారుల సేవింగ్స్‌ను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విపక్ష కాంగ్రెస్ మండిపడింది. ఈ ఉదంతంపై పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేసింది. అయితే, ఈ ఉదంతంపై కేంద్రం ఇంకా స్పందించాల్సి ఉన్నది.

# 12 వేల ప్రత్యేక రైళ్లు ఎక్కడ?

**న్యూఢిల్లీ:** పండుగల సీజన్‌లో రైళ్ల ఏర్పాట్లపై కేంద్రాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఘాటుగా విమర్శించారు. ముఖ్యంగా ఛఠ్ పండుగ కోసం బిహార్‌కు వెళ్లే వలస కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. కొన్ని రైళ్లు సామర్థ్యానికి మించి 200 శాతం కెపాసిటీతో నడుస్తున్నాయని, కేంద్రంలోనూ, బిహార్‌లోనూ అధికారంలో ఉన్న 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం పనితీరు ఇదేనా అని నిలదీశారు. పండుగ సీజన్‌లో 12,000 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని ఇచ్చిన వాగ్దానం ఏమైందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వీడియోను కూడా పోస్ట్ చేశారు.

'బిహార్‌కు వెళ్లే రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. టిక్కెట్లు దొరకడం అసాధ్యంగా మారింది. ప్రయాణం అత్యంత అమానవీయంగా మారింది. పండుగ సీజన్‌లో అమానవీయంగా ప్రయాణికుల ను తీసుకు వెళ్తున్నారు. చాలా రైళ్లు 200 శాతం సామర్థ్యంతో నడుపుతున్నారు. జనం డోర్లు పట్టుకుని వేలాడుతున్నారు, చివరకు రూఫ్‌టాప్‌పై కూడా ప్రయాణిస్తున్నారు. ఎన్డీయే వంచన రాజకీయాలు, ఉద్దేశాలకు ఇది సజీవ నిదర్శనం" అని రాహుల్ ఆ ట్వీట్‌లో విమర్శించారు. కేంద్రంలో, బిహార్‌లో అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ గవర్నమెంట్ పనితీరుపై విమర్శలు గుప్పించారు. 'మీరు చెప్పిన 12,000 ప్రత్యేక రైళు ఎక్కడ? ప్రతి ఏడాది పరిస్థితులు ఎందుకు విషమిస్తున్నాయి? రాష్ట్రంలో (బిహార్) ఉద్యోగాలు, గౌరవప్రదమైన జీవనం ఉండే వాళ్లు ఉపాధి కోసం వేల కిలోమీటర్లు ఎందుకు వెళ్తారు? ఇది ప్రయాణికుల నిస్సహాయతకు మాత్రమే కాదు.. ఎన్డీయే వంచన రాజకీయాలకు ప్రత్యక్ష నిదర్శనం' అని రాహుల్ తప్పుపట్టారు.





**12,011 ప్రత్యేక రైళ్లు**

పండుగల సీజన్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అక్టోబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 30 వరకూ 12,011 ప్రత్యేక రైళ్ల ట్రిప్‌లు నడపనున్నట్టు రైల్వే మంత్రిత్వ శాఖ గత బుధవారంనాడు ప్రకటించింది. ప్రతి రోజూ సుమారు 196 ప్రత్యేక రైళ్లు దేశవ్యాప్తంగా నడుస్తాయని తెలిపింది. అధికారుల సమాచారం ప్రకారం, అక్టోబర్ 18న గరిష్టంగా 280 రైళ్లను నడపగా, అక్టోబర్ 8న కనిష్టంగా 166 రైళ్లు నడిపారు.

# బీఎంసీ ఎన్నికలపై బీజేపీ కసరత్తు

**ముంబై:** త్వరలో జరుగనున్న ప్రతిష్టాత్మక బ్రిహాన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ కసరత్తు ప్రారంభించింది. మహాయుతి కూటమిలో భాగంగా 140 నుంచి 150 సీట్లలో పోటీ చేయాలని కమలనాథుల ఆలోచనగా ఉంది. బీజేపీ భాగస్వామ్య పార్టీ అయిన ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన 70 నుంచి 80 సీట్లలో పోటీ చేసే అవకాశాలున్నాయి. శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్‌సీపీ (శరద్ పవార్)తో కూడిన 'మహా వికాస్ అఘాడి'లో అంతర్గత విభేదాలున్నాయని, దీనిని అవకాశంగా మలుచుకుని ఎంవీఏకు సంప్రదాయంగా పట్టున్న ప్రాంతాల్లో పాగా వేయాలని బీజేపీ ఆలోచనగా ఉంది. ఇందుకు అనుగుణంగా బూత్ మేనేజిమెంట్, ఓటర్లను నేరుగా కలుసుకోవడం, స్థానిక సమస్యలపై ముంబై బీజేపీ యూనిట్ దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య నేతలు ఐకమత్యంగా ఉండాలని, ఎలాంటి ప్రకటనలు చేయకుండా సంయమనం పాటించాలని, అంతర్గత విభేదాలకు తావీయరాదని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మహాయుతి కూటమి నేతలకు విజ్ఞప్తి చేశారు. బీఎంసీ ఎన్నికలు ఇటు మహాయుతి కూటమితో పాటు ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని మహా వికాస్ అఘాడికి కూడా కీలకమే. ముంబై మున్సిపల్ పవర్ డైనమిక్స్ ప్రభావం 2029లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపైన కూడా ఉంటుందని పరిశీలకుల అభిప్రాయంగా ఉంది. బీఎంసీ ఎన్నికల్లో ఠాక్రే సోదరులు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే పొత్తు పెట్టుకుంటారనే బలమైన అంచనాలు ఉన్నాయి. ఇదే సమయంలో బీజేపీ సైతం ఒంటరిగా పోటీకి వెళ్లాలని అనుకోవడం లేదు. హిందుత్వ ఓట్లు, ప్రభుత్వ అనుకూల ఓట్లు చీలకుండా మహాయుతి భాగస్వామ్య పార్టీలతోనే కలిసి వెళ్లాలని భావిస్తోంది. వేర్వేరుగా పోటీ చేస్తే ఎంవీఏకు, ముఖ్యంగా మరాఠీల ప్రభావం ఎక్కువగా కనిపించే రాజ్ థాకరే ఎంఎన్ఎస్‌కు లబ్ధి చేకూరే అవకాశం ఉందని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. మరాఠీల ఓట్లు, మైనారిటీ కమ్యూనిటీ ఓట్లను ఠాక్రే కూటమి ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని, బీజేపీ ప్రధాన ఓటు బ్యాంకుగా అగ్రవర్ణాల వాణిజ్య వర్గాలు, నార్త్ ఇండియన్లు, గుజరాజతీలు ఉన్నారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐక్యత, సమన్వయంతో బీఎంసీ ఎన్నికల్లో మహాయుతి సత్తా చాటాలని బీజేపీ వ్యూహరచనగా ఉంది.



## భూగర్భంలో రయ్ రయ్..

ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న దుబాయ్ ప్రజలకు అక్కడి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. భూగర్భంలో అండర్‌గ్రౌండ్ లూప్ ట్రాన్సిట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడానికి ఆమోదముద్ర వేసింది. పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన బోరింగ్ కంపెనీ అమెరికా బయట చేపడుతున్న మొదటి ప్రాజెక్టు ఇదే. వచ్చే ఏడాది తొలిదశ పనులు పూర్తవనున్నట్టు కంపెనీ ప్రతినిధులు చెప్పారు.

**ఎందుకు ఈ ప్రాజెక్టు?**

దుబాయ్ వంటి దేశాల్లో ఇసుక తుఫాన్లు ఎక్కువ. విపరీతమైన వేడి, ఉక్కబోత.. బస్సులు, రైలు ప్రయాణాలను మరింత కఠినతరం చేస్తున్నాయి. పైగా పెరిగిన జనాభాతో ట్రాఫిక్ సమస్యలు దీనికి అదనం. దీంతో భూగర్భంలో అండర్‌గ్రౌండ్ లూప్ ట్రాన్సిట్ సిస్టమ్‌ను తీసుకురావాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఎలక్ట్రిక్ వాహనాలు గంటలో 20 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనున్నాయి. ప్రాజెక్టు మొత్తంగా పూర్తయితే గంటకు లక్ష మంది ప్రయాణించే వెసులుబాటు కలగనున్నట్టు అధికారులు తెలిపారు.

లాభాలేమిటంటే?

ఎలక్ట్రిక్ ఆధారితంగా నడిచే ప్రాజెక్టు కావడంతో ఇది పర్యావరణానికి హితకారిణిగా ఉండనున్నది. కాలుష్యం సమస్య ఉండదు. ట్రాఫిక్ లేకపోవడంతో ప్రయాణ సమయం 60 నిమిషాల నుంచి 3–4 నిమిషాలకు తగ్గనున్నది. చెమట, ఉక్కబోత, ఇసుక తుఫానుల సమస్య ఉండదు. లూప్‌లో 11 స్టేషన్లు అందుబాటులో ఉండటంతో నచ్చిన స్టేషన్‌లో ప్రయాణికులు దిగొచ్చు. తద్వారా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

## అభివృద్ధి కావాలా? ఆటవిక పాలనా?

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఖగడియా జిల్లాలో అధికార, ప్రతిపక్ష నేతలు నేడు పోటాపోటీ ప్రచార సభలు నిర్వహించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ'ను వ్యతిరేకించిందంటూ 'ఇండియా' కూటమిపై కేంద్రమంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తించి, వారి స్వదేశానికి తరలిస్తామన్నారు. బిహార్‌లో జంగల్‌రాజ్ (ఆటవిక పాలన) తిరిగి వస్తుందా? లేదా రాష్ట్రం అభివృద్ధి మార్గంలో కొనసాగుతుందా? అనేది ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు.

**పార్టీలకు వలస కార్మికుల గుబులు**

"చొరబాటుదారులను కాపాడేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్ని యాత్రలైనా నిర్వహించనివ్వండి. ఏం చేసినా.. వారిని ఆయన రక్షించలేరు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తిస్తాం. ఓటరు జాబితా నుంచి పేరును తొలగిస్తాం. వారి స్వదేశానికి పంపిస్తాం" అని అమిత్ షా స్పష్టం చేశారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కేవలం తన కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఆర్జేడీ పాలనలో హత్యలు, దోపిడీలు తదితర అనేక నేరాలు యథేచ్ఛగా జరిగాయని, కానీ.. ఎన్డీయే హయాంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. జంగల్‌రాజ్ తిరిగి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదన్నారు. కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకే ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, బిహార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు 20 రోజుల్లోపు చట్టం తీసుకొస్తామన్నారు. 20 నెలల్లో నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖగడియాలోని గోగ్రీలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. బిహార్‌ను నంబర్ వన్‌గా మార్చేందుకు.. పెట్టుబడులు తీసుకురావడం, విద్యను ప్రోత్సహించడం, వైద్య సౌకర్యాలను మెరుగుపర్చడం అవసరమని పేర్కొన్నారు.

## ఆ పదం పాక్‌కు ఎప్పటికీ వింతే

ప్రజాస్వామ్యం అనే పదం పాకిస్థాన్‌కు ఎప్పటికీ వింతేనని భారత్ దుయ్యబట్టింది. ఆ దేశం చట్టవిరుద్ధంగా ఆక్రమించిన ప్రాంతాల్లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై ఆందోళన వ్యక్తంచేసింది. వీటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేసింది.

ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆ దేశ సైన్యం ఆక్రమణ, అణచివేత, వనరులను చట్టవిరుద్ధంగా వినియోగించడం వంటి వాటిపై అక్కడి ప్రజలు తిరుగుబాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనలను అంతం చేయాలని డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగంగా ఉందని, ఎప్పటికీ ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. ఆ ప్రాంత ప్రజలు భారత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వారి ప్రాథమిక హక్కులను వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇది పాక్‌కు ఎప్పటికీ మింగుడుపడని విషయమని ఎద్దేవా చేశారు. ఇక, భారత్ వసుదైవ కుటుంబకం అని అన్నారు. ప్రపంచం మొత్తాన్ని ఒకే కుటుంబంగా చూడటం, అందరికీ న్యాయం, గౌరవం కోసం తన గొంతుకను వినిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా రెండో ప్రపంచయుద్ధం తర్వాత అంతర్జాతీయ శాంతి, భద్రతకు ఆశాకిరణంగా యూఎన్ స్థాపించిన విషయాన్ని గుర్తుచేశారు. వలస రాజ్యాల నిర్మూలనకు సంస్థ ఎంతో కృషి చేసిందన్నారు.

## 'మహిళ వేషంలో బిన్ లాడెన్'

## మాజీ సీఐఏ అధికారి వెల్లడి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ఉ?గ్రవాది ఒసామా బిన్ లాడెన్‌కు సంబంధించిన ఒక వార్త ఇప్పుడు సంచలంగా మారింది. 2001, సెప్టెంబర్ 11 ఉగ్ర దాడులతో అమెరికాకు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా మారిన అల్ ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్.. మహిళ వేషంలో టోరా బోరా కొండల నుండి తప్పించుకున్నాడని కేంద్ర నిఘా సంస్థ(సీఐఏ) మాజీ అధికారి జాన్ కిరియాకౌ తాజాగా వెల్లడించారు. 2001లో టోరా బోరా కొండలలో అమెరికా దళాలు ఒసామా బిన్ లాడెన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించినప్పుడు, అతడు మహిళా వేషం ధరించి అక్కడి నుంచి తప్పించుకున్నాడని తెలిపారు. జాన్ కిరియాకౌ ఏఎన్ఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అమెరికా సైన్యంలో రహస్యంగా చొరబడిన అల్ ఖైదా కార్యకర్త సహాయంతో ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్.. మహిళ వేషం వేసుకుని, టోరా బోరా నుంచి తప్పించుకున్నాడని తెలిపారు. సీఐఏలో 15 ఏళ్లు పనిచేసి, పాకిస్తాన్‌లో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల కు నాయకత్వం వహించిన కిరియాకౌ, అమెరికాలో సైనిక శ్రేణుల్లో అల్ ఖైదా కార్యకర్తల చొరబాట్లను తెలియజేశారు. 9/11 దాడుల అనంతరం అమెరికా సంయమనంగా వ్యవహరించింది, ఆఫ్ఘనిస్తాన్‌లో బాంబు దాడులను చేపట్టేందుకు నెల్లాళ్లు వేచివుందన్నారు. ఈ తరుణంలోనే అల్ ఖైదా చొరబాటుదారునిగా తేలిన అనువాదకుడు ఉగ్రవాది బిన్ లాడెన్ తప్పించుకునేందుకు అవకాశం కల్పించాడని తెలిపారు. లాడెన్ తప్పించుకున్న ఘటన దరిమిలా యూఎస్ ఉగ్రవాద నిరోధక దృష్టి పాకిస్తాన్ వైపు మళ్లిందని జాన్ కిరియాకౌ తెలిపారు. ఈ నేపథ్యంలో అప్పటి పాకిస్తాన్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌తో చర్చలు జరిగాయని, అతను అమెరికా నుంచి ఆర్థిక, సైనిక సహాయానికి బదులుగా దేశంలోకి యూఎస్ కార్యకలాపాలను అనుమతించాడని పేర్కొన్నారు. అదే సమయంలో సీఐఏ పాకిస్తాన్ గ్రూప్ లష్కరే తోయిబా, అల్–ఖైదా మధ్య గల సంబంధాలను గుర్తించిందన్నాను. ఇది అమెరికా నిఘా వ్యవహారాల్లో మైలురాయిగా నిలిచిందన్నారు. భారత్–పాక్‌ల గురించి మాట్లాడిన జాన్ కిరియాకౌ 2002లో భారతదేశం– పాకిస్తాన్ మధ్య యుద్ధం వస్తుందని అమెరికా నిఘా సంస్థలు భయపడ్డాయని, పార్లమెంట్ దాడి, ఆపరేషన్ పరాక్రమ్ సమయంలో పెరిగిన ఉద్రిక్తతలే దీనికి కారణమన్నారు. నాడు అమెరికా ఈ ముప్పును తీవ్రంగా పరిగణించిందని, అందుకే ఇస్లామాబాద్ నుండి అమెరికన్ కుటుంబాలను ఖాళీ చేయించామని అన్నారు. ఆ సమయంలో వాషింగ్టన్ దృష్టి అల్ ఖైదా, ఆఫ్ఘనిస్తాన్‌పైననే ఉందని, అందుకే భారతదేశ ఆందోళనలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదని ఆయన వివరించారు. 2008 ముంబై దాడుల గురించి కిరియాకౌ మాట్లాడుతూ ఈ దాడుల వెనుక పాకిస్తాన్ మద్దతు కలిగిన కశ్మీరీ ఉగ్రవాద గ్రూపుల హస్తం ఉందని అమెరికా నిఘా సంస్థలు భావించాయ న్నారు. పాకిస్తాన్.. భారతదేశంలో ఉగ్రవాదాన్ని వ్యాపింపజేస్తోందని ఆయన అన్నారు. పార్లమెంట్, ముంబై దాడుల తర్వాత భారత్ సంయమనం పాటించిందని, అయితే ఇప్పుడు భారత్ వ్యూహాత్మక సహనాన్ని కలిగి ఉండలేని స్థితిలో ఉందని ఆయన అన్నారు. ఎప్పుడు యుద్ధం వచ్చినా, భారత్ చేతిలో పాకిస్తాన్ ఓడిపోతుందని ఆయన కిరియాకౌ హెచ్చరించారు. నిరంతరం భారతీయులను రెచ్చగొట్టడంలో అర్థం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

బిజినెస్ వాయిస్

# రైల్వే బోర్డు కీలక నిర్ణయం: తక్షణమే అమల్లోకి..

దేశంలో పెరుగుతున్న మధుమేహ రోగుల సంఖ్యకు దృష్టిలో ఉంచుకుని.. రైల్వే బోర్డు ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి ప్రీమియం రైళ్లకు టిక్కెట్లు బుక్ చేసుకునేటప్పుడు, మీకు డయాబెటిక్ ఆహారం అవసరమని ముందుగానే సూచించవచ్చు. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని రైల్వే బోర్డు వెల్లడించింది. రైల్వే బోర్డు సీనియర్ అధికారి దీని గురించి మాట్లాడుతూ, అన్ని ప్రీపెయిడ్ రైళ్లు ఇప్పుడు ఐదు రకాల ఆహార ఎంపికలను అందిస్తాయని తెలిపారు. అవి శాఖాహారం, మాంసాహారం, జైన్ భోజనం, డయాబెటిక్ శాఖాహారం, డయాబెటిక్ మాంసాహారం. దీని అర్థం డయాబెటిస్ ఉన్నవారికి శాఖాహారం %ఒ% మాంసాహారం రెండూ ఉంటాయి. భారతదేశంలో.. ప్రతి సంవత్సరం సగటున 1.6 మిలియన్ల మంది డయాబెటిస్ కారణంగా మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. రాజధాని ఎక్స్‌ప్రెస్, శతాబ్ది ఎక్స్‌ప్రెస్, దురంతో ఎక్స్‌ప్రెస్.. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లలో ఆహార ఎంపికలను విస్తరించాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచ మధుమేహ రాజధానిగా గుర్తింపు పొందుతోంది. ఇక్కడ దాదాపు 220 మిలియన్ల మంది టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. కాగా ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గతంలో వృద్ధులు మాత్రమే ఈ వ్యాధితో బాధపడేవారు. కానీ ఇప్పుడు యువకులు కూడా పెద్ద సంఖ్యలో దీనికి బలైపోతున్నారు. ది లాన్సెట్ 2023 నివేదిక ప్రకారం.. భారతదేశంలో 212 మిలియన్ల మంది




డయాబెటిక్ రోగులు ఉన్నారు. ఈ సంఖ్య చైనాలో 149 మిలియన్లు, యునైటెడ్ స్టేట్స్‌లో కేవలం 42 మిలియన్లు మాత్రమే. దీని అర్థం చైనా %ఒ% యునైటెడ్ స్టేట్స్ రెండింటి సంఖ్యలను కలిపినా, మొత్తం ఇప్పటికీ 191 మిలియన్లుగానే ఉంది. ఒక్క భారతదేశంలో మాత్రమే 210 మిలియన్లకు పైగా డయాబెటిక్ రోగులు ఉన్నారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు.. తులం ఎంతంటే..?



దీపావళి తర్వాత క్రమంగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు ఇవాళ స్వల్పంగా పెరిగాయి. శనివారం ట్రేడింగ్‌లో తులంపై రూ.1,250 పెరిగింది. దీంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,25,620కి చేరింది. అటు 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,150 పెరిగి రూ.1,15,150గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 25, 770కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 15, 300కి చేరుకుంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1.70 లక్షల వద్ద కొనసాగుతోంది.

## 2025 ఏడాదికి రెండు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న ఎస్‌బీఐ



దేశీయ ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) అరుదైన గౌరవం దక్కించుకుంది. 2025 ఏడాదికి సంబంధించి ఎస్‌బీఐ ప్రపంచంలోనే ఉత్తమ కన్స్యూమర్ బ్యాంక్, భారత ఉత్తమ బ్యాంకు అవార్డులను సొంతం చేసుకుంది.గురువారం ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వార్షిక సమావేశాల సందర్భంగా జరిగిన గ్లోబల్ ఫైనాన్స్ అవార్డు ప్రధానోత్సవంలో న్యూయార్క్‌లోని గ్లోబల్ ఫైనాన్స్ నుంచి ఈ ప్రశంసలను అందుకుంది. ఈ రెండు ప్రతిష్టాత్మక గుర్తింపు ద్వారా ఆవిష్కరణ, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, కస్టమర్ సేవలకు కట్టుబడి ఉన్న ప్రపంచ బ్యాంకింగ్ లీడర్‌గా ఎస్‌బీఐ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని బ్యాంకు అధికారిక ప్రకటనలో తెలిపింది. భారత్ లాంటి విభిన్నమైన భౌగోళిక ప్రాంతంలో టెక్నాలజీ లీడర్‌సిప్‌ని కొనసాగిస్తూ, సేవలను విస్తరించే సమయంలో కస్టమర్లకు ప్రపంచ స్థాయి బ్యాంకింగ్ అనుభవాన్ని అందించడంలో ఎస్‌బీఐ సాధించిన విజయానికి ఈ అవార్డులు ప్రతిబింబిస్తాయని బ్యాంకు అభిప్రాయపడింది. దీనిపై స్పందించిన ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి.. ఎస్‌బీఐ రోజువారీ నాణ్యమైన సేవలను, నిబద్ధతను గ్లోబల్ ఫైనాన్స్ గుర్తించడం ఎంతో గౌరవంగా ఉంది. 52 కోట్ల మంది కస్టమర్లకు సేవలందించడానికి, రోజూ 65 వేల మంద్ కొత్త కస్టమర్లను సంపాదించడానికి సాంకేతికత, డిజిటలైజేషన్‌లో భారీ పెట్టుబడులు అవసరం. 'డిజిటల్ ఫస్ట్, కన్స్యూమర్ ఫస్ట్' బ్యాంకుగా, మా ఫ్లాగ్‌షిప్ మొబైల్ అప్లికేషన్ కోటి మంది రోజువారీ యాక్టివ్ యూజర్లతో 10 కోట్లకు పైగా కస్టమర్లకు సేవలందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## గ్రంథ చౌర్యంపై ఆర్‌బీఐ - ఎస్‌బీఐ..
# రచ్చకెక్కిన ఆర్థికవేత్తలు



దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థికవేత్తల మధ్య వివాదం నెలకొంది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ రిపోర్టులను ఎలాంటి క్రెడిట్ ఇవ్వకుండానే ఎస్‌బీఐ రీసెర్చర్లు గ్రంథ చౌర్యానికి పాల్పడ్డారంటూ ఆర్‌బీఐకి చెందిన రీసెర్చర్ ఆరోపించడంతో ఈ వివాదం ప్రారంభమైంది. దీన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ బృందం ఖండించింది. లింక్డిన్ వేదికగా ఈ వ్యవహారం రచ్చకెక్కింది. ఆర్‌బీఐకి చెందిన ఎకనమిస్టు సార్థక్ గులాటీ తొలుత ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ రీసెర్చ్ రిపోర్టులను ఎస్‌బీఐకి చెందిన ఎకోర్రాప్ రీసెర్చ్ బృందం తస్కరిస్తోందని ఆరోపించారు. తమ నివేదిల్లోని కొన్ని పేరాలు, చార్టులు, ప్రజంటేషన్లు కూడా తమ నుంచి సేకరించిన వేనని పేర్కొన్నారు. ఇలా గ్రంథచౌర్యానికి పాల్పడుతూ కనీసం అట్రిబ్యూట్ కూడా ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. ఎస్‌బీఐ ఎకోర్రాప్ వెలువరించిన జులై నివేదికలో ఆర్‌బీఐ ఏప్రిల్ నెల వెలువరించిన మానిటరీ పాలసీ రిపోర్టులోని అంశాలే ఉన్నాయని పేర్కొన్నారు. అక్టోబర్‌లోనూ ఇలాంటిదే పునరావృతం అయ్యిందంటూ సంబంధిత స్క్రీన్‌షాట్లను తన లింక్డిన్ పోస్టులో పొందుపరిచారు. ఈ ఆరోపణలను సౌమ్యకాంతి ఘోష్ నేతృత్వంలోని ఎస్‌బీఐ ఎకోర్రాప్ రీసెర్చ్ బృందం ఖండించింది. సంచలనం కోసం చేసిన ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఈ మేరకు రీసెర్చ్ బృందం సభ్యుడు తపస్ పరిడా అదే లింక్డిన్ వేదికగా పోస్టులు పెట్టారు. తమ మెథడాలజీ పూర్తి స్వతంత్రంగా రూపొందిందని చెప్పారు. పరిశోధన నివేదికనల్లో డేటా పాయింట్ల మధ్య సారుప్యతలు ఉండడం సహజమని పేర్కొన్నారు. ఈ డేటా పాయింట్లకు మూలం ఒకటే కావడమే ఇందుక్కారణమని వివరించారు. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ నుంచి సేకరించిన డేటానే అక్టోబర్‌లో రెండు సంస్థలూ ఉదహరించాయని పేర్కొన్నారు. తన వాదనకు అవసరమైన నివేదికను కూడా తన పోస్టుకు జత చేశారు. దీనిపై ఎస్‌బీఐ, ఆర్‌బీఐ ప్రతినిధులు ఇంకా స్పందించలేదు.

## వ్యాపార విస్తరణకు కీలకంగా భారత్

భవిష్యత్తులో వ్యాపార విస్తరణ ప్రణాళికలకు సంబంధించి భారత్ కీలకంగా ఉంటుందని అమెరికన్ ఐటీ దిగ్గజం సేల్స్‌ఫోర్స్ సీఈవో మార్క్ బెనియాఫ్ చెప్పారు. దక్షిణాసియా కార్యకలాపాలకు సారథ్యం వహిస్తున్న అరుంధతి భట్టాచార్య (గతంలో ఎస్‌బీఐ చైర్‌పర్సన్) నాయకత్వాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. భారత్‌లో తమ సంస్థను గొప్పగా తీర్చిదిద్దుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ దిశగా అరుంధతి అత్యుత్తమంగా సేవలు అందిస్తున్నారని బెనియాఫ్ పేర్కొన్నారు. ఆమె నాయకత్వంలో కంపెనీ కార్యకలాపాలు అనేక రెట్లు విస్తరించాయని కంపెనీ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం 'డ్రీమ్‌ఫోర్స్ 2025'లో పాల్గొన్న సందర్భంగా వివరించారు. మరోవైపు, గతంలో ఎన్నడూ లేనంత సమర్థవంతంగా పని చేసేందుకు మనుషులకు ఏజెంటిక్ ఎంటర్‌ప్రైజ్ సహాయపడుతుందని బెనియాఫ్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతర్జాతీయంగా 41 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సేల్స్‌ఫోర్స్ అంచనా వేస్తోంది.

# ఆఖరి వన్డేలో ఆస్ట్రేలియాను చిత్తుచిత్తుగా ఓడించిన భారత్

భారత్-అస్ట్రేలియా దేశాల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇవాళ జరిగిన మూడో వన్డేలో భారత బ్యాటర్‌లు అద్భుత ప్రదర్శన కనబర్చారు. ముఖ్యంగా సీనియర్ బ్యాటర్‌లు రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ చెలరేగి ఆడటంతో ఆస్ట్రేలియా ఘోర పరాజయం పాలైంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 46.4 ఓవర్లలో 236 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. 237 పరగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియా కేవలం 38.3 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. 9 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో రెన్‌షా (56) మాత్రమే అర్ధశతకం సాధించాడు. మిచెల్ మార్ష్ (41), ట్రావిస్ హెడ్ (29), మాథ్యూ షార్ట్ (30), అలెక్స్ క్యారీ (24), కూపర్ కాన్లీ (23) పరవాలేదనిపించారు. ఆఖరులో బౌలర్ నాథన్ ఎలిస్ (16) కాస్త మెరుపులు మెరిపించినా మిగతా వాళ్లు పూర్తిగా విఫలమయ్యారు. భారత బౌలర్‌లలో హర్షిత్ రాణా తన సత్తా చూపించాడు. 8.4 ఓవర్లలో 39 పరుగులిచ్చి ఏకంగా నాలుగు వికెట్లు తీశాడు. వాషింగ్టన్ సుందర్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఇక సిరాజ్, ప్రసిద్ధ్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ దక్కించుకున్నారు. భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ (121) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. 125 బంతుల్లో అజేయంగా 121 (13ఐ4, 6ఐ3) పరుగులు చేశాడు. రోహిత్‌కు జతగా ఓపెనర్‌గా క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ (24) ధాటిగానే ఆటను ప్రారంభించినా 24 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. వన్‌డౌన్‌గా బరిలో దిగిన కోహ్లీ (74బీ 7ఐ4) రోహిత్ శర్మతో కలిసి ఆసీస్ టీమ్‌కు చుక్కలు చూపించారు. అయితే మూడు వన్డేల సిరీస్‌లో మొదటి రెండు వన్డేలు గెలిచిన ఆస్ట్రేలియాకు ట్రోఫీ దక్కింది. సిరీస్‌ను 2-1 తేడాతో ఆసీస్ గెలుచుకుంది.



### ఆస్ట్రేలియాతో మూడో వన్డే.. రోహిత్ శర్మ, కోహ్లీ నెలకొల్పిన రికార్డులివీ..

ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన టీమ్‌ఇండియా మూడో వన్డేలో ఘన విజయం సాధించింది. తొలుత కంగారూలను 236 పరుగులకే కట్టడి చేసిన భారత జట్టు.. 38.3 ఓవర్లలోనే ఒకే వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రోహిత్ శర్మ (121బీ 125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సులు) 'శత'క్కొట్టాడు. వన్డేల్లో హిట్‌మ్యాన్‌కిది 33వ సెంచరీ. విరాట్ కోహ్లీ (74లిబీ 81 బంతుల్లో 7 ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించాడు. రోహిత్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్, కోహ్లీ నెలకొల్పిన రికార్డులు..

ఆస్ట్రేలియాలో అత్యధిక వన్డే సెంచరీలు (6) చేసిన విదేశీ బ్యాటర్‌గా నిలిచిన రోహిత్. విరాట్ కోహ్లీ (5), కుమార సంగక్కర (5)లను అధిగమించాడు.

ఆస్ట్రేలియా గడ్డపై వన్డేల్లో రెండుసార్లు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్న తొలి భారత బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పిన హిట్‌మ్యాన్

వన్డే చరిత్రలో లేటు వయసులో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్న భారత ఆటగాడిగా నిలిచిన రోహిత్

వన్డేల్లో ఆస్ట్రేలియాపై రోహిత్‌కిది తొమ్మిదో సెంచరీ. దీంతో సచిన్ తెందూల్కర్ (9), విరాట్ కోహ్లీ (9)ని సమం చేశాడు. అంతర్జాతీయ కెరీర్‌లో రోహిత్‌కిది 50వ సెంచరీ. ఇప్పటివరకు టెస్టుల్లో 12, వన్డేల్లో 33, టీ20ల్లో ఐదు శతకాలు చేశాడు. ఈ క్రమంలోనే మూడు ఫార్మాట్లలో ఐదు లేదా అంతకంటే ఎక్కువ సెంచరీలు చేసిన ఏకైక బ్యాటర్ రోహితే.

తాజా ఇన్నింగ్స్‌తో వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో కుమార సంగక్కర (14,234)ని అధిగమించి కోహ్లీ (14,255) రెండో స్థానానికి చేరుకున్నాడు. సచిన్ (18,426) అగ్రస్థానంలో ఉన్నాడు.

వన్డేల్లో ఛేజింగ్‌లో అత్యధిక (70)సార్లు 50ం స్కోర్లు చేసిన ఆటగాడిగా కోహ్లీ ఘనత సాధించాడు.

ఆస్ట్రేలియాపై అత్యధిక 50ం స్కోర్లు చేసిన బ్యాటర్‌గా సచిన్ (24) పేరిట ఉన్న రికార్డును కోహ్లీ (24) సమం చేశాడు.

రోహిత్, కోహ్లీ ఇప్పటివరకు 12సార్లు 150కిపైగా భాగస్వామ్యాలు నెలకొల్పారు. సచిన్, గంగూలీ కూడా ఇన్నేసార్లు 150కిపైగా భాగస్వామ్యాలు సాధించారు.

క్రీడా వాయిస్

## సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మ



టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ తన అంతర్జాతీయ క్రికెట్ పునరాగమనంలో సత్తాచాటుతున్నాడు. మొన్న అడిలైడ్‌లో తృటిలో సెంచరీ మిస్ చేసుకున్న హిట్‌మ్యాన్.. ఇప్పుడు సిడ్నీలో మాత్రం ఎటువంటి తప్పిదం చేయలేదు. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో రోహిత్ శర్మ అద్భుతమైన శతకంతో చెలరేగాడు. కేవలం 105 బంతుల్లోనే 11 ఫోర్లు, 2 సిక్సల సాయంతో తన సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. రోహిత్‌కు ఇది 33వ వన్డే సెంచరీ కావడం విశేషం. 237 పరుగుల స్వల్ప లక్ష్య చేధనలో ఆసీస్ బౌలర్లకు రోహిత్ చుక్కలు చూపించాడు. తొలుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి మొదటి వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రోహిత్.. ఆ తర్వాత మరో సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లితో ?కలిసి జట్టును విజయం దిశగా నడిపిస్తున్నాడు. రోహిత్ సెంచరీ మార్క్‌ను అందుకోగానే సిడ్నీ స్టేడియం దద్దరిల్లిపోయింది. మొత్తంగా 125 బంతులు ఎదుర్కొన్న రోహిత్.. 13 ఫోర్లు, 3 సిక్సలతో 121 పరుగులు చేశాడు. అతడితో పాటు విరాట్ ?కోహ్లి(74 నాటౌట్) హాఫ్ సెంచరీతో మెరిశాడు. వీరిద్దరి సూపర్ ఇన్నింగ్స్‌ల ఫలితంగా లక్ష్యాన్ని భారత్ కేవలం? ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 38.3 ఓవర్లలో చేధించింది.






# మరో సీక్వెల్‌లో ప్రభాస్.. రెండేళ్లు ఆగాల్సిందే?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ షెడ్యూల్ ఇప్పుడు చాలా బిజీగా ఉంది. ఆయన నటించిన ది రాజాసాబ్ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. మరోవైపు హను రాఘవపూడి దర్శకత్వంలో 'పౌజీ' సినిమా చేస్తున్నాడు. దీంతో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ చేయబోతున్నాడు. మరోవైపు సలార్, కల్కి చిత్రాలకు సీక్వెల్స్ కూడా చేయబోతున్నాడు. ఇంత బిజీగా ఉన్న ప్రభాస్.. తాజాగా మరో సీక్వెల్‌కి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. అదే ది రాజాసాబ్ 2. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ 'ది రాజాసాబ్'(%ఉష్ట్రవ ఝయ్యి ఝ్యిఎ%) సినిమా చేశాడు. ఇప్పటికే షూటింగ్ అంతా కంప్లీట్ అయిపోయింది. పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ చిత్రానికి సీక్వెల్ ఉంటుందని గతంలో వార్తలు వచ్చాయి. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కూడా సీక్వెల్‌పై స్పష్టత ఇచ్చాడు. 'రాజాసాబ్ 2' ఉంటుందని.. కాకపోతే ఇది తొలి భాగానికి కొనసాగింపులా ఉండదని.. థీమ్, సెటప్ ఒకే తరహాలో ఉంటాయని ఓ ప్రెస్‌మీట్‌లో ఆయన చెప్పారు. అయితే అప్పటికీ మారుతి కథ సిద్ధం చేయలేదు. కానీ ప్రభాస్ మాత్రం మారుతితో మరోసారి పని చేయడానికి ఆసక్తి చూపించాడట. దీంతో మారుతి ఇటీవల రాజాసాబ్ 2 స్టోరీకి సంబంధించిన లైన్‌ని ప్రభాస్‌కి చెప్పాడట. అది బాగా నచ్చడంతో 'చేసేద్దాం డార్లింగ్'అని ప్రభాస్ చెప్పినట్లు సమాచారం. ప్రభాస్ ఇప్పుడు పౌజీ షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ కాగానే..వెంటనే 'స్పిరిట్'చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లబోతున్నాడు.

# రజినీకాంత్ అరుణాచలం కాంబో రిపీట్.. క్రేజీ టాక్ నిజమైతే రికార్డులే..!



తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం జైలర్ 2తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్‌లో యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. మరోవైపు కమల్‌హాసన్‌తో కలిసి మల్టీ స్టారర్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. కమల్ హాసన్ నిర్మించనున్న ఈ చిత్రానికి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించబోతున్నాడంటూ వార్తలు వస్తుండగా తలైవా టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. రజినీకాంత్ మరో సినిమాకు ప్లాన్ చేస్తున్నాడన్న ఆసక్తికర అప్‌డేట్ ఇప్పుడు అభిమానులను ఖుషీ చేస్తోంది. తలైవా పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ సుందర్ సీతో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడన్న వార్త ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. హార్రర్ కామెడీ ఫ్రాంచైజీ అరణ్మనైని తెరకెక్కించడంలో సుందర్‌కున్న సూపర్ పాపులారిటీ గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. రజినీకాంత్-సుందర్ సీ కాంబోలో వచ్చిన అరుణాచలం ఏ స్థాయిలో బాక్సాఫీస్‌ను షేక్ చేసిందో తెలిసిందే. ఈ సూపర్ హిట్ కాంబోలో సినిమా వస్తుందంటే బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగడం ఖాయమైనట్టేనంటున్నారు ట్రేడ్ పండితులు. ఈ చిత్రాన్ని తమిళ యాక్టర్ కమ్ పొలిటీషియన్ ఉదయనిధి స్టాలిన్ రెడ్ జియాంట్ మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమాను తెరకెక్కించనున్నాడట. మరి రానున్న రోజుల్లో సుందర్ సీ, రజినీకాంత్ నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.

# తండ్రి కాబోతున్న దగ్గుబాటి హీరో?




టాలీవుడ్ హీరో రానా తండ్రి కాబోతున్నారు. త్వరలోనే దగ్గుబాటి ఇంట్లోకి వారసుడు/ వారసురాలు రాబోతున్నారు. రానా సతీమణి మిహిక బజాజ్ గర్భం దాల్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని రానా ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఓ మంచి రోజు చూసి ఈ గుడ్ న్యూస్‌ని తన అభిమానులతో పంచుకోవాలని రానా భావిస్తున్నారట. గతంలోనూ మిషికా ప్రెగ్నెంట్ అంటూ నెట్టింట ప్రచారం జరిగింది. ఈ వార్తలను రానా దంపతులిద్దరూ కొట్టిపారేశారు. చాలా కాలం తర్వాత మరోసారి రానా తండ్రి కాబోతున్నారనే వార్తలు వచ్చాయి. ఈ సారి కూడా పుకారుగానే మిగిలిపోతుందా? లేదా నిజంగానే రానాకి ప్రమోషన్ వచ్చిందా అనేది తెలియాలంటే వాళ్లు స్పందించేవరకు ఆగాల్సిందే. రానా, మిహికాలది ప్రేమ వివాహం. ముంబైలో ఇంటీరియర్ డిజైనర్‌గా పని చేసే మిహీకా స్వస్థలం హైదరాబాద్. చిన్నప్పటి నుంచి ఒకరికొకరు తెలుసు. కానీ లాక్‌డౌన్ సమయంలో వీరిద్దరు ప్రేమలో పడినట్లు ఓ ఇంటర్వ్యూలో రానా చెప్పారు. వీరిద్దరి పెళ్లి 2020 ఆగస్టు 8న జరిగింది. పెళ్లి తర్వాత ఈ జంట ఎక్కువగా ముంబైలోనే ఉంటుంది. రానా వారసత్వంగా వస్తున్న వ్యాపారాలను చూసుకుంటూనే.. నిర్మాతగా, నటుడిగానూ కొనసాగుతున్నాడు.

# వారి అహంకారం ముందు మౌనంగా ఉండటమే మేలు



పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకురావాలంటే కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సి వస్తుందన్నారు నటి జాన్వీకపూర్ తాను ఎన్నోసార్లు అలా ఉన్నానని చెప్పారు. పరిశ్రమలో కొన్నిసార్లు ఎదుర్కొంటోన్న సమస్యలపై ఆమె 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్శకనిర్మాత కరణ్‌జోహార్‌తో కలిసి జాన్వీ సందడి చేశారు. "సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. అయినప్పటికీ కొన్ని విషయాలు ఇక్కడికి వచ్చాకే నేర్చుకున్నాను. ఇక్కడ కొనసాగాలంటే పురుష అహంకారాన్ని ఎదుర్కోవాలి. నలుగురు మహిళలు ఉన్న ప్రదేశంలో నేను ధైర్యంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను.. కానీ, అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నేను నా అభిప్రాయాన్ని వ్యక్తంచేయలేను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా వెల్లడించాల్సి ఉంటుంది. దీనికి చాలా నేర్పు ఉండాలి. నేను ఈ విషయంలో ఎన్నో పోరాటాలు చేశాను. ఒక్కోసారి మనల్ని మనం తక్కువ చేసుకోవాలి. ఎంత గొప్పగా నటించే సామర్థ్యం ఉన్నప్పటికీ అవతలి వారి కోసం కొంచెం తగ్గి నటించాల్సి వస్తుంది. అలాగే మరికొన్నిసార్లు మనకు నచ్చని విషయాలను 'ఇది నాకు నచ్చలేదు.. నేను చేయను' అని చెప్పే బదులు.. నాకు అర్థం కావడం లేదు అని చెప్పాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఎన్నో రాజకీయాలను ఎదుర్కోవాలి" అని జాన్వీకపూర్ చెప్పారు. ఈ విషయాలన్నీ ఆ షో వ్యాఖ్యాతల్లో ఒకరైన ట్వింకిల్ ఖన్నా అంగీకరించారు. తాను కూడా 1990ల్లో పరిశ్రమలో ఉన్నప్పుడు ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయం తనకు ఇప్పటికీ అర్థం కాదని పేర్కొన్నారు. ఇటీవల కూడా జాన్వీకపూర్ నెపోటిజం గురించి తన అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారు కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. తాజాగా జాన్వీ రొమాంటిక్ కామెడీ చిత్రం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'తో పలకరించారు. ప్రస్తుతం రామ్‌చరణ్-బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న 'పెద్ది'లో నటిస్తున్నారు. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీని షెడ్యూల్ శ్రీలంకలో జరుగుతోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో క్రీడా నేపథ్యమున్న అంశాలకు ప్రాధాన్యం ఉంది. టైటిల్‌కు తగ్గట్లుగానే ఇందులో చరణ్ కూలీగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది.

# కుమారి మళ్లీ వచ్చేస్తుంది.. క్రేజీ సీక్వెల్‌కు సుకుమార్ టీం రెడీ!




చిన్న సినిమాగా వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సినిమాల్లో టాప్‌లో ఉంటుంది కుమారి 21 ఎఫ్. ముంబై భామ హెబ్బా పటేల్ తెలుగులో లీడ్ హీరోయిన్‌గా తొలిసారి ఈ సినిమాతో సూపర్ హిట్టందుకుంది. రాజ్ తరుణ్ హీరోగా నటించిన ఈ మూవీని పల్నాటి సూర్య ప్రతాప్ డైరెక్ట్ చేయగా.. పాపులర్ రైటర్ కమ్ డైరెక్టర్ సుకుమార్ కథనందించాడు. అప్పట్లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన ఈ మూవీకి సీక్వెల్ రాబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఫుల్ ఖుషీ చేస్తోంది.ఫిలింనగర్ సర్కిల్ కథనాల ప్రకారం కుమారి 21%ఫీ% సీక్వెల్‌కు కుమారి 22%ఫీ% టైటిల్ కూడా ఫిక్స్ చేశారట. ఈ సినిమాను సుకుమార్ సతీమణి తబిత సుకుమార్ తన కొత్త ప్రొడక్షన్ బ్యానర్‌లో నిర్మించనుండటం విశేషం. త్వరలోనే ఈ క్రేజీ సీక్వెల్ ప్రకటన ఉండబోతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. చివరగా 18 పేజెస్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు డైరెక్టర్ పల్నాటి సూర్య ప్రతాప్. మరి కుమారి 22%ఫీ%ను పల్నాటి సూర్య ప్రతాప్ డైరెక్ట్ చేస్తాడా..? లేదంటే కొత్త దర్శకుడు ఈ ప్రాజెక్టును టేకోవర్ చేస్తాడా.. ? అనేది తెలియాల్సి ఉంది. సీక్వెల్‌లో కూడా హెబ్బా పటేల్ టైటిల్ రోల్‌లో కనిపిస్తుందా అనేది క్లారిటీ రావాల్సి ఉంది. మరి సుకుమార్ సీక్వెల్ కోసం ఎలాంటి స్టోరీ సిద్ధం చేశాడనేది ఆసక్తికరంగా మారింది. సీక్వెల్‌పై రాబోయే రోజుల్లో ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందనేది చూడాలి. కాగా సుకుమార్ ప్రస్తుతం రాంచరణ్‌తో చేయబోతున్న సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నాడు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com